ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

మంగళవారం | 18-08- 2026 సంపుటి: 17, సంచిక: 136, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీతో

## 2 లక్షల మందికి ఉపాధి

**ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం) : జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్

తరువాయి 2వ పేజీలో...

### పేదల ఆరోగ్యం..

# మా బాధ్యత

## టిమ్స్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం

**పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత**

**ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**

**గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు**

**ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం) : తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్య లు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత**

పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.

**టిమ్స్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం**

తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను

తరువాయి 2వ పేజీలో...



### ముసాయిదా ఓటర్ల

# జాబితా విడుదల

## జాబితాలో పేరు లేకపోతే ఫారం-6తో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం) : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. 2026 ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఓటరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. పేరు గల్లంతైన వారు, తప్పుగా తొలగించబడిన వారు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత ప్రక్రియ ద్వారా తిరిగి నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో సుమారు 2 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.30 శాతానికి సమానమని తెలిపారు. సర్వే సందర్భంగా పలువురు ఓటర్లు తమ చిరునామాల్లో అందుబాటులో లేకపోవడం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారడం, మరణించడం లేదా ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు నమోదై ఉండడం

తరువాయి 2వ పేజీలో...

# ఎన్‌టీఏ ప్రక్షాళన

## 50 మందికి పైగా సిబ్బంది తొలగింపు..!




న్యూఢిల్లీ: నీట్ యూజీ -2026 పేపర్ లీక్, యూజీసీ నెట్ పరీక్షలో లోపాలు.. పరీక్షల రద్దు.. ఇలా వరుస పరిణామాలతో కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌టీఏ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే దాదాపు 50 మందికి పైగా సిబ్బందిని తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వీరి స్థానంలో 10 కొత్త వృత్తిపరమైన పోస్టులు ఏర్పాటు చేసి, నియామకాలు చేపట్టాలని ఎన్‌టీఏ భావిస్తోందని సమాచారం.

తరువాయి 2వ పేజీలో...

### 'కల్యాణ లక్ష్మి' కాదు..

# 'సంతాన లక్ష్మి'

## లక్షకు పైగా కల్యాణ లక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో...

**పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుడుతున్నా పైసలు రావడం లేదు..**

**ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం**

**మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**




హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం) : రాజ్యాంగంలోని ఆర్టికల్ 35 నుంచి 51 వరకు స్పష్టంగా చెబుతున్నది ఏంటంటే.. సంక్షేమం అనేది రాజ్యం ప్రాథమిక విధి. నాడు కేసీఆర్ అధికారంలోకి రాగానే ఏకంగా 42 సంక్షేమ పథకాలకు ఒకేసారి ఆమోదముద్ర వేశారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ముందుగా చెప్పకపోయినా.. ఆడబిడ్డలకు అండగా ఉండాలనే బాధ్యతతో అధికారంలోకి రాగానే 'కల్యాణ లక్ష్మి'ని తెచ్చి అమలు చేశాం. పక్క రాష్ట్రం తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ 100 రోజుల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు 8 గ్రాముల బంగారం ఇస్తామని మాట ఇచ్చి, చెప్పినట్టే అమలు చేస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం కల్యాణ లక్ష్మి దరఖాస్తులు ఏకంగా లక్షకు పైగా పెండింగ్‌లో మూలుగుతున్నాయి. పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుడుతున్నా పైసలు రావడం లేదు..

తరువాయి 2వ పేజీలో...

# బీజేపీ కొత్త టీమ్

**ముఖ్య నేతలకు పార్టీలో కీలక బాధ్యతలు**

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ**



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ కొత్త టీమ్‌ను ప్రకటించింది. అనేక మంది ముఖ్య నేతలకు.. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ.. పార్టీ కేంద్ర కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ పేరును ప్రకటించారు.

తరువాయి 2వ పేజీలో...

### పేదల కన్నీళ్లతో

# ప్రభుత్వం నడవదు

**- ప్రభుత్వం ల్యాండ్ బ్రోకరా.. భూములు అమ్ముకునే కంపెనీనా?**

**- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఆగస్టు 17 (ప్రజాకలం) : దళిత రైతుల భూముల వ్యవహారంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పేదల భూముల జోలికి వస్తే ఎంతటి అధికార యంత్రాంగమైనా ఎదిరించి పోరాడుతామని హెచ్చరించారు. దుండిగల్ బౌరంపేటలో దళిత రైతులు చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఆయన.. బాధిత రైతులతో కలిసి వారి పొలాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వం పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని రైతులు చెప్పడంతో తీవ్రంగా స్పందించారు.

**"పేదల భూములు గుంజుకోవడమే పాలనా?**

ప్రభుత్వం అంటే ల్యాండ్ బ్రోకర్‌నా?" అంటూ ఈటల రాజేందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పేదల భూములను గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే పరిస్థితి తెలంగాణలో ఎప్పుడూ లేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆరోపించారు. భూముల విషయంలో రేవంత్‌రెడ్డి రీసెర్చ్ స్కాలర్‌గా మారారని ఎద్దేవా చేశారు.

తరువాయి 2వ పేజీలో...

### పొంగులేటి అభయం..

**నిరుద్యోగులకు 'రైట్ ఛాయిస్'!**

**- ఖమ్మం, కొత్తగూడెంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్**

**- పోస్టర్‌ను ఆవిష్కరించిన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి**

9

## కలం కౌంటర్




### తప్పు ఎన్‌టీఏది..

# శిక్ష విద్యార్థులకా?

## ఎన్‌టీఏ తీరుపై రాహుల్ గాంధీ ఆగ్రహం

**ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోంది**



న్యూఢిల్లీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు,

తరువాయి 2వ పేజీలో...

# పేదల ఆరోగ్యం.. మా బాధ్యత

మొదటి పేజీ తరువాయి...

మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**2027 డిసెంబర్ నాటికి ఆస్పత్రుల నిర్మాణం పూర్తి**

2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంది

మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి

ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది

అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రతంభించుకున్నాం

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు ఖర్చు చేశాం

సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం

ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం

రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం

ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే.... పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు

టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు

మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం

ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి

2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం

ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం

కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నా

పేదలకు వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ఉంది.. మా రేవంతన్న ఉన్నాడు అనేలా ప్రజలకు నమ్మకం కలిగించండి

మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు

కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట

అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట..

మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా?

మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు?

మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు

కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా?

ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..

నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయి

కానీ అబద్ధపు ప్రచారాలతో ఏదో చేయాలనుకుంటే ప్రజలు నమ్మరు

కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా

వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటా

# ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మొదటి పేజీ తరువాయి...

వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గైర్హాజరు, చిరునామా మార్పు, మృతి, డూప్లికేట్ వంటి అంశాల ఆధారంగా పలువురిని ఏఎస్‌డీడీ కేటగిరీలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73,39,235 మంది ఈ కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన పరిశీలనలో సేకరించిన వివరాల ఆధారంగానే ఈ జాబితాను రూపొందించినట్లు సమాచారం.

**పేరు లేకపోతే ఫారం-6 తప్పనిసరి**

ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు కనిపించని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల శాఖ స్పష్టం చేసింది. కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి లేదా జాబితా నుంచి గల్లంతైన పేరును తిరిగి చేర్చించుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారు కూడా తమ అర్హతను నిరూపించే అవసరమైన పత్రాలతో ఫారం-6 సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు వయస్సు, గుర్తింపు, నివాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, కుటుంబ సభ్యుల్లో ఒకరి వివరాలు, పూర్తి చిరునామా, ఇప్పటికే ఓటర్ ఐడీ నంబర్ ఉంటే ఆ వివరాలను కూడా దరఖాస్తులో నమోదు చేయాలి. సంబంధిత అధికారులు పరిశీలించిన అనంతరం అర్హులైన వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చనున్నారు.

**వివరాల్లో తప్పులుంటే ఫారం-8తో సవరణ**

ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేరు ఉన్నప్పటికీ పేరు స్పెల్లింగ్, ఫోటో, చిరునామా లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ఈ సవరణలకు అవకాశం కల్పించారు. చిరునామా మార్పు వంటి అంశాలకు కూడా నిబంధనలకు అనుగుణంగా అవసరమైన వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకునేందుకు ముసాయిదా జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

**అక్టోబర్ 19న తుది జాబితా**

ముసాయిదా జాబితాపై అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. దీంతో ఓటర్లు చివరి తేదీల వరకు వేచి చూడకుండా ముందుగానే తమ వివరాలను తనిఖీ చేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. తమ పేరు జాబితాలో ఉందా? వివరాలు సరిగ్గా ఉన్నాయా? చిరునామా, ఫోటో, ఇతర సమాచారం సక్రమంగా నమోదైందా? అనే అంశాలను ప్రతి ఓటరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. అవసరమైతే ఫారం-6 లేదా ఫారం-8 ద్వారా వెంటనే దరఖాస్తు చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఎన్నికల శాఖ విజ్ఞప్తి చేసింది.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

మొదటి పేజీ తరువాయి...

కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కొత్త టీమ్

మొదటి పేజీ తరువాయి...

ఇక రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే, బయజయంత్ జయ పాండా, రేఖా వర్మ, తారిక్ మన్సూరులు.. జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. వినోద్ తవడే, సునిల్ భన్సల్ మాత్రం జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీఎల్ సంతోష్ యదావిధిగా కొనసాగనున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనిల్ అంథోనీ కొనసాగుతారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో ప్రస్తుతం ఆరు మంది మహిళలు ఉన్నారు. కానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో కేవలం స్మృతి ఇరానీ ఒక్కరు మాత్రమే ఏకైక మహిళా నేత. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తాజా నియామకాలపై ప్రకటన చేశారు. తక్షణమే ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. జాతీయ ఉపాధ్యక్ష పదవుల్లో ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీర్థ సింగ్ రావత్, డీ పురంధీశ్వరి, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్యా, ఎం నాగరాజ, మధు చంద్ర కార్ ఉన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో స్మృతి ఇరానీతో పాటు వినోద్ తవడే, సునిల్ భన్సల్, బిప్లబ్ కుమార్ దేబ్, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత.. స్మృతి ఇరానీకి సంస్థా గతంగా తొలిసారి కీలక బాధ్యతలు అప్పగించారు.

# ఎన్‌టీఏ ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి...

ఈ క్రమంలోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి.. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దీప్తి గౌర్ ముఖర్జీ, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎన్‌టీఏ తమ సమగ్ర పరీక్షా విధానాన్ని సంస్కరించడానికి తీసుకున్న చర్యల గురించి కేంద్రమంత్రికి వివరించారు. 50 మందికి పైగా చీూ సిబ్బందిని తొలగించి.. 10 కొత్త వృత్తిపరమైన కీలక పోస్టులకు ప్రకటనలు జారీ చేసి, నియామకాలు చేపడుతున్నట్లు కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. వీటిలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, టెస్ట్ సెక్యూరిటీ జనరల్ మేనేజర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ సైకోమెట్రిక్స్ జనరల్ మేనేజర్ వంటి పోస్టులు ఉండనున్నాయి. సైబర్-సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్ర రూపకల్పన, ఇతర ప్రత్యేక రంగాల కోసం NTA ప్రైవేట్ రంగం నుండి డొమైన్ నిపుణులను కూడా తీసుకోనున్నట్లు సమాచారం.

**పరీక్ష భద్రతలో సమగ్ర ప్రక్షాళన..** నిర్ధారిత పరీక్షా నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా చూడాలని, కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ నిర్మాణాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని ఎన్‌టీఏను కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, తీసుకున్న దిద్దుబాటు చర్యలపై నివేదిక సమర్పించాలని ఎన్‌టిఏను కోరారు. పరీక్షల నిర్వహణలోని వివిధ దశలలో వ్యవస్థలను బలోపేతం చేయడం, లోపాలను మూలంలోనే నివారించడం లక్ష్యంగా పని చేయాలని అధికారులకు కేంద్రమంత్రి దిశానిర్దేశం చేశారు.

**యూజీసీ-నెట్ పునఃపరీక్షతో కొత్త సమస్య..**

ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులలో తప్పులు దొర్లాయంటూ పలువురి నుంచి ఫిర్యాదులు అందాయి. వెంటనే ఎన్‌టీఏ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. మూడు పేపర్లలో అనేక వాస్తవిక, ముద్రణ దోషాలు, అనువాద లోపాలను కనుగొంది. వీటిలో ప్రముఖ పండితుల పేర్లను తప్పుగా రాయడం, అస్పష్టంగా ఉన్న పుస్తకాల శీర్షికలు, ప్రశ్నల పదజాలంలో తప్పులు, వ్యాకరణ, విరామ చిహ్నాల పొరపాట్లు, ప్రామాణికం కాని పదాలు ఉన్నట్లు కమిటీ గుర్తించింది.

అలాగే, గత పరీక్షల నుండి గణనీయమైన సంఖ్యలో ప్రశ్నలు పునరావృతమైనట్లు కమిటీ గుర్తించింది. ఈ క్రమంలోనే నిష్పక్షపాతమైన, దోషరహితమైన పరీక్ష కోసం మూడు పేపర్ల పరీక్షలను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. కమిటీ సిఫారసుతో ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ పేపర్ల పరీక్షలు తిరిగి నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.

# తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?

మొదటి పేజీ తరువాయి...

గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎక్స్‌ట్రాక్షన్ మెషీన్..**

పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు.

**రాహుల్ గాంధీకి ఊరట..**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# పేదల కన్నీళ్లతో ప్రభుత్వం నడవదు

మొదటి పేజీ తరువాయి...

**ఐదు తరాల భూములపై కన్నెందుకు?**

బౌరంపేట సర్వే నంబర్లు 472, 166లోని భూములను ఐదు తరాలుగా దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని ఈటల తెలిపారు. తరతరాలుగా వ్యవసాయం చేస్తూ పన్నులు చెల్లిస్తున్న రైతుల నుంచి ఒక్కసారిగా భూములు లాక్కోవడం దౌర్జన్యమన్నారు. గతంలో సుమారు 30 కుటుంబాలకు చెందిన భూములు ఇప్పుడు 400కుపైగా కుటుంబాలకు జీవనాధారంగా మారాయని బాధితులు తనకు వివరించారని చెప్పారు. "ఈ భూములు మా బతుకులు.. మా పిల్లల భవిష్యత్తు.. మా ఆత్మగౌరవం. మా భూములు మాకే ఇవ్వాలి. లేదంటే ప్రాణాలైనా ఇస్తాం" అంటూ మహిళలు, రైతులు కన్నీటితో చెప్పిన మాటలు ప్రభుత్వానికి వినిపించాలన్నారు.

**ఓటేసిన పాపానికి భూములు లాక్కుంటారా?**

దళిత కాలనీలు, పేదల బస్తీలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు అండగా నిలిచాయని ఈటల గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ భూమి అంటూ కాంగ్రెస్ గతంలో చెప్పుకున్న విషయాలను ప్రస్తావిస్తూ.. "కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపానికి ఇప్పుడు అదే పేదల భూములను గుంజుకుంటారా?" అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంటూ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. ఇప్పుడు పేదల చేతిలో ఉన్న భూములను కూడా లాక్కుంటే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

**భూమి పోతే పేదవాడి బతుకు పోయినట్టే**

పేదవాడికి భూమి కేవలం ఆస్తి కాదని, అది అతడి ఆత్మగౌరవమని ఈటల అన్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూముల నుంచి రైతులను బలవంతంగా వెళ్లగొట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి భూమి అవసరమైతే ముందుగా రైతులతో చర్చించాలని, వారికి న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ భూమి కల్పించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**హైడ్రా.. భూభారత్‌పై విరుచుకుపాటు**

హైడ్రా పేరుతో అర్ధరాత్రి ఫెన్సింగ్‌లు వేయడం, పేదల భూములపై అధికారుల ఒత్తిడి తీసుకురావడం ఆపాలని ఈటల డిమాండ్ చేశారు. ధరణి పేరుతో పేదల భూములకు ఇబ్బందులు కలిగించారని, ఇప్పుడు భూభారత్ పేరుతో మరో విధంగా పేదల భూములను గుంజుకునే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. "కంచె చేనును మేసినట్టు ప్రభుత్వం పేదల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోం" అని స్పష్టం చేశారు.

**దళిత భూములతో జీతాలా?**

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవడానికి దళితుల భూములను అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని ఈటల ఆరోపించారు. "దళితుల భూములు అమ్మి ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి రావడం ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడాల్సింది పోయి వాటిపై కన్నేయడం సిగ్గుచేటన్నారు.

**బీజేపీ వెనక్కి తగ్గదు**

బౌరంపేట దళిత రైతుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఈటల రాజేందర్ ప్రకటించారు. ఒక్క రైతుకు అన్యాయం జరిగినా పార్టీ తరఫున పోరాడతామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "పేదల కళ్లల్లో కన్నీళ్లు వస్తే నా కళ్లల్లో వచ్చినట్టే. నేను ఎంపీగా గెలిచింది పదవిని అనుభవించడానికి కాదు.. పేదల తరఫున మాట్లాడటానికి. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నిలబడటానికే" అని ఈటల అన్నారు. "పేదలను ఇబ్బంది పెడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అంతు చూస్తాం. దళితుల భూముల జోలికి వస్తే ఖబడ్దార్. ప్రజల భూములను గుంజుకునే ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అవసరమైతే మీ మెడలు వంచుతాం" అని ఈటల రాజేందర్ ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి కృష్ణారెడ్డి, మంగమ్మ, సుధాకర్ గాండే, వాసు, రాజిరెడ్డి, మల్లేష్, సతీష్, శివాజీ, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, జంగారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాధిత రైతులు జీతారం, వీరయ్య, జీతయ్య, బలరాం, బాలేష్ తదితరులు తమ గోడును ఎంపీకి వివరించారు.

# 'కల్యాణ లక్ష్మి' కాదు..'సంతాన లక్ష్మి'

మొదటి పేజీ తరువాయి...

ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 'కల్యాణ లక్ష్మి' కాస్తా 'సంతాన లక్ష్మి'గా మారిపోయిందన్నారు. కొత్త రేషన్ కార్డులు బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇస్తుందని నాడు స్వయంగా కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే ట్వీట్ చేశారు. కానీ మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తవి ఇవ్వకపోగా.. లక్షా 40 వేల రేషన్ కార్డులను దారుణంగా తొలగించి పేదల కడుపు కొట్టారు. సీలింగ్ ఎత్తివేసి ప్రతి ఒక్కరికీ 6 కేజీల బియ్యం ఇచ్చింది, ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు సన్న బియ్యం పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నది ప్రజలకు తెలుసు.

**ఉద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటం..**

ఉద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు హరీశ్ రావు. గత మూడు నెలలుగా జీతాల నుంచి జునూ డబ్బులు కట్ చేస్తున్నారు కానీ.. ఆ కార్డు పట్టుకుంటే ఏ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. మొన్నటికి మొన్న సిద్దిపేట నుంచి రిటైర్డ్ హెడ్మాస్టర్ ఖాజా మొహియుద్దీన్ భార్య అపోలో ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందుతూ చనిపోతే రూ.11 లక్షల బిల్లు వేశారు. జునూ వర్తించక, ఆ బిల్లు ఎలాగైనా తగ్గించమని ఆయన నా దగ్గరకు వచ్చి వేడుకున్న పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోయిందని హరీశ్ రావు అన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కాంట్రిబ్యూషన్ లేకుండానే జర్నలిస్టులను సైతం EHS లో చేర్చింది. జునూ విషయంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. సిద్దిపేట మెడికల్ కాలేజీలో రివ్యూ చేస్తే.. 2023 నవంబర్ నుంచి ఏకంగా 24 కోట్ల రూపాయల ఆరోగ్యశ్రీ నిధులు రాలేదని స్వయంగా సూపరింటెండెంట్ చెబుతున్నారు. ఇక పోలీసుల పరిస్థితి మరీ దారుణం. వాళ్లకు క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ బంద్ అయింది, భద్రత లేదు, జునూ వర్తించడం లేదు. ఈ పరిస్థితి చూసి పోలీస్ కానిస్టేబుళ్లు వాపోతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన అంటే కుటుంబ పాలన.. ఫోర్ బ్రదర్స్ పాలన గా మారిపోయింది. ఈ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి సొంత మనుషులకు మాత్రమే జస్టిస్ జరుగుతోంది..దళితులకు, గిరిజనులకు, బీసీలకు మాత్రం తీవ్ర వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. దళితులు, ఎస్టీ, బీసీల కోసం ఈ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క సింగిల్ స్కీమ్ అయినా తెచ్చిందా రేవంత్ రెడ్డి.. ఈ ప్రభుత్వం చేస్తున్న స్కాములను నేను ఆధారాలతో సహా బయటపెడుతుంటే.. సమాధానం చెప్పలేక నా మీద రేవంత్ రెడ్డి వ్యక్తిగత టార్గెట్ పెట్టుకున్నారు. నాపై తప్పుడు ప్రచారాలు చేసి రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడుతున్నాడు.. 3 నెలలకోసారి ఏదో ఒక అంశంపై నా మీద దుష్ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదు. రేవంత్ రెడ్డి కేసీఆర్ గారిని విమర్శించడం అంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమే. అసలు రేవంత్ రెడ్డి కథ ఏంటో, ఆయన చరిత్ర ఏంటో గతంలో స్వయంగా కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి, అలాగే పోచారం శ్రీనివాస్ రెడ్డి బహిరంగంగానే చెప్పారు. దేవుడు కనపడితే భక్తితో దండం పెట్టుకోవడం నాకు మొదటి నుంచీ ఉన్న అలవాటు. కానీ, దేవుడి పేరుతో కూడా చిల్లర రాజకీయం చేయడం ఒక్క రేవంత్ రెడ్డికే తెలిసిన విద్య. గుడికి వెళ్తే దేవుడికి దండం పెట్టుకుంటారు కానీ..నేను ఆధ్యాత్మిక భావనతో తమిళనాడులోని తిరుచ్చిలో ఉన్న శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి వెళ్లాను. అలాగే కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా అమ్మవారి టెంపుల్‌కు వెళ్లడం కోసం శివమొగ్గ ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. దేవుడి దర్శనం కోసం నేను గుడికి వెళ్లడం కూడా ముఖ్యమంత్రికి తప్పుగా కనిపిస్తోందా..? అని అడిగారు.

**ఆధారాలు ఉంటే తక్షణమే బయటపెట్టాలి :**

నేను ఎయిర్‌పోర్టుకు వెళ్లినప్పుడు అక్కడ ఇంటెలిజెన్స్, పోలీస్ అధికారులు నన్ను గుర్తుపట్టి నా ఫోటోలు తీసుకున్నారు, నాతో పాటు అభిమానంతో వాళ్లు కూడా ఫోటోలు దిగారు. కానీ నేను అక్కడ ఏవో పూజలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. నేను నిజంగా అలాంటి పూజలు చేసినట్లు ముఖ్యమంత్రి దగ్గర ఆధారాలు ఉంటే తక్షణమే బయటపెట్టాలని సవాల్ విసురుతున్నా. కేవలం నా మీద బురదజల్లి, నా వ్యక్తిగత ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలనే కుట్రతోనే ఈ పూజల డ్రామా ఆడుతున్నారు. ముఖ్యమంత్రికి నిజంగా దమ్ముంటే నా పేరు చెప్పి ఈ ఆరోపణలు చేయాలి. రేవంత్ రెడ్డి నా పేరు చెబితే.. వెంటనే లీగల్ నోటీసు పంపుదామని నేను రెడీగా ఉన్నాను. కానీ ఆ లీగల్ నోటీసులకు, చట్టానికి భయపడే ఆయన నా పేరు చెప్పకుండా పరోక్షంగా పిరికివాడిలా మాట్లాడుతున్నాడు.

**నా మీద 370 కేసులు ఉన్నాయి :**

నన్ను అగ్గిపెట్టెతో పోలుస్తూ చిల్లర మాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి.. అసలు తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే నైతిక అర్హతే లేదు. నాడు తెలంగాణ కోసం నిస్వార్థంగా కొట్లాడి నా మీద 370 కేసులు ఉన్నాయి. మెదక్ జైల్లో మూడు రోజులు ఉన్న, రైలు రోకలో 48 గంటలు కంకర రాళ్ల మీదే పడుకున్నా. ఎమ్మెల్యే పదవులను గడ్డిపోచలా విసిరికొట్టి ఉద్యమం చేశాం. మిలియన్ మార్చ్ సమయంలో నాకు ఈత రాకపోయినా తెలంగాణ కోసం హుస్సేన్ సాగర్ లోకి దూకిన. మానుకోటలో బుల్లెట్లు పడుతుంటే.. రక్తపు మడుగులో ఉన్నవారిని నా భుజాలపై ఎత్తుకుని ఆసుపత్రికి పరుగెత్తిన. ఉద్యమ సమయంలో వందల సార్లు ఢిల్లీ హైకోర్టు చుట్టూ తిరిగిన చరిత్ర నాది. నా పోరాటాన్ని, త్యాగాలను చూసి ప్రజలు ఈ రాష్ట్రంలో ఎవరికీ రానంత మెజార్టీతో ఏకంగా లక్షా 20 వేల ఓట్లతో నన్ను గెలిపించారు. నాపై పోటీ చేసిన ప్రత్యర్థులకు ఏడుసార్లు డిపాజిట్లు రాకుండా చేసిన చరిత్ర నాది.. నా గురించి, తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే స్థాయి రేవంత్ రెడ్డికి లేదు.

## ప్రజావాణి ఫిర్యాదులను
# సత్వరం పరిష్కరించాలి
### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా - ప్రజావాణికి 93 పిర్యాదుల స్వీకరణ




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 17:

ప్రజావాణి లో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు సమర్పించారు. ప్రజావాణిలో 93 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున, వాటి పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**'వ్యసన ముక్త్ భారత్' కోసం అధికారులతో బ్రహ్మకుమారీల ప్రతిజ్ఞ**

ప్రజావాణి కార్యక్రమం అనంతరం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వ్యసన ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల ప్రతినిధులు మాట్లాడుతూ, వ్యసన ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ప్రతిజ్ఞ చేయించాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 20వ తేదీ వరకు దాది ప్రకాశ్‌మణి స్మారకార్థం రక్తదాన శిబిరాలు, వ్యసన విముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలతో పాటు మొబైల్ ఫోన్, స్క్రీన్ వినియోగం, ప్రతికూల ఆలోచనలు, పనులను వాయిదా వేయడం వంటి అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన ముక్త్ మహబూబ్‌నగర్, వ్యసన ముక్త్ తెలంగాణ, వ్యసన ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సెన్సస్ వివరాలను ఈ నెల 20లోగా అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

అనంతరం, జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ స్టేజ్-1 విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. తదుపరి దశ సెన్సస్ ప్రక్రియలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ కోరకు అవసరమైన సమాచారాన్ని శాఖల వారీగా వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో సేకరిస్తున్నట్లు చెప్పారు. 31 సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లు తమ పరిధిలోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఈ నెల 20లోగా జిల్లా ప్రణాళిక శాఖకు పంపించాలని ఆదేశించారు. సెన్సస్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను భద్రంగా ఉంచాలని సూచించారు. సెన్సస్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, డి.ఆర్.డి.ఓ. నర్సింహులు, జిల్లా ప్రణాళిక శాఖ ఇంచార్జి అధికారి బి. నర్సింహులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
### - పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
### - మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి, ఆగస్టు 17:

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.

సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు.

**కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలి**

రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

**జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు**

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు**

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు.

**ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.

**రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్**

సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా నాగులచవితి వేడుకలు



రుద్రంగి, ఆగష్టు 17,(ప్రజాకలం ప్రతినిధి)నాగులచవితి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో సోమవారం నాగులచవితి వేడుకలను మహిళలు ఘనంగా చేసుకున్నారు. నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. సౌభాగ్యానికి, సంతానప్రాప్తికి సర్పపూజ చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. కుజ, రాహుదోషాలున్నవారు, సాంసారిక బాధలున్నవారికి శుభం కలుగుతుందనే నమ్మకం. మహిళలు మంగళకరంగా స్నానమాచరించి పుట్టలో పాలుపోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గండి శ్రీ వెంకటేశ్వర ఆలయం, శివాలయం, మహాలక్ష్మీ వీదిలో రెడ్డి ఫంక్షన్ హల్ల వద్ద పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసారు.

## జిల్లాలో పని చేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం
# యాప్ లో నమోదు కావాలి
### సెన్సస్ హ్యాండ్ బుక్ కొరకు తగిన సమాచారం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్,ఆగస్టు 17(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంత్రం ఆయన మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి స్థాయి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మీ ప్రమాణం యాప్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మీ ప్రమాణం హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సిబ్బంది హాజరు వివరాలు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.

అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన కోరకు, సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత సమాచారం అందించాలని ఆదేశించారు. శాఖల వారిగా అందించే ప్రతి సమాచారం పక్కాగా ఉండాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ జీవితమే సందేశం
### నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి - మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే
### నిజమైన నివాళి : ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 17:

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గార్ల విగ్రహాలను నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి , ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ మల్లు రవి మాట్లాడుతూ, ఇంతటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. లిమహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి అడుగుజాడల్లో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి మాట్లాడుతూ, లిమహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ముఖ్యంగా విద్యార్థులు చదువును జీవితంలో ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహనీయులు తమ జీవితాలను అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని, విద్య, జ్ఞానం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు తీసుకురావచ్చని విశ్వసించారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జ్ఞానాన్ని సంపాదించుకున్నప్పుడే రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని సంపూర్ణంగా సాధించగలరని తెలిపారు. పేద, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకు విద్య అందించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. "మన పిల్లలకు సరైన సాన్నిధ్యం, ప్రోత్సాహం, విద్య అందిస్తే వారు వజ్రాలుగా మారుతారు. లేకపోతే వారి ప్రతిభ మట్టిలో కలిసిపోయే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రతి సమావేశంలోనూ ప్రజా సమస్యలతో పాటు పిల్లల చదువు, వారి భవిష్యత్తు, విద్యా అవకాశాలపై కూడా చర్చించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మహబూబ్‌నగర్ నగరంలో విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్థలను తీసుకొస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాల వంటి ఉన్నత విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంస్థల ద్వారా ముఖ్యంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ట్రిపుల్ ఐటీలో మహబూబ్‌నగర్ విద్యార్థులకు గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించుకున్నామని, వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంబేద్కర్, పూలే ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు రాబోయే ఐదు సంవత్సరాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ పిలుపునిచ్చారు. "మన పిల్లలకు జ్ఞానం అందించాలి. వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలి. వారు ఉన్నత విద్యను అభ్యసించి దేశంలోనే అత్యున్నత స్థానాలకు చేరేలా చేయాలి. ఇదే మహనీయుల ఆశయాలకు మనం ఇచ్చే నిజమైన గౌరవం" అని అన్నారు. పిల్లలకు పుస్తకాలు అందించడం, విద్యా సహాయం చేయడం,



కౌన్సెలింగ్ ఇవ్వడం, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ మరియు ఇతర అణగారిన వర్గాలకు సంబంధించిన సమస్యలు ఎక్కడ ఎదురైనా వాటిని గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. సమస్యలను కేవలం చర్చించడం కాకుండా వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం అవసరమని తెలిపారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించే సంస్థలు మరింత చురుకుగా పనిచేయాలని ఆకాంక్షించారు. మహనీయులు చూపించిన సామాజిక చైతన్యం, పోరాట పటిమ, సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను చూపించే దృక్పథం ప్రతి ఒక్కరిలోనూ పెంపొందాలని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి స్ఫూర్తిని నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఏర్పడిందని అన్నారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేయడంతో కార్యక్రమం ముగిసిపోకూడదని, వారి ఆశయాలను మన జీవితాల్లో ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన నివాళి లభిస్తుందని అన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించాలని, ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, ప్రతి ఉద్యోగి తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును బలంగా నిర్మించగలిగితేనే సమాజం బలపడుతుందని, సమాజం బలపడితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పూలే చూపిన విద్యా మార్గం, అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గం మనందరికీ శాశ్వత మార్గదర్శకాలని, ఆ మార్గంలో నడుస్తూ పేద, అణగారిన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడమే మన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్,సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా , చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, ఎస్ఈ భీమా నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో ప్రజావాణికి అనూహ్య స్పందన..!
### బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎంపీడీవో వెంకటరమణ
### సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ - వివిధ శాఖల అధికారుల హాజరు

ఆగస్టు 17, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్/వర్ధన్నపేట)

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి వర్ధన్నపేట మండలంలో అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి మండల పరిధిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ఉద్దేశంతో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు. భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, పింఛన్లు, రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఒక్కో సమస్యను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అధికారుల సమక్షంలోనే ఫిర్యాదుల పరిశీలన

ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరుకావడంతో తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ప్రజలకు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లే విధంగా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.



సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలు అందజేసిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను పర్యవేక్షించనున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ప్రజల సమస్యలను అధికారులు బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చిన ప్రతి ఫిర్యాదుదారుడికి అధికారులు అందుబాటులో ఉండేలా, సమస్యకు సంబంధించిన శాఖను గుర్తించి పరిష్కార మార్గం చూపేలా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అంతే కాకుండా పిర్యాధి చేసుకొనుటకు కార్యాలయానికి వచ్చే ప్రజలకి ఎ ఎన్ ఎమ్ లని, త్రాగునీతి సౌకర్యం, హెల్ప్ డెస్క్ ని అందుబాటులో ఉంచామన్నారు. అందిన పిర్యాధులని వెంటనే ఆన్ లైన్ చేసి రషీదు సైతం పొందేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొనగా.. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులను అధికారులకు సమర్పించారు.

ప్రజా కలం
మంగళవారం, ఆగస్టు 18, 2026

# మరింత జాగ్రత్త అవసరం

చట్టాలలో ప్రజాప్రయోజన చట్టాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. వాటికి ఒక సామాజిక కోణం ఉంటుంది. అలాగే ఆ చట్టాన్ని ఉదారంగా నిర్వచించాల్సి వస్తుంది. అయితే ఆ ఉదారత ఆ చట్టం ఎవరి కోసం అయితే నిర్దేశించిందో వారికి అనుకూలంగా ఉండాలి కానీ, ఆ చట్టాన్నే నిర్వీర్యం చేసేటట్టు ఉండకూడదు. సుప్రీంకోర్టు జూలై 29న వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు ఒక ప్రజాప్రయోజనార్థ చట్టాన్ని ఆ చట్టం ఉద్దేశాలకు, మౌలిక స్వభావానికి భిన్నంగా నిర్వచించింది. ఆ చట్టం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986. పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1994లో పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వును విడుదల చేశారు. అందులోని షెడ్యూల్‌లో 'ఏ ప్రాజెక్టు కొత్తగా మొదలుపెట్టాలన్నా, ఉన్న ప్రాజెక్టును విస్తరించాలన్నా పర్యావరణ అనుమతి లేకుండా చేయడం కుదరదు' అని ఉంది. 2006లో తెచ్చిన కొత్త ఉత్తర్వులోనూ చాలా స్పష్టంగా– ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని ఉంది. అంటే 1994లో అంతర్లీనంగా ఉన్నది, 2006 నాటికి ప్రస్ఫుటంగా ఉంది. అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిలో బలమైన పెట్టుబడిదారులు ఉన్నారు. వారు ఎటువంటి పర్యావరణ అనుమతి లేకుండా తమ ప్రాజెక్టులను నిర్మించడమేగాక, కొందరైతే నిర్మాణం పూర్తిచేసి ఆ పరిశ్రమలను నడిపేస్తున్నారు కూడా. అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేసిన వారికి ఊరటగా కేంద్ర పర్యావరణ శాఖ 1994 నుంచి సడలింపు ఇస్తూ వచ్చింది. ఆ సడలింపు ప్రకారం, 'నిర్మాణం మొదలుపెట్టేశాక, లేదా పూర్తి చేసేశాక కూడా పర్యావరణ అనుమతి తీసుకోవచ్చు!' దీనిని 'ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో' అనుమతి అంటారు. అటువంటి సడలింపులు చట్ట విరుద్ధమనీ, అలా చేయడానికి ఏ మాత్రం కుదరదనీ 2004 నుంచి సుప్రీంకోర్టు పలుమార్లు చాలా స్పష్టంగా చెబుతూ వచ్చింది. అయినా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన మంత్రిత్వశాఖ 2017లో అటువంటి సడలింపు ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ చట్టం కింద మరొక్కసారి ఇచ్చింది. 2017 మార్చి 14 నాటికి అనుమతి లేకుండా నిర్మిస్తున్న లేదా నిర్మించినవారు తదుపరి ఆరు నెలల్లో అనుమతి తెచ్చుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ ఆరు నెలలు కాస్తా 13 నెలలు అయ్యింది. అనుమతి లేకుండా ఇలా నిర్మించిన పరిశ్రమల్లో పర్యావరణ విధ్వంసకరమైనవి ఉంటాయి, ఈ పాటికే అవి చాలా నష్టం చేసి ఉంటాయి అనే సందేహం ఈ ఉత్తర్వు ఇచ్చినవారికి కలిగినట్టు మనకు అనిపించదు. అంతేగాక 'ఈ ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ కోసం ఇస్తున్నాం' అని రాసుకొచ్చారు! ఇది కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే అని కూడా చెప్పారు. ప్రతిసారి ఈ ఒక్కసారికే అని చెప్పటం ఈ పాటికి పరిపాటి అయ్యింది. మళ్లీ 2021లో ఒక ఆఫీస్ మెమోరాండం ఇచ్చారు. దాని ప్రకారం... అనుమతి లేకుండా మొదలుపెట్టినవారు ఏ భయం లేకుండా ఇప్పుడు అనుమతులు తీసుకోవచ్చు అని. ఇది చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వు కాదు. అలాగే 2017 నాటి ఉత్తర్వులో లాగా ఇది ఒకసారికి మాత్రమే అని కూడా లేదు. అంటే, ఒక రకంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియకే చమరగీతం పాడిన మెమోరాండం ఇది. ఈ రెండిటినీ ముందుగా మద్రాస్ హైకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునళ్లలో ఛాలెంజ్ చేశారు. హైకోర్టు, ట్రైబ్యునల్ దాటుకుని ఈ వన శక్తి కేసు సుప్రీంకోర్టు వరకూ వచ్చింది. మే 14, 2025న సుప్రీంకోర్టు ధర్మాసనం దీని గురించి ఒక అద్భుతమైన తీర్పు ఇచ్చింది-- ఇటువంటి ఉత్తర్వులు, మెమోరాండంలు ఇవ్వడమంటే పక్కదారిలో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని నీరుగార్చడమే అని, చట్టం ఉద్దేశం పరిరక్షణ అయితే విధ్వంసకర ప్రాజెక్టులకు పరిరక్షణ చట్టం కింద సడలింపు ఇవ్వడం ఎలా కుదురుతుందని తెలిపింది. అంతేగాక, సుప్రీంకోర్టు ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు 'ఇటువంటి సడలింపులు కుదరవు' అని చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ పర్యావరణ, న్యాయ సిద్ధాంత మేళవింపుగా తీర్పు ఇచ్చింది. 2017 నాటి ఉత్తర్వుని, 2021 నాటి మెమోరాండంను కొట్టివేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఉత్తర్వులు లేదా మెమోరాండంలు ఇవ్వడానికి వీలులేదని కూడా చాలా స్పష్టంగా తెలియజేసింది. ఈ తీర్పు మీద రియల్ ఎస్టేట్ లాబీ సంస్థ క్రెడాయ్ సమీక్ష కోరింది. ఇక్కడ గమనించాల్సింది ఈ కేసులో ప్రధాన పార్టీ అయిన కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పును ఒప్పుకుంది. వారు కోరని సమీక్ష క్రెడాయ్ కోరింది. సమీక్ష తీర్పును ముగ్గురు సభ్యుల ధర్మాసనం వెలువరించింది. ఇద్దరు న్యాయమూర్తులు ఈ కేసును మళ్లీ వినాలి అని తీర్మానించగా, ఒక న్యాయమూర్తి మాత్రం ఇచ్చిన తీర్పు సరైనదే అని నవంబర్ 18, 2025న తీర్పు చెప్పారు. దానితో ఈ కేసు మళ్లీ ముగ్గురు సభ్యుల ధర్మాసనం దగ్గరికి వెళ్లింది. ఈ ధర్మాసనం జూలై 29న తన మలి తీర్పు ప్రకటించింది. ఈ మలి తీర్పులో మొదటి తీర్పులో చెప్పినట్టుగా ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో అనుమతులకు చట్టంలో స్థానం లేదు అని స్పష్టం చేశారు. ఆఫీస్ మెమోరాండంను కూడా కొట్టివేశారు. అంతవరకే చేసి ఉంటే మొదటి తీర్పును ఎత్తిచూపుతూ, పర్యావరణ పరిరక్షణ చట్టం ఉద్దేశాలకూ, మౌలిక స్వభావానికి అనుగుణంగా ఉండేది. అయితే దానితో పాటు ముందస్తు అనుమతి నుంచి కొన్ని పరిస్థితులలో సడలింపు ఇవ్వవచ్చు అని రాసుకొచ్చారు. దానికి ఒక ప్రాతిపదిక కూడా ఇచ్చారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నప్పుడు అలా కాకుండా మరో విధంగా చేయడానికి వీలులేదు అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పి నాలుగు దశాబ్దాలు అవుతుంది. అది పర్యావరణ అనుమతి అయినా మరొకటి అయినా. అయితే పర్యావరణ అనుమతి విషయంలో అది మరింత ముఖ్యం. ఎందుకంటే ఒకసారి విధ్వంసం జరిగాక దానిని తిరిగి మునుపటి స్థితికి తీసుకురావటం అసంభవం కాబట్టి. అందులోనూ వాతావరణ మార్పు ప్రధానంగా ఉన్న ఈ కాలంలో ఆ జాగరూకత, జాగ్రత్త మరింత అవసరం. అయినా కూడా చట్టంలో లేని, అలా కుదరదు అని రాజ్యాంగ ధర్మాసనం చెప్పినా కూడా 'ప్రజా ప్రయోజనం' పేరు మీద ఒక ప్రాతిపదిక ఏర్పాటు చేయడం అవాంఛనీయం.అంతే కాక, 1994 లేదా 2006 నాటి ఉత్తర్వుచట్టంలోని పర్యావరణ పరిరక్షణ సూత్రం కింద తీసుకువచ్చిన ఉత్తర్వు. ఇప్పుడు అదే సూత్రం కింద అదే ఉత్తర్వును నీరుగారుస్తూ... మరొక ఉత్తర్వు ఇవ్వడంలో అసంబద్ధత లేదు అని చెప్పడం ఏ మాత్రం ఆమోదయోగ్యం? భారతదేశంలో పర్యావరణ చట్ట సిద్ధాంతాన్ని పార్లమెంట్ కన్నా కూడా సుప్రీంకోర్టే అభివృద్ధి చేసిందని చెప్పడం అతిశయోక్తి కాదు. 1990ల్లో ఇచ్చిన పలు తీర్పుల ద్వారా పర్యావరణ సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలను సుప్రీంకోర్టే క్రోడీకరించి, జీవించే హక్కులో భాగం చేసింది. ఒకప్పుడు గురుతర బాధ్యతను పోషించిన కోర్టే ఈ రోజు దానికి విరుద్ధంగా కాకపోయినా భిన్నంగా ప్రవర్తించడం బాధాకరం, ప్రమాదకరం కూడా.

## బోరిగాం బాలాజీ గుట్టపై ఘనంగా మహా అన్నదానం

### -పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్



తానూర్,ఆగస్టు 17(ప్రజా కలం):: తానూర్ మండలంలోని బోరిగాం బాలాజీ గుట్ట మహాదేవుని ఆలయంలో శ్రావణ మాస సోమవారాన్ని పురస్కరించుకుని భైంసాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ నాయకులు బోరిగాం శివాజీ రావు పటేల్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దానాలన్నింటిలోకెల్లా అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు, ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో శని, సోమవారాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీకి, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, బాలాజీ గుట్ట మహాదేవుని ఆలయాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు,?అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు వచ్చిన ప్రజాప్రతినిధులను, నాయకులను సర్పంచులను ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో పోచమ్మ తల్లి బోనాల జాతర సకల కులాలతో..పోచమ్మ బోనాలు

### - ఒకేరోజు పోచమ్మ తల్లికి వేలాది బోనాలు సమర్పించిన పట్టణ మహిళలు
### - శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో మార్మోగిన వర్ధన్నపేట
### - విశ్వబ్రాహ్మణుల తొలి బోనం అనంతరం సకల కులాల భక్తి సమర్పణ
### - ఏనాడూ ఎరుగని రీతిలో పట్టణమంతా పండుగ శోభ

ఆగస్టు 17 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని వివిధ కులాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఒకేరోజు బోనాలతో తరలిరావడంతో వర్ధన్నపేట మొత్తం పండుగ శోభను సంతరించుకుంది. ఇళ్ల ముందు కల్లాపు చల్లి, రంగురంగుల ముగ్గులు వేసి, ప్రత్యేకంగా అలంకరించుకున్న మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



**తొలి బోనం విశ్వబ్రాహ్మణులదే..**

స్థానిక ఆచార సంప్రదాయాల ప్రకారం శ్రావణమాసంలో పోచమ్మ తల్లికి బోనం సమర్పించడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ముందుగా విశ్వబ్రాహ్మణులు పోచమ్మ తల్లికి బోనం సమర్పించారు. అనంతరం పట్టణంలోని ఇతర కులాలకు చెందిన భక్తులు తమ తమ మొక్కుబడుల మేరకు బోనాలు సమర్పించారు. అయితే ఈసారి ప్రత్యేకంగా పట్టణంలోని వివిధ వర్గాల మహిళలు ఒకేసారి పెద్ద సంఖ్యలో బోనాలతో తరలిరావడంతో బోనాల వేడుకకు మరింత ప్రత్యేకత ఏర్పడింది.

**పోచమ్మ తల్లికి బోనం.. ఓ భక్తి సంప్రదాయం**

తెలంగాణ గ్రామీణ జీవన విధానంలో గ్రామదేవతలకు ప్రత్యేక స్థానం ఉంది. అందులో పోచమ్మ తల్లి ఆరాధనకు విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. గ్రామ ప్రజలను కాపాడే తల్లిగా, ఆరోగ్యం--సంక్షేమానికి ప్రతీకగా పోచమ్మను భక్తులు కొలుస్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తున్నారు. ప్రాంతానుసారంగా ఆచారాలు, కథనాలు మారుతున్నప్పటికీ పోచమ్మ తల్లి ఆరాధన తెలంగాణ జానపద సంస్కృతిలో అంతర్భాగంగా కొనసాగుతోంది.బోనం సమర్పించడం ద్వారా అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని, కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు విశ్వసిస్తారు. మొక్కులు చెల్లించుకోవడం, బోనం సమర్పించడం వంటి సంప్రదాయాలు పండుగకు ఆధ్యాత్మికతతో పాటు సామూహిక ఐక్యతను కూడా తీసుకొస్తున్నాయి.

**శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు**

బోనాల వేడుకలో శివసత్తుల పూనకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోతలు, మంగళవాయిద్యాలతో పట్టణం మార్మోగింది. మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించాయి.

**ఇళ్ల నుంచి ఆలయం వరకు.. పండుగే పండుగ**

ఉదయం నుంచే పట్టణంలోని ప్రధాన వీధుల్లో బోనాలతో మహిళల సందడి కనిపించింది. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఇళ్లను శుభ్రం చేసుకుని, వాకిళ్లను అలంకరించి పండుగకు స్వాగతం పలికారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొనడంతో పట్టణమంతా బోనాల జాతరను తలపించింది.

**సామాజిక ఐక్యతకు ప్రతీకగా బోనాలు**

వర్ధన్నపేటలో ఈసారి జరిగిన బోనాల వేడుక మరో ప్రత్యేకతను చాటిచెప్పింది. కులమత భేదాలకు అతీతంగా పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలు ఒకే వేదికపై భక్తితో పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. సకల కులాల మహిళలు ఒకేసారి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడంతో పట్టణంలో గతంలో ఎన్నడూ కనిపించని స్థాయిలో పండుగ వాతావరణం నెలకొంది.మొత్తంగా.. పోచమ్మ తల్లిపై భక్తి, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం, మహిళల భక్తిశ్రద్ధలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు కలగలిసి వర్ధన్నపేట బోనాల పండుగను అంగరంగ వైభవంగా మార్చాయి. భక్తుల సందడితో పులకించిన పోచమ్మ తల్లి ఆలయం.. పట్టణమంతా పండుగ శోభతో కళకళలాడింది.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### - పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
### - ప్రజావాణికి 41 ఫిర్యాదులు, వినతులు

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)

ప్రజావాణి అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సానుకూల దృక్పథంతో స్వీకరించడంతో పాటు, సమస్యలపై సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 41 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నుంచి అన్ని ఫైళ్లను కలెక్టరేట్ కార్యాలయం ద్వారానే పంపించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో





అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ లో సీట్ సాధించిన విద్యార్థిని శివానికి ఘన సన్మానం



నిర్మల్ ఆగస్టు17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలం పార్డి(బి) గ్రామంలోని మాజీ సర్పంచ్ కండెల రాజన్న మనుమరాలు, కండెల సునీల్ కూతురు శివాని రి – నీటి 2026 లో 555 మార్కులు సంపాదించి ఓపెన్ కేటగిరిలో ఎంబిబిఎస్ సీటు. సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. శివాని ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కుబీర్ లో చదువు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్ చిమ్మన్ పోశెట్టి గాంధారి సాయినాథ్ కండెల గజ్జన్న జి ఎన్ స్వామి గుడాల రాజలింగు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

## కోలూర్ తండా వాసులకు స్థలాలు రెగ్యులరైజ్ చేయాలని ప్రజావాణిలో వినతి

తానూర్,ఆగస్టు 17(ప్రజా కలం): మండలంలోని కోలూర్ తండా లోని 5:17 ఎకరాల భూమిని తాండా వాసుల పేరిట రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సోమవారం పవార్ గణేష్, స్థానికులు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు, 1987లో అప్పటి ఎమ్మెల్యే జి.గడ్డేన్న కాక హయాంలో ప్రభుత్వం ఓ రైతు నుంచి ఈ భూమిని కొనుగోలు చేసి నివాసాల కోసం ఇచ్చింది, కానీ, రికార్డుల్లో ఇప్పటికీ ఆ భూమి పాత రైతు పేరిటే ఉండిపోయింది, ఆ పేరును తొలగించి, తాండా వాసుల పేర్లను చేర్చి హక్కులు కల్పించాలని కోరారు.

## తానూర్ ప్రజావాణికి 6 అర్జీలు: సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్ పిలుపు

తానూర్,ఆగస్టు 17(ప్రజా కలం):మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి 6 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు,ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు,అర్జీదారుల నుంచి స్వీకరించిన వివిధ సమస్యల దరఖాస్తులను పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు,ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహేందర్ నాథ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు భరోసా, కల్యాణలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేయాలి

### - బీఆర్ఎస్ నాయకురాలు డాక్టర్ రమాదేవి డిమాండ్




తానూర్,ఆగస్టు 17(ప్రజా కలం):

రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, కల్యాణలక్ష్మి పథకాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న వారు ప్లేకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ.. రైతులు, పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మహేందర్ నాథ్‌కు అందజేశారు,ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్ స్వామి, గజేందర్ పటేల్, షానవాజ్, సంజు రెడ్డి ,సాయినాథ్ తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల టాపర్ యాసారపు చరణ్యకు శాలువా, నగదు బహుమానంతో సన్మానం

### మండల టాపర్‌గా యాసారపు చరణ్య ఉపాధ్యాయుల చేతుల మీదుగా సన్మానం

ఆళ్లపల్లి, ఆగస్టు 17, ప్రజాకలం ఆళ్లపల్లి మండలం ఆళ్లపల్లి గ్రామానికి చెందిన యాసారపు లక్ష్మణ్, వెంకటరమణ దంపతుల కుమార్తె యాసారపు చరణ్య స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది ఈ సంవత్సరం మార్చి–ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండలంలో ప్రథమ ర్యాంక్ సాధించింది మండల టాపర్‌ను సన్మానిస్తానని హామీ ఇచ్చిన మేరకు అదే పాఠశాల హిందీ



ఉపాధ్యాయులు భానోత్ వీరన్న సోమవారం యాసారపు చరణ్యను పట్టు శాలువాతో సత్కరించి 1000 నగదు బహుమానం అందజేశారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలు సాధించగలరని చరణ్య నిరూపించింది. ప్రతి సంవత్సరం మండల టాపర్‌ను ఇదే విధంగా ప్రోత్సహిస్తానని వీరన్న తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ శాంతారావు, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, సమ్మయ్య , వీరన్న మరియు విద్యార్థులు పాల్గొని యాసారపు చరణ్యను అభినందించారు

# మహబూబ్‌నగర్ లో అభివృద్ధి ఉండాలి తప్ప రాజకీయాలు ఉండకూడదు

## కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేయాలి – ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 17:

మహబూబ్‌నగర్ లో అభివృద్ధి ఉండాలి తప్ప రాజకీయాలు ఉండకూడదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ కు చెందిన ప్రముఖ ఎక్సైజ్ కాంట్రాక్టర్ వాల్దాస్ ప్రతాప్ గౌడ్ వారి మిత్ర బృందం మరియు వివిధ పార్టీలకు చెందిన సుమారు రెండు వేల మంది నాయకులు కార్యకర్తలు హైటెక్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మరియు డిసిసి అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు . వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంతో స్వాగతిస్తున్నామని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు మంచి జరగాలనే ఆలోచనతో రాజకీయాల్లో ఉన్నామని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలకు చెందిన వారిని కాంగ్రెస్‌లోకి తీసుకురావాలనే ఉద్దేశం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేయడంలో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని అన్నారు. ఇప్పటికే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన పలువురు అభ్యర్థులు విజయం సాధించారని, రాష్ట్రవ్యాప్తంగా కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లే విజయం సాధించడం ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజలకు మేలు చేసే విధానాలను అమలు చేస్తున్నందుకే కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీర్వాదం లభిస్తోందని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉన్న నాయకులు, వివిధ రంగాల్లో ప్రజాసేవ చేస్తున్న ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ వైపు వస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతాప్ గౌడ్, బాగన్న గౌడ్, జగన్మోహన్ గౌడ్ తదితరుల సేవలను అభినందించారు. వారి కుటుంబాలతో గతంలో ఉన్న పరిచయాలను ఆయన గుర్తుచేసుకుంటూ, ప్రజాసేవ పట్ల వారికి ఉన్న నిబద్ధతను కొనియాడారు. బాగన్న గౌడ్ వంటి నాయకులు యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో మంచి విలువలను పెంపొందించేందుకు, పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాజకీయాలంటే కేవలం పదవులు, అధికారమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన రాజకీయమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు వంటి మౌలిక అవసరాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రజాప్రతినిధుల అసలు బాధ్యత అని అన్నారు. పిల్లలకు మంచి విద్య అందించి, వారు ఇంజనీర్లు, డాక్టర్లు, ఉన్నతస్థాయి ఉద్యోగులు, నిపుణులుగా ఎదిగేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించినప్పుడే రాజకీయాలకు నిజమైన అర్థం ఉంటుందని తెలిపారు. ప్రజల వ్యాపారాలు, ఉపాధి, స్థానిక సమస్యలు, యువత భవిష్యత్తు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను ప్రతి కుటుంబానికి చేరేలా చేయాలని కార్యకర్తలకు సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే వంటి మహనీయులు చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, సాధికారత మార్గంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. వెనుకబడిన వర్గాలు, పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, యువతకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓర్పుతో, క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. పార్టీపై విశ్వాసంతో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో అవకాశాలు లభిస్తాయని, అయితే పదవుల కోసం కాకుండా ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున, ముఖ్యమంత్రి తరపున ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, సిజే బెనహర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్, గొర్రెల కాపరులు సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, నాయకులు మైత్రి యాదయ్య, ఓబిసి సెల్ చైర్మన్ రాజు గౌడ్, ఎస్సీ సెల్ చైర్మన్ బాలయ్య మహబూబ్ నగర్ నగర కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

### – జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



నిర్మల్, ఆగస్టు 17(ప్రజా కలం జిల్లా ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో ప్రజాధనం వృథా చేయొద్దు

### – రేషన్ బియ్యం పంపిణీ కేంద్ర ప్రభుత్వ మద్దతుతో నడుస్తుంది
### – దేశ ప్రధాని మోడీ ఫోటో తప్పనిసరిగా ప్రచురించాలి
### – బిజెపి పార్టీ అయినవోలు మండల అధ్యక్షులు మాదాసు ప్రణయ్ డిమాండ్

ఐనవోలు, ఆగస్టు 17: (ప్రజా కలం ప్రతినిధి)

స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో రూ.600 కోట్ల ప్రజాధనం ఖర్చు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ ఐనవోలు మండల పార్టీ డిమాండ్ చేసింది. అప్పుల భారంతో ఉన్న ప్రభుత్వానికి ఇది అదనపు భారం అవుతుందని మండల పార్టీ అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆహార ధాన్యాలు, సబ్సిడీలతో కొనసాగుతున్న రేషన్ వ్యవస్థలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆహార శాఖ మంత్రి ఫోటోలను స్మార్ట్ రేషన్ కార్డులపై తప్పనిసరిగా ఉంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం పాత్రను విస్మరించి కేవలం రాష్ట్ర నాయకుల ఫోటోలతో కార్డులు పంపిణీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆగారెడ్డి, మహేష్ గౌడ్, నరికే రాజేష్, అమరావతి నాగరాజు, పాక కుమార్ స్వామి, కోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## అంధకారంలో వర్ధన్నపేట పట్టణ ప్రాంగణం!

**ప్రమాదాలకు నిలయంగా వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి**
**లైటింగ్ సౌకర్యం లేక వాహనదారులు, పట్టణ ప్రజల అవస్థలు**
**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు**
**అభివృద్ధిలో నిర్వీర్యమైన చేతకాని పాలనపై విమర్శలు**



ఆగస్టు 17, ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్/వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణం అంధకారంలో కొట్టుమిట్టాడు తోంది. పట్టణం మీదుగా వెళ్లే వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రాత్రివేళ సరైన వెలుతురు లేకపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతున్న ఈ ప్రధాన రహదారిపై సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంప్రమాదాలకు కారణ మవుతోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీకట్లోనే ప్రయాణం.. ఎప్పుడు ఏం జరుగుతుందో?

జాతీయ రహదారి కావడంతో వర్ధన్నపేట పట్టణ పరిధిలో రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో రహదారిపై చీకటి మరింత ప్రమాదకరంగా మారుతోంది. రహదారి వెంట తగినంత వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదాలు జరిగినా.. అధికారుల్లో చలనం ఏదీ?

పట్టణ పరిధిలో రహదారి భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిలో నిర్వీర్యమైన చేతకాని అధికారులు?

పట్టణ అభివృద్ధి, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన మున్సిపల్ అధికారులు రహదారి లైటింగ్ సమస్యపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారిపై కనీస లైటింగ్ సౌకర్యం కల్పించలేకపోతే పట్టణ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా మేల్కొంటారా?...వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వర్ధన్నపేట పట్టణ పరిధిలో తక్షణమే సెంట్రల్ లైటింగ్, అవసరమైన చోట్ల హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చీకటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా.. లేక ప్రమాదాలు జరిగిన తర్వాతే మేల్కొంటారా అనేది వేచి చూడాలి.

## నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధి కావాలంటే మర్రి జనార్ధన్ రెడ్డిని అధికారంలోకి రావాలి - మాదం శెట్టి భానుప్రసాద్

నాగర్‌కర్నూల్ ఆగస్టు 17 ప్రజా కలం( ప్రతినిధి): నల్లవాగు వద్ద నిర్మించిన బ్రిడ్జి నుంచి మొదలుకొని నియోజకవర్గంలో నిరుద్యోగులు, తెలంగాణ ఉద్యమకారులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ముందుకు రావాలని తెలంగాణ ఉద్యమకారుడు, అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించిన వారాహి దేవి అమ్మవారి ఉపాసకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ మాదం శెట్టి భానుప్రసాద్ అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలంటే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిను తిరిగి ప్రజా ప్రతినిధిగా, అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు, తెలంగాణ ఉద్యమకారులు, దగాపడ్డ వర్గాలు తమ సమస్యలపై ఐక్యంగా గొంతెత్తి, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను గుర్తించి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రజలు బలపరచాలని భానుప్రసాద్ కోరారు.

## కిరాణా టెండర్ రద్దు చేయాలి

### – సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్



నాగర్ కర్నూల్ ఆగస్టు 17 ప్రజా కలం (ప్రతినిధి ): నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బిజినపల్లి కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో కిరాణా టెండర్‌ను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆయన ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాసిరకం కిరాణా సామాన్లు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. సరిపడా పప్పు, ఇతర నిత్యావసర వస్తువులు ఇవ్వకపోవడంతో నాసిరకంగా వంటలు తయారవుతున్నాయని తెలిపారు. అలాగే కూరగాయలు కూడా మొరిగిపోయినవి ఇస్తున్నారని విమర్శించారు. పాఠశాలలో క్రీడా సామాగ్రి కూడా అందుబాటులో లేదని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను కొందరు ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కిరాణా టెండర్‌ను రద్దు చేసి నాణ్యమైన సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బోనాసి శుభాకర్, రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

### - ప్రజలు వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
### - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)

ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజల భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ అన్నారు. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం సీసీ కెమెరాల నిఘాలోకి వస్తే పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మల్యాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 48 నూతన సీసీ కెమెరాలను సోమవారం జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, నేరాల అరికట్టడంలో సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలని పేర్కొన్నారు. ప్రతి వీధి, ప్రతి ప్రధాన కూడలిలో కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరం జరిగిన వెంటనే నిందితులను గుర్తించి అరెస్టు చేయడం సులభతరమవుతుందని అన్నారు. ఇటీవల మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసులో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, కోరుట్ల పట్టణాలతో పాటు తాజాగా మల్యాలలోనూ పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు తదితర ఘటనల్లో నిందితుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో వారిని త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు కోర్టుల్లో నేర నిరూపణకు కూడా ఇవి దోహదపడుతున్నాయని అన్నారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మల్యాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పంచాయతీ పాలక మండలి, ప్రజాప్రతినిధులను ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మల్యాల పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ సందీప్, గ్రామ సర్పంచ్ బోట్ల జయ ప్రసాద్, ఉప సర్పంచ్ కట్కం వినయ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపర్తిలో ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ గ్రామ కమిటీలు ఎన్నిక

ఐనవోలు, ఆగస్టు 17: (ప్రజా కలం ప్రతినిధి )ఐనవోలు మండలం కొండపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల గ్రామ కమిటీలను నూతన యువతరం నాయకత్వంతో ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బరిగెల ఏలియా మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు బొక్కల నారాయణ మాదిగతో పాటు మురుపట్ల దేవదాసు, ఇసురం బాబు, డప్పు రమేష్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ కొండపర్తి గ్రామ అధ్యక్షుడిగా కట్కూరి విష్ణు మాదిగ, అధికార ప్రతినిధిగా సింగారపు దినేష్ మాదిగను ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పీ గ్రామ అధ్యక్షుడిగా గుగ్గిల రమేష్ కుమ్మరిని, అధికార ప్రతినిధిగా మెరుగు వెంకటేశ్వర్లు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 19న ఐనవోలు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు మండల స్థాయి కమిటీల ఎన్నిక నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## మున్సిపల్ కమిషనర్ కలిసి వినతిపత్రం అందించిన కార్మిక సంఘం నాయకులు

వరంగల్, ఆగస్టు 17: (ప్రజా కలం ప్రతినిధి )

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీఎంఆర్‌పీఎస్ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.



కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, పీఆర్‌సీ ప్రతిపాదనల మేరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు కరువు భత్యం వర్తింపజేయాలని కోరారు. డ్రైవర్ల వేతనాలు పెంచాలని, వయస్సు పైబడిన, అనారోగ్యంతో ఉన్న కార్మికులకు రూ.5 లక్షల పదవీ విరమణ ప్రయోజనం కల్పించి, వారి వారసులకు ఉద్యోగ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1181 ద్వారా నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికుల పేరుతో వేతన కోతలు విధించే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్, పాషం రవి యాదవ్, ఏఐటీయూసీ నాయకుడు ఏల్పుల ధర్మరాజు, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మేకల దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిఖిల్ రామ్ సాయి ప్రసన్నల నిశ్చితార్థ వేడుక

## - నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



ఆగస్టు 17 ప్రజాకలం ప్రతినిది:(వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట మండలం కట్రాల గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశం కుమారుడు నిఖిల్ రామ్ సాయి ప్రసన్నల నిశ్చితార్థ వేడుక సోమవారం వరంగల్‌లోని హంటర్‌రోడ్ వీఎస్‌ఆర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నందనం సొసైటీ వైస్‌చైర్మన్ తక్కలపల్లి చందర్‌రావు, డైరెక్టర్ సంపత్‌రావు, కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9, న వరంగల్ లో జరిగే, జాతీయ మహాసభను విజయ వంతం చేయండి

**ఇబ్రహీంపట్నం మండలం లో గ్రామ కమిటీల నిర్మాణం**

**"పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు**

**ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, జిల్లా నాయకులు దూమల గంగారం, చెట్టుపెల్లి లక్ష్మణ్**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి ) మత దురంకారం కుల వివక్షత, సాంఘిక అసమానతలు,లేని సమ సమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ, అనుబంధ సంఘాలు, నూతన గ్రామ కమిటీలు వేయడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, జిల్లా నాయకులు దూమల గంగారం మాదిగ, చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, కోరుట్ల నియోజకవర్గం పర్యవేక్షకులు చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, అధ్యక్షతన ఇబ్రహీంపట్నం మండలం లోని కోమటి కొండాపూర్, గ్రామా లలో మాదిగ సంఘ పెద్ద మనుషులు, సభ్యుల తో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా దుమాల గంగారం,



చెట్టుపెల్లి లక్ష్మణ్, లు వీరు మాట్లా డుతూ "పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ సమాజంలో ప్రతి పేద కుటుంబానికి ఉప యోగపడే విధంగా ఎన్నో పోరాటాలు చేసి సమాజం లో అన్ని వర్గాల పేద వర్గా లకు ఫలాలు అందించారని వీరు అన్నారు. జాతి సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికి కూడా ఎమ్మార్పీఎస్, శక్తి వంచన లేకుండా పాటుపడడం ఎమ్మార్పీఎస్, లక్ష్యం అని అన్నారు. పూలే, అంబేడ్కర్, జగ్జీవన్ రావు,వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఎమ్మార్పీఎస్, లక్ష్యం మని అన్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, "పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాబోవు రోజుల్లో సామాజిక ఆర్థిక అసమానతల పై మరో పోరాటానికి ఉద్యమానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని అన్నారు. అలాగే రేపు సమాజానికి మాదిగ జాతి సామాజిక ఉద్యమా నికి దిక్సూచిలా ఉండేలా ఉద్యమం నిర్మాణం జరగా లని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, జిల్లా నాయకులు బోనగిరి కిషన్ మాదిగ, ఇబ్రహీంపట్నం మండల ఇన్చార్జి బంగారి హరిదాసు, కోమటి కొండాపూర్ సంఘ అధ్యక్షులు చిట్టాపురం చిన్న రాజయ్య మాదిగ, అధికార ప్రతినిధి చిట్టాపురం నాగయ్య మాదిగ, దయ్యాల హనుమంతు, పోషన్న, గంగాధర్, రవి మాదిగ, రాజన్న, చిన్న గంగారం, భోగ్రన్న ముత్తన్న, పోషన్న, మురళి, సాయన్న, చిట్టాపురం స్వప్న, అనూష, చిట్టాపురం స్రవంతి, జమున, రాణి, గంగు, నర్సు, గంగు, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

## రౌడీ, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా -ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)

నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ.. కార్యాలయ రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్, క్రైం రికార్డు, ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్‌తో పాటు గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. గ్రేవ్, పోక్సో కేసుల్లో నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ప్రతి కేసులో నిర్దేశిత ఎస్‌ఓపీ ప్రకారం దర్యాప్తు కొనసాగిస్తూ ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, కేసు డాక్యుమెంటేషన్‌లో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సీఐ తరచూ తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారి నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, సామాజిక అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని, నేరాల నియంత్రణలో వాటి ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అనంతరం మల్యాల సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవికుమార్, సీఐ రాజ్‌కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సందీప్, నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీడీ కార్మికులు, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలి

## మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ధర్నా.. ఆర్డీఓకు వినతిపత్రం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం) బీడీ కార్మిక మహిళలకు బీడీ పెన్షన్, వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో సోమవారం మెట్‌పల్లిలో ధర్నా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్‌స్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. 2014లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బీడీ కార్మికుల కోసం ప్రత్యేకంగా బీడీ పెన్షన్‌ను ప్రారంభించారని తెలిపారు. దేశంలోనే బీడీ కార్మికులకు ప్రత్యేక పెన్షన్ అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తొలుత రూ.1,000గా ఉన్న పెన్షన్‌ను అనంతరం రూ.2,000కు పెంచారని, ఈ పెన్షన్‌తో బీడీ కార్మిక మహిళలు ఆత్మగౌరవంతో జీవించారని అన్నారు..కేసీఆర్ హయాంలో లక్షలాది మందికి ఆసరా పెన్షన్లు అందించామని, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ పెన్షన్లు నిలిపివేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో రూ.4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కనీసం గతంలో అందించిన రూ.2,000 పెన్షన్‌ను అయినా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు, వృద్ధులకు పెన్షన్లు అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని, కేసీఆర్ కిట్‌ను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీడీ కార్మిక మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మెట్‌పల్లి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. బీడీ కార్మిక మహిళలకు బీడీ పెన్షన్‌తో పాటు అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు వెంటనే మంజూరు చేసి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



## - ఎంఆర్వో పుష్పలత

రుద్రంగి, ఆగష్టు 17, (ప్రజాకలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి తాసిల్దార్ పుష్పలత కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా మండల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చి సమస్యలను ధరఖాస్థు చేసుకున్నారు. మండల ప్రజల సౌకర్యార్థం మండల స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంఆర్వో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం10 గంటలలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఉంటారని ప్రజలు మీ సమస్యలపై దరఖాస్తు ఇచ్చి మీ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి కన్వీనర్ ఎంపివో రాజేశ్వర్, ఎస్ఐ మోతీరాం నాయక్, ఏఈ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ పథకాలను కొనసాగించాలని వినతి**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే నగదు చెల్లించాలని ఎమ్మార్వో పుష్పలత కు వార్డు సభ్యులు చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్ లు ప్రజావాణి లో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి,శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలిచాయని, ఆర్థిక ఇబ్బందులతో తమ ఆడపిల్లల వివాహాలు నిర్వహించలేని కుటుంబాలకు ఈ పథకాలు ఆసరగా ఉంటాయనిని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ తీసుకొచ్చిన ఈ పథకాలను ఎలాంటి కారణాలతోనూ నిలిపివేయకుండా యధావిధిగా కొనసాగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉద్దీపకం-3 పాఠ్యపుస్తకాలు పంపిణీ

## ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు

ఆళ్లపల్లి, ఆగస్టు 17 (ప్రజాకలం): ఆళ్లపల్లి మండలం మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉద్దీపకం-3 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థుల విద్యా నైపుణ్యాలను మెరుగుపరచడం, పునాది అభ్యాస సామర్థ్యాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ప్రత్యేక చొరవతో రూపొందించిన ఉద్దీపకం-3 విద్యా కార్యక్రమంలో భాగంగా ఈ పాఠ్యపుస్తకాలను అందజేశారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఉద్దీపకం-3 కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడంతో పాటు గణిత నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార




సామర్థ్యాలను పెంపొందించేలా వివిధ కార్యకలాపాలను రూపొందించినట్లు తెలిపారు ఉపాధ్యాయులు సులభంగా బోధించేందుకు, విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకునేందుకు అనువైన పాఠ్య ప్రణాళికలు, అభ్యాస పద్ధతులను ఇందులో పొందుపరిచారని వివరించారు. గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో ముందంజలో నిలవాలనే సంకల్పంతో ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తీసుకున్న ఈ వినూత్న చర్య విద్యారంగంలో ఆదర్శప్రాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. కుమార్ రాజా, నెహ్రూ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)

పట్టణ సుందరీకరణలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని 19వ వార్డులో శిథిలావస్థకు చేరిన కల్వర్టును తొలగించి, నూతన కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి భూమిపూజ చేశారు. పట్టణానికి చెందిన ఆకుల లింగారెడ్డి ఇంటి సమీపంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ్ల ఆనంద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. కౌన్సిలర్లు డి. నాగేశ్వర్ రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.పాత కల్వర్టు స్థానంలో నూతన కల్వర్టు నిర్మాణంతో ప్రజలకు రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# నాగదేవతలకు పూజలు

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం):

నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు ఆలయాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న పుట్టలో,



అలాగే ఖాదీలో ఉన్న పుట్ట వద్ద మహిళలు పాలు పోసి,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతలను పూజిస్తే కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని విశ్వసిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాల పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది.

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

## – నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు

## – పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)

నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ ప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పాల్గొని నాగేంద్రుడికి పాలతో అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మున్సిపల్ చైర్మన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ్ల ఆనంద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ డీఈ నాగేశ్వర్ రావుతో పాటు కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నాగేంద్రుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

# ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది...?

## – తొమ్మిదో వార్డులో ప్రమాదకరంగా స్ట్రీట్ లైట్ బోర్డు

## – స్పందించని అధికారులు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా కలం) పట్టణంలోని తొమ్మిదవ వార్డు సుల్తాన్ పుర లో స్ట్రీట్ లైట్‌కు సంబంధించిన విద్యుత్ బోర్డు ప్రమాదకరంగా తెరిచి ఉండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యుత్ మీటర్, వైర్లు బయటకు కనిపించేలా బోర్డు తెరిచి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదే ప్రాంతంలో ప్రజలు, చిన్నారులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తెరిచి ఉన్న విద్యుత్ బోర్డును వెంటనే సరిచేసి, ప్రమాదాలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని తొమ్మిదవ వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం)



జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు చెందిన పావని కంటి ఆసుపత్రి ఆప్టికల్ షాపు నిర్వాహకులు మాడప్ప శ్రీనివాస్ – జ్యోతి దంపతుల కుమార్తె వైష్ణవి – రాజా గణేశ్ ల వివాహ వేడుక సోమవారం జగిత్యాల పట్టణంలోని విరుపాక్షి గార్డెన్లో జరిగింది. ఈ వేడుకకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాధిక దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించి, నూతన దాంపత్య జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే దంపతులతో పాటు పట్టణానికి చెందిన రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సన్నిహితులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, దీవించారు.

## బోరేగాంలో మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

**– రూ. 22 లక్షల సీజీఎఫ్ నిధులతో ఆలయాల నిర్మాణం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



తానూర్, ఆగస్టు 17(ప్రజా కలం): తానూర్ మండలంలోని బోరేగాం గ్రామంలో శ్రీ మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాల నిర్మాణ పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శంకుస్థాపన చేశారు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సీజీఎఫ్ ద్వారా మంజూరైన రూ. 22 లక్షల నిధులతో ఈ నిర్మాణ పనులను చేపట్టనున్నారు, శంకుస్థాపన అనంతరం గ్రామంలోని బాలాజీ గుట్టపై ఉన్న మహాదేవుని ఆలయాన్ని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ క్యాటిల్ షెడ్ (గోశాల)ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు బోరేగాం గ్రామస్తులు ఎమ్మెల్యేకు మంగళహారతులు, భజనలతో ఘనంగా స్వాగతం పలికారు.

**గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి..** ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. బోరేగాం గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు, గ్రామస్తులు ప్రధానంగా ఎదుర్కొంటున్న ప్లాట్ల సమస్యను త్వరలోనే పరిష్కరించి, ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం చేపడతామని హామీ ఇచ్చారు,అలాగే గ్రామంలో కళ్యాణ మండపం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు, ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధిని కొనసాగిస్తామని, ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హోం గార్డ్ కు ఘన సన్మానం

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం) పోలీస్ శాఖలో విశిష్ట సేవలకు



రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న హోంగార్డ్ ఎం.డి. అక్తర్ ను సోమవారం సన్మానించి సత్కరించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ తన విశిష్ట సేవలకు గుర్తింపుగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్న హోంగార్డ్ జనాబ్ ఎం.డి. అక్తర్ ని మెట్ పల్లి మర్కజీ ఇంతెజామీ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. తన కర్తవ్యనిష్ఠ, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ మెట్ పల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన ఎం.డి. అక్తర్ కి మర్కజీ సెంట్రల్ కమిటీ తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారికి మరింత గౌరవం, ఆరోగ్యం, ఆయుష్షు ప్రసాదించి, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హాఫీజ్,జావిద్,సాదక్

## కస్తూర్బా పాఠశాలలో యూనిఫామ్, దుప్పట్ల పంపిణీ

**– ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది**
**– తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ వాసం సుష్మిత శ్రీకాంత్**



ఆళ్ళపల్లి, ఆగస్టు 17ప్రజాకలం : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు, షూస్, దుప్పట్లు, ఇతర సామగ్రిని స్థానిక తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ వాసం సుష్మిత శ్రీకాంత్ సోమవారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ సుష్మిత శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారి అవసరాలను కూడా ప్రభుత్వం తీర్చేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత బాలికల విద్య కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఏటా కస్తూర్బా పాఠశాలల్లో చదివే బాలికలకు రెండు జతల యూనిఫాంలతో పాటు బెల్టులు, సాక్స్, షూస్‌ను ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్, మహిళా నాయకురాలు పానుగంటి మంగ, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రశాంత్, గ్రామ కార్యదర్శి సాయిరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శ

**– పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి**



ఎండపల్లి, ఆగస్టు 17 : ( ప్రజా కలం ప్రతినిధి )

మండలంలోని పలు గ్రామాల లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ఎండపల్లి మండలం పాత గూడూర్ గ్రామం లో ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన బలిజపెల్లి తిరుపతి కుటుంబాన్ని సోమవారం రోజున ఆయన పరా మర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మృతుడి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించారు. అదే విధంగా పాత గూడూర్ గ్రామానికి చెందిన నులి గొండ వేణుగోపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం లో మరణించగా వారికుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి 5000 రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించారు. అలాగే గుల్లకోట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం లక్ష్మణ్ తండ్రి పొన్నం నారాయణ అనారోగ్యం తో ఇటీవలే మరణించగా కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించి వారి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించారు. ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, గూడ రామ్ రెడ్డి, పాత గూడూర్ గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్, బాల్సాని మల్లేష్ గౌడ్, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంజీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## కూసుమంచిలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు - పుట్టలకు పాలు పోసిన మహిళలు**

పాలేరు ఆగస్టు 17(ప్రజా కలం న్యూస్)



కూసుమంచి మండల వ్యాప్తంగా సోమవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు కొత్త బట్టలు ధరించి సమీపంలోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద పాలు పోసి, పసుపు, కుంకుమ, పూలు సమర్పించి నాగదేవతను భక్తిశ్రద్ధలతో పూజించారు. మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ గణపేశ్వరాలయం ఆవరణలో ఉన్న పుట్ట వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పుట్టకు పాలు పోసి, పూలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాగదేవతను ప్రార్థించారు. పుట్ట వద్ద అభిరామ్ శర్మ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా శ్రీశ్రీశ్రీ గణపేశ్వరాలయం శివాలయం లోపల కొలువైన శివుని విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషగిరి శర్మ ఆధ్వర్యంలో భక్తులకు శివునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వయంగా శివునికి అభిషేకాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నాగుల పంచమి సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి పూజలు, నైవేద్యాలు సమర్పించారు. పుట్టలకు పాలు పోసి నాగదేవతను పూజించడం ఆనవాయితీగా వస్తోందని, ప్రతి ఏడాది నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు పలువురు మహిళలు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ నాగుల పంచమి వేడుకలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**- క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**- ఖమ్మం జిల్లాలో 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల**
**- 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు**
**- ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం**

ఖమ్మం, ఆగస్టు–17(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే సెప్టెంబర్ 16 లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా, గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందన్నారు. ఇందులో 5,24,894 మంది పురుష, 5,60,973 మంది మహిళా, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,33,004 మంది అంటే 12.24 శాతం ఓటర్లను అనామలీస్ గుర్తించగా, 43,131 మంది అంటే 3.97 శాతం ఓటర్లకు మ్యాపింగ్ కానట్లు గుర్తించినట్లు మొత్తం 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

**నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలి**

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

**ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు పరిశీలించుకోవాలి**

ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేనట్లయితే బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎవశీవఢ్రీఖఅస్త్రుఖు.అఅఎ.అఅ వెబ్‌సైట్ ద్వారా తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేనట్లయితే లేదా వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే సెప్టెంబర్ 16, 2026లోగా అభ్యంతరాన్ని సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా అర్హత కలిగిన కొత్త ఓటర్లు ఫారమ్–6 ద్వారా సెప్టెంబర్ 16లోగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

**అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు**

ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్–6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.
చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు తెలియజేయడానికి ఫారమ్–7, మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, ఓటరు గుర్తింపు కార్డులో వివరాల సవరణలకు ఫారమ్–8 వినియోగించుకోవచ్చని వివరించారు.
క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశంలి ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు.
అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు.
ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.
ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధులు బి.వేణు గోపాల్, సతీష్ బాబు, ఎం.రమేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఎం డి.తిరుపతి రావు, కె.ప్రకాశం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సిహెచ్ నవీన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు, జి.సూర్య నారాయణ, బిఎస్పీ వేల్పుల రామయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని తల్లాడలో గ్రామదేవతలకు పూజలు





తల్లాడ ఆగస్టు 17 ప్రజాకలం న్యూస్



వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండాలని తల్లాడ పట్టణ రైతులు సోమవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ్ల తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ రైతులు, వ్యాపారవేత్తలు, మహిళలు బిందెల ద్వారా అమ్మవార్లకు నీరు పోస్తూ వర్షాలు కురవాలని పూజలు చేశారు. తల్లాడ పట్టణంలో ఉన్న పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో అన్ని వర్గాలప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ దేవతలకు పట్టణ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, నంబూరీ మోహన్ రావు, రెడ్డెం వీర మోహన్ రెడ్డి, షేక్. ఈసూబ్, గుంటుపల్లి వెంకటయ్య, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని రామయ్య, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భద్రారెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, మొక్కా బసవయ్య, మొక్క కృష్ణ అర్జున్, కేసర వెంకటేశ్వర రెడ్డి, రామారావు, లగడపాటి నెహ్రూ, వేమశెట్టి నాగన్న, చందర్రావు, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా దామల్ల రామ నియామకం

ఖమ్మం ఆగష్టు 17(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం ప్రాంతానికి చెందిన దామల్ల రామ ను బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర



అధ్యక్షులు క్రాంతి కిరణ్ సూచన మేరకు నియమించినట్లుగా బీజేపీ ఖమ్మం జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బండ్ల రీగన్ ప్రతాప్ తెలిపారు . బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బండ్ల రీగన్ ప్రతాప్ మాట్లాడుతూ దామాల్ల రమ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చురుకైన నాయకురాలు , పార్టీ సిద్ధాంతాలపై నమ్మకంతో పనిచేసే క్రమశిక్షణ గల కార్యకర్తగా కొనసాగుతున్నారని కొనియాడారు . అదేవిధంగా పార్టీని బలోపేతం చేయడంలో తన కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు . ఈ సందర్భంగా దామల్ల రామ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన బీజేపీ కర్ణాటక – తమిళనాడు రాష్ట్రాల జాతీయ సహ ఇన్చార్జి , మాజీ ఎమ్మెల్సీ డా. పొంగులేటి సుధాకర్ రెడ్డికి , బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రాంచందర్ రావు కు , బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు కు జిల్లా నాయకత్వానికి , పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు . ఎస్సీ సామాజిక వర్గ హక్కులు , సంక్షేమం కోసం కృషి చేస్తూ... పార్టీ కార్యక్రమాలను ప్రతి గ్రామం వరకు తీసుకెళ్లి బీజేపీకి మరింత బలం చేకూర్చేందుకు నిరంతరం పనిచేస్తానని అన్నారు .

## ఆగస్టు 19న దిశ సమావేశం నిర్వహణ – జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, ఆగస్టు –17( ప్రజా కలం న్యూస్ ) ఆగస్టు 19న బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 19న జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించు దిశ సమావేశానికి గౌరవ సభ్యులు అందరూ హాజరు కావాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతిరాలి కుటుంబన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

(వరంగల్ /పర్వతగిరి)ఆగస్టు 17, ప్రజాకలం ప్రతినిధి పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బాసాని వెంకటమ్మ మృతి చెందగా వారి కుమారులు బాసాని శ్రీనివాస్,



బాసాని రాజేష్ లను పరామర్శించి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి ఏర్రబెల్లి దయాకర్ రావు, ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, వార్డు సభ్యులు తుంగ రాజు, కొప్పు రాజు, ఇస్లావత్ హరీష్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మెరుగు వెంకటేశ్వర్లు, నాయకులు రంగు కుమార్ (ఫర్టిలైజార్), చింతపట్ల సునీల్ రావు, సకినాల వెంకన్న, ఎండీ శంశోద్దిన్, జంగ వీరమల్లు, దొనికేన రాజు, పైండ్ల రాజు మాడుగుల రాజు, స్వామి, చిరుకొండ రమేష్, పున్నం రాజు, పోకల మధు, ఇజ్జగిరి గణేష్ అంబటి కుమార్, బందారపు రంజిత్, దుండి హరీష్, చిరుకొండ నర్సయ్య, పైండ్ల సతీష్, మాడుగుల అఖిల్, బోట్ల ప్రశాంత్, రాహూల్, శ్రీకాంత్, చందు, మణికంఠ, రాజు, మహిళ నాయకురాలు బరిగెల విజయ, శనిగరం శేశిరేఖ లు పాల్గొన్నారు.

# తులం బంగారం దేవుడెరుగు..

## కనీసం పేదింటి "కళ్యాణమైన" జరిపించండి..

- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్
- హాజరైన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- షాద్ నగర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా - ఆందోళన
- ఆందోళనకు పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

( షాద్నగర్ ఆగస్ట్ 17 ప్రజా కలం ప్రతినిధి )

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదింటి ఆడపడుచుల కళ్యాణానికి తులం బంగారం ఇస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఏకంగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లకే ఎసరు పెడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ విమర్శలు గుప్పించారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించడం దీనినీ ఎత్తివేయకుండా ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట భారత రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. "నూరు అబద్దాలైన ఆడి ఒక పెళ్లి చేయాలని" ఆనాడు పెద్దలు నానుడి అంటూ ఉండేవారని పేద ఇంటి పిల్లలకు పెళ్లి చేయడానికి కన్న తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2014లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 51 వేల రూపాయల పారితోషకంతో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తరమైన పథకాలను ప్రవేశపెట్టారని, అలాగే పేదల అవసరాలకు అనుగుణంగా వారి ఇబ్బందులు గుర్తించి వాటిని లక్ష రూపాయలకు పైగా కేటాయించారని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి పై ఎవరో హైకోర్టులో రెడ్ పిటిషన్ వేగా కోర్టు ఐదు సందర్భాలలో ప్రభుత్వాన్ని సంజయ్యా కూరగా ప్రభుత్వ లీడర్ ఎవరు తగువిధంగా స్పందించలేదని అంజయ్య యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేద ప్రజల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను ఎతివేసేందుకు కుట్ర చేస్తుందని అందుకే ఉన్నత న్యాయస్థానానికి సమాధానం చెప్పుకోలేకపోయిందని అందుకే ఈ పథకాలపై స్టే విధించడం జరిగిందని అంజయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నో ప్రగల్బాలు పలికారని రెండున్నర



సంవత్సరాలు ప్రభుత్వం వచ్చి పాలన కొనసాగుతున్న తులం బంగారం ఇవ్వకపోగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తర పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాలు సామాజిక అంశంతో ముడి పెట్టి చూడాలని అంజయ్య యాదవ్ ప్రభుత్వానికి అప్పీల్ చేశారు. ఎందుకంటే పేద కుటుంబాల్లో ఆడపిల్లలు కన్న తల్లిదండ్రులకు భారం అని భావించి ఆడపిల్లలను అంగట్లో అమ్మివేస్తున్నారని చదువులు చదివిపించడం లేదని ఇలాంటి సమయంలో ఆడపిల్ల పుట్టగానే కెసిఆర్ ప్రభుత్వం ఆనాడు కెసిఆర్ కిట్ ద్వారా 13 వేల రూపాయలు ఇస్తుందని ఆ తర్వాత విద్య తదితర పథకాలలో ప్రాధాన్యత ఇస్తుందని పెళ్లి చేసి పంపే వరకు కళ్యాణ లక్ష్మి అందజేస్తుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య గుర్తు చేశారు. ఆడపిల్ల కోసం గత ప్రభుత్వం ఎంతో తాపత్రయపడి వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు రూపొందించింది అని గుర్తు చేశారు. ప్రభుత్వం కోర్టు అంశంలో వెంటనే స్పందించి విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రజలను చైతన్యవంతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ మహిళ స్త్రీ శిశు సంక్షేమ రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాల్ నాయక్, బీఆర్ఎస్ మండల, మున్సిపల్, గ్రామ, వార్డు అధ్యక్షులు, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దద్దరిల్లిన బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా

- పాల్గొన్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గుడిపూడి నవీన్ రావ్



మరిపెడ,ఆగస్టు 17. ప్రజా కలం న్యూస్

తెలంగాణలో రైతు బీమా పథకానికి సంబంధించి ఎల్ఐసికి ప్రీమియం చెల్లించాల్సిన గడువు ఆగస్టు 14తో ముగిసినా,రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.దీంతో రైతులకు ఉండే 5 లక్షల ప్రమాద బీమా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**రోడ్డెక్కిన బీఆర్ఎస్ నేతలు..** ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు డోర్నకల్ నియోజకవర్గంలో భారీ ధర్నా నిర్వహించారు. డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత,మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యానాయక్ అధ్యక్షతన,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు సమక్షంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై ప్రభుత్వ అతిథి గృహం ముందు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**రైతులకు భరోసా ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే:రెడ్యానాయక్**

ఈ సందర్భంగా మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ,బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతు బీమా,రైతుబంధు,సాగునీరు అందించామని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి భరోసా ఇచ్చామన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి మేనమామలా నిలిచి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్షా 16 వేల చెక్కు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,పేదలకు వరంగా ఉన్న రైతు బీమా,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే గత ప్రభుత్వ పథకాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**అమలు చేయాలెని హామీలతోనే అధికారం:నవీన్ రావు**

మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.కొత్త పథకాలు ఇవ్వడం లేదు సరికదా,ఉన్న పథకాలకు కూడా పంగనామం పెట్టారని ఆరోపించారు.రైతు ఏ కారణంతోనైనా చనిపోతే కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు పెట్టిన రైతు బీమాకు ప్రీమియం చెల్లించకపోవడం దారుణమన్నారు.

**తెలంగాణను ఆగంచేస్తున్నారు**

బీఆర్ఎస్ యువ నాయకులు డి.ఎస్. రవిచంద్రలి మాట్లాడుతూ,కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నుండి మోటార్ల ద్వారా నీరు ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.ప్రజాపాలన పేరుతో పేదల పథకాలను నిలిపివేయడం సరికాదని,వెంటనే తొలి తేదీ నుండే పథకాలను కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్పంచులు,వార్డు కౌన్సిలర్లు,మాజీ సర్పంచులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మీటింగ్ అనంతరం గుడిపూడి నవీన్ రావు టిఆర్ఎస్ నాయకులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో

**ప్రజావాణిలో ఫిర్యాదు**

రైతు బీమా,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ మరిపెడ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో నవీన్ రావు,బీఆర్ఎన్ నాయకులు ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి,ఎమ్మార్వో కృష్ణవేణిలకు వినతిపత్రం అందజేశారు...

# సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి

- పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 17:

గ్రామ పంచాయతీ అకౌంట్లో ఉన్న నిధులను ఫ్రీజింగ్ నుండి తీసివేసి, వాడుకునే సౌలభ్యాన్ని కల్పించాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్. హైద్రాబాద్ బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్వర్యంలో నిర్వహించిన సర్పంచ్ ల సమావేశానికి మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలను అందచేయడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ సర్పంచ్ ల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గారిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ....గ్రామ వ్యవస్థ బలోపేతం అయితేనే, రాష్ట్రం అభివృద్ధి అవుతుంది. గ్రామాలు నిర్వీర్యం అయితే రాష్ట్రం కూడా నిర్వీర్యం అవుతుంది. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నది గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికే, గ్రామాలలో ఎలాంటి కొరత లేకుండా 10 సంవత్సరాలలో చేసుకోవడం జరిగింది. భవిష్యత్ లో కూడా చేసుకోవాలి. గ్రామ పంచాయతీ లకు కేంద్ర నిధులు మాత్రమే వచ్చి, వాటితో జీతాలు ఇస్తున్నారు, కానీ దానికి సమానంగా మ్యాచింగ్ గ్రాంట్ అనేది రాష్ట్ర ప్రభుత్వం నుండి రావడం లేదని అన్నారు. సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు రావడం లేదన్నారు. గ్రామ పంచాయతీ లలో బ్యాంక్ అకౌంట్ లో నిధులు ఉన్నా వాటిని వాడుకోకుండా నిధులు ఫ్రీజ్ అయ్యి ఉన్నాయన్నారు. ప్రభుత్వం తో మాట్లాడి చరవ చూపించవలసిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ పదవి చాలా బాధ్యతాయుతమైన పదవి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, వ్యవసాయం పై ప్రధానంగా సర్పంచ్ లు దృష్టి పెట్టాలన్నారు. సర్పంచ్ ప్రధాన కీలకం ప్రభుత్వం ఇచ్చిన కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్తూ, ప్రభుత్వం నుండి రావలసిన హక్కులను కూడా పోరాటం చేయవలసిన అవసరం ఉంది గ్రామాలను తీర్చిదిద్దే ది కూడా సర్పంచులే బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల జేఏసీ అధ్యక్షులు, కార్యదర్శిలు, కార్యవర్గంతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసుకుని గ్రామాలలో జరిగుతున్న అభివృద్ధి, సమస్యలపైన చర్చించుకుందాం అని అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గారు మాట్లాడుతూ.. సర్పంచ్ లకు రావలసిన బిల్లులు పై ప్రభుత్వంతో కోట్లాడి, ఎన్ని బెదిరింపులు, కేసులు అయినా బెదరకుండా కొట్లాడి బిల్లులు ఇప్పించడం జరిగింది. బండారు రామ్మోహన్ రావు గారు మాట్లాడుతూ.. సర్పంచ్ లకు గ్రామ అభివృద్ధి మరియు తదితర అంశాలపై అవగాహన కొరకు ట్రైనింగ్ చాలా అవసరం అని కోరడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ సర్పంచ్ సంఘం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య, నాగయ్య, మధుసూదన్ రెడ్డి, జాతీయ లోక్ సత్తా సంస్థ అధ్యక్షులు బండారు రామ్మోహన్ రావు, మల్లయ్య, వెంకటేశ్వర్ రావు గారు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానికి పుట్టిన భయానికి నిదర్శనమే దిమాగి నక్సల్స్ వ్యాఖ్య

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ విమర్శ

నాగర్ కర్నూల్ ఆగస్టు 17 ప్రజా కలం (ప్రతినిధి ): దేశంలో మొదలైన ప్రజాస్వామ్యక యువతరం నవతరం పోరాటాల భయం ఆందోళన ప్రధాని నరేంద్ర మోడీ మదిలో మొదలైందని ఆ అబద్ధతభావం దిమాగీ నక్సల్స్ అనేటువంటి వివాదాస్పద వ్యాఖ్యలను చెప్పడం మొదలు పెట్టారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తీవ్రంగా విమర్శించారు సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే కేశవులు గౌడ్ జిల్లా మాట్లాడారు ఒకపక్క భారత పార్లమెంట్లో ప్రధాని మాట్లాడుతూ భారత్లో ఇక నక్సల్స్ లేరని అంటూ ఎర్రకోట సాక్షిగా దిమాగి నక్సల్స్ అంటే నక్సల్స్ ఆలోచన పరులు అని కొత్త పదాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుండి 14 వరకు జిల్లాలోని కొల్లాపూర్ నాగర్ కర్నూల్ కల్వకుర్తి అచ్చంపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన పాదయాత్రలను వివరించారు 2014 నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వా అనేక హామీలు ఇచ్చిందని అందులో ఒకటి కూడా అమలు చేయలేదని ఆయన తెలియజేశారు ప్రతి పేదవాడు అకౌంట్లో 15 లక్షలు వేస్తామన్నా హామీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీ డిజిలో వంట గ్యాస్,పెట్రోలు నిత్యవసర సరుకుల ధరలు అన్ని తగ్గిస్తావని రెండు నుంచి మూడు రెట్లు పెంచారని తీవ్రంగా ధ్వజమెత్తారు అంబానీ ఆదాని కుటుంబాలకు లాభం చేకూర్చే రకంగా దేశాన్ని నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఎవరైనా మాట్లాడిన విమర్శించిన వ్యక్తులపై దేశద్రోహం రాజ్య ద్రోహం కేసులు పెడుతూ ప్రజలను కులం మతం పేరుతో విడదీసి పాలిస్తున్నారని అన్నారు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయుటలో కాంగ్రెస్ క్షమించలేని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు ప్రజలు ఇందిరమ్మ ఇల్లు పెన్షన్లు మహాలక్ష్మి స్కీము అమలు వంటి తదితర అంశాలపై తీవ్రత ఎదుర్కోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన




హామీలు నెరవేర్చకపోతే సిపిఐ పాదయాత్రలో వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలియజేశారు వచ్చే నెల సెప్టెంబర్ ఒకటో తేదీన చలో ఢిల్లీ పేరుతో బద్లావు జరూరి హై మార్పు కావాలి అనే నినాదంతో లక్షలాది మందితో ఢిల్లీలో రామ్ లీలా మైదానం బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు తొమ్మిది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా జరిగిన పాదయాత్రలో సహకరించిన జిల్లా ప్రజానీకానికి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో సిపిఐ ప్రజా పోరాటాల పై చేసే అన్ని రకాల ఉద్యమాలకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు వెంటనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదా కల్పించేలా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని కోరారు అదేవిధంగా జిల్లాకు 5000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి సమగ్ర అభివృద్ధికై కృషి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఉందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మారేడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

# వందే భారత్ అవార్డు అందుకున్న మునగాల కళా వెంకట రత్నం

ఖమ్మం ఆగష్టు 17(ప్రజా కలం న్యూస్ )

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సంస్థ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ఫైడి జయరాజు ప్రీ వ్యూ థియేటర్ హైదరాబాదులో వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డును ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, చేతుల మీదగా వందే భారత్ అవార్డు అందుకున్న మునగాల కళా వెంకట రత్నం కళా రంగంలో ఎంచుకున్న మార్గంలో ఎంచుకున్న వృత్తిలో ఉత్తమ సేవల అందిస్తూ దేశ సమగ్రతను జాతీయ సమైక్యతను కాంక్షిస్తున్నందున జాతీయ సమైక్యత అవార్డుతో పాటు ప్రశంస పత్రమును అవార్డు గ్రహీత ప్రముఖ జానపద కళ సీనియర్ కళాకారులు పిట్టలదొర తెలంగాణ సాంస్కృతిక సారథి మునగాల వెంకటరత్నమ్మకు ప్రధాని చేయడం జరిగినది ఖమ్మం జిల్లాలో సుమారు 30 సంవత్సరాలగా సమాచార పౌర సంబంధాల శాఖలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సార నిషేధం పర్యావరణం ఎయిడ్స్ కుటుంబ నియంత్రణ అక్షరాస్యత అంటరానితనం బాల్య వివాహములు సామాజిక రుగ్మతలపై జానపద కళాకారుడుగా హరితహారం జన్మభూమి ఇందిరమ్మ సంబరాలు కుటుంబ నియంత్రణ స్తంభాద్రి సంబరాలు ఇందిరా మహిళా శక్తి వివిధ రకాల సామాజిక రుగ్మతలపై ప్రజలలో నిరంతర చైతన్యం మరియు అవగాహన కల్పించారు మారుమూల పల్లెల్లో కు సైతం కాలిబాట ద్వారా వెళ్లి గిరిజన ప్రజలలో కోయగూడాలలో పచ్చదనం పరిశుభ్రత పారిశుద్ధ్యం మూఢనమ్మకాలపై విస్తృతంగా తన కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చేత జిల్లా స్థాయి జాతీయస్థాయి మండల స్థాయి రాష్ట్రస్థాయిలో సైతం కూడా అవార్డులను కైవసం చేసుకున్నారు తనతోపాటు మరో పదిమంది కళాకారులతో కళా బృతి కల్పించడం లో మునగాల వెంకటరత్నం ఎప్పుడు ముందుండే వారు గత ముఖ్యమంత్రులు శ్రీ నారా చంద్రబాబునాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర రావు, చేత ప్రశాంస పత్రాలు అవార్డులు అందుకోవడం జరిగింది. మంత్రులు ఎమ్మెల్యేలు ద్వారా ప్రశంసలు పొందడం జరిగింది 1992 నుండి 2026 వరకు జిల్లా కలెక్టర్ల చేత ఉత్తమ సేవ ప్రశాంస పత్రాలు అందుకోవడం జరిగింది జిల్లాస్థాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్యాష్ అవార్డు ప్రశంస పత్రం అందుకోవటం జరిగింది తన యొక్క కళా రంగం విశ్వరూపమే




ఏ అవార్డుకు కారణం భవిష్యత్తులో మరెన్నో అవార్డులు రివార్డులు పొందాలని కళా రంగంలో రాణించాలని కోరుకుందాం మునగాల వెంకటరత్నం అవార్డు రావడం పట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి మహమ్మద్ గౌస్, గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, వందనం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నం చిన్న శంకర్ వారితోపాటు గ్రామంలోని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు అభినందించడం జరిగింది. వారితోపాటు సీనియర్ కళాకారులు కన్నెబోయిన అంజయ్య,మిమిక్రీ సుధాకర్, పమ్మి రవి, పాగి వెంకన్న, బీరెల్లి రమణ నందు, గురవయ్య జాను, మొగిలి వెంకటేశ్వర్లు, తదితరులు ఈ అవార్డు రావడం పట్ల జిల్లాకి గర్వకారణం అని అభినందించడం జరిగినది ఖమ్మం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద సంఘ కళాకారులు నిరుద్యోగ కళాకారుల సంఘం కళాకారులు యువజన సంఘాలు కళాకారులు వారు మునగాల వెంకటరత్నమును అభినందించారు హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయత జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, మరియు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహా రావు , వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సినీనటులు జెన్ని పోలా ప్రగడ జనార్ధన్ రావు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కపు వెంకటరమణ, వందే భారత్ మూవీ డైరెక్టర్ దర్శకనిర్మాత కళా రత్న మల్ల రమేష్, ఆధ్వర్యంలో ప్రముఖుల చేత అవార్డును అందుకోవటం జరిగింది.ఖమ్మం జిల్లాకు గర్వకారణం మరియు వందనం గ్రామం నుంచి వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు పొందటం మా గ్రామ ప్రజలకు ఎంతో సంతోషం అంటూ వందనం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ శ్రీ ఆవుల నాగేశ్వరరావు గారు మునగాల వెంకటరత్నం ను ప్రత్యేకంగా అభినందించడం జరిగినది.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలు వెంటనే అమలు చేయాలి

ఖమ్మం, ఆగస్టు 17( ప్రజా కలం న్యూస్)

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్, పిలుపు మేరకు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,ఆదేశాలతో ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ఉన్న న్యాయస్థాన స్టేను తొలగించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ప్రయోజనాలు అందించాలని, రైతుబీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు, రైతుబీమా పునరుద్ధరణ కోసం ఎదురుచూస్తున్న రైతులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బి.రెడ్డి నారా చంద్రారెడ్డి, నగర మాజీ కార్పొరేటర్లు కర్నాటి




కృష్ణ, తోట రామారావు, నాగళ్ల కోటేశ్వరరావు, మాటేటి నాగేశ్వరరావు, పసుమర్తి రామ్మోహన్, బుర్రి వెంకట్, బుడిగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వివిధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా నాయకులు ఎం.డి.వై. పాషా, బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం నాయకులు మోటే కుమార్, స్వామి, మహమ్మద్ తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

# గుంటూరుపల్లి పాఠశాలలో నోట్ బుక్స్ స్టేషనరీ, పంపిణీ



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 17, ప్రజాకలం ప్రతినిధి. మండలంలోని గుంటూరు పల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నోట్ బుక్స్, పెన్నులు , పెన్సిల్లు,కంపాక్స్ బాక్సు లను పంపిణీ చేసిన ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కె, సాంబయ్య, గ్రామపంచాయతీ సిబ్బందికి దుప్పట్లు, అంగన్వాడీ విద్యార్థులకు పలకలు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, మండల పరిషత్ విద్యాశాఖ అధికారి అల్లం దాస్ బిక్షపతి, ఉన్నత పాఠశాల హెచ్ఎం పి. సరళ, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఇఓ బిక్షపతి మాట్లాడుతూ, సాంబయ్య దాతృత్వం ను అభినందిస్తూ, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకుంటూ, ఉన్నతమైన చదువులు చదివి అభివృద్ధి చెందాలని చెప్పారు.

# 'పొంగులేటి' అభయం..

## నిరుద్యోగులకు 'రైట్ ఛాయిస్'!

**- ఖమ్మం, కొత్తగూడెంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్**

**- పోస్టర్‌ను ఆవిష్కరించిన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి**



ఖమ్మం ఆగష్టు 17(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం పోలీస్ కొలువు సాధించి ఖాకీ డ్రెస్‌లో చూడాలనే పేద తల్లిదండ్రుల కలలకు, నిరుద్యోగ యువత పట్టుదలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉచిత కోచింగ్ కొండంత అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అభ్యర్థుల కోసం ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు.

– లక్ష్యమే ప్రామాణికంగా. అగ్రశ్రేణి శిక్షణ.

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2016లోనే పొంగులేటి ఉచిత కోచింగ్ ద్వారా వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించి నిలదొక్కుకున్నారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన అత్యుత్తమ ఫ్యాకల్టీలతో నాణ్యమైన బోధన అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ప్రతిరోజూ మాక్ టెస్టులు, ఉచితంగా ప్రింటెడ్ స్టడీ మెటీరియల్, వారానికోసారి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ ఫలితమే లక్ష్యంగా తరగతులు నడుస్తాయన్నారు.

– ఒకే బ్యాచ్‌లో 344 ఉద్యోగాల రికార్డు

రాష్ట్రంలో పోటీ పరీక్షల శిక్షణలో అగ్రగామిగా ఉన్న 'రైట్ ఛాయిస్ అకాడమీ' ఛైర్మన్ మెండెం కిరణ్ కుమార్ నేతృత్వంలో ఈ పొంగులేటి ఉచిత శిక్షణ సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతంలో 2016లో పొంగులేటి-రైట్ ఛాయిస్ కలయికలో ఇచ్చిన శిక్షణ ద్వారా ఒకే బ్యాచ్ నుంచి ఏకంగా 326 మంది కానిస్టేబుళ్లు, 18 మంది ఎస్ఐలు ఎంపికై చరిత్ర సృష్టించారని కిరణ్ గుర్తుచేశారు. ఉద్యోగం సాధించాలనే బలమైన సంకల్పం ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

– వాట్సాప్‌లోనే రిజిస్ట్రేషన్

శిక్షణ పొందేందుకు అభ్యర్థులు తమ వివరాలను (పేరు, ఫోన్ నంబర్, గ్రామం, మండలం, నియోజకవర్గం) క్రింది నంబర్లకు వాట్సాప్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా అభ్యర్థులు 8985095599, భద్రాద్రి కొత్తగూడెం అభ్యర్థులు 8985096699 సంప్రదించాలని మెండెం కిరణ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కోసూరి శ్రీను, కొప్పుల అశోక్ , బజ్జూరి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, వెన్నుపూసల సీతారాములు, బానోత్ కిశోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ పర్యటనకు ఎంపికైన ఉపాధ్యాయుడు బొమ్మెర కుమారస్వామి

**అభినందనలు తెలిపిన మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి**

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 17, ప్రజాకలం ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్పోజర్ విజిట్ లో భాగంగా మరియు ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం కొరకు జపాన్ పర్యటనకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులలో పర్వతగిరి మండలం యుపిఎస్ దౌలత్ నగర్ పాఠశాల నుండి ఉపాధ్యాయుడు డాక్టర్ బొమ్మెర కుమారస్వామి ఎంపికవ్వడం అభినందనీయమని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 05-09-2026 నుండి 12-09-2026 వరకు కొనసాగే ఈ విద్యా పర్యటనలో జపాన్ దేశంలోని విద్యా విధానాలు బోధన పద్ధతులు వినూత్న కార్యక్రమాలను అధ్యయనం చేయడం జరుగునని తెలిపారు. మన రాష్ట్రంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ అధ్యయనం మరింత తోడ్పడుతుందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు డాక్టర్ బొమ్మెర కుమారస్వామి గారికి పర్వతగిరి మండల విద్యాశాఖ పక్షాన అభినందనలు తెలుపుతూ వారి పర్యటన విజయవంతం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ప్రజావాణిలో 11 దరఖాస్తులు

**- 25 శాఖల అధికారులకు గాను 14 శాఖల అధికారులు హాజరు**



ఎండపల్లి, ఆగస్టు 17 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ సోమవారం రోజున ప్రజా వాణి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించ బడింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన 11 దరఖాస్తులు స్వీకరించ బడ్డాయి. అధికారులు అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన పలు శాఖల అధికారులను ఎంపీడీవో దొండ కృపాకర్ ఆదే శించారు. హాజరైన వివిధ శాఖల 14 మంది అధికా రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో దొండ కృపాకర్, తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, పోలీస్ శాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి కామల్ల మహేష్, పశు వైద్యాధికారి డాక్టర్ బూర మనోజ్ కుమార్, మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, వైద్య అధికారి డాక్టర్ పి లవకుమార్, సిడిపిఓ యం ఆండాలు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి పి కృష్ణబాబు, మండల హౌసింగ్ అధికారి ఏఈ ఎస్ గౌతమి, సహాయ ఇంజనీర్ ఇరిగేషన్ జి ప్రవీణ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ / రెంజ్ ఆఫీసర్ ఇస్లావత్ నరేష్, సహాయ ఇంజనీర్ విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఎ ప్రేమలత ప్రజా సమస్యల ను వెంటనే పరి ష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమ న్వయం తో పనిచేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

# కొండగట్టు ఆర్టీసీ బస్సు

**- లారీ ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం**



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజాకలం) కొండగట్టు వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను ఆర్టీసీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.. ప్రమాద ఘటనపై సమగ్ర వివరాలు సేకరించి, బాధితులకు తక్షణ సహాయం అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# మేడిపల్లి పాఠశాల విద్యార్థినికి రూ.5,116 పారితోషికం



మెట్ పల్లి రూరల్, ఆగస్టు 17;(ప్రజా కలం);స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం రోజున మెట్టుపల్లి మండలంలోని మేడిపల్లి గ్రామంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. కీ.శే. ఆదిముల్క పోచయ్య, పోచమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినికి ట్రస్ట్ నిర్వాహకులు, వారి కుమారుడు ఆదిముల్క దశరథం రూ. 5,116 నగదు పారితోషికాన్ని అందజేశారు. విద్యార్థినిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిముల్క దశరథం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో రాణించేందుకు ప్రోత్సాహం అవసరమని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

# త్రాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు

**పాలేరు, వైరా జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

పాలేరు ఆగష్టు -17(ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో ప్రస్తుతం త్రాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రాగునీటి అవసరాల కోసం పాలేరు, వైరా జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు ఉన్నాయని అన్నారు. పాలేరు జలాశయంలో ప్రస్తుతం 17.3 అడుగుల నీటిమట్టం ఉందని, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల త్రాగునీటి అవసరాలకు సుమారు 60 రోజుల పాటు నీరు సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వైరా జలాశయంలో 16.8 అడుగుల నీటిమట్టం ఉందని, వైరా, మధిర నియోజకవర్గాల త్రాగునీటి అవసరాలకు సుమారు 135 రోజుల పాటు నీరు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం త్రాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో నమోదయ్యే వర్షపాతం, ప్రాజెక్టులకు వచ్చే వరద ప్రవాహాలను బట్టి సాగునీటిని విడుదల చేసే అంశంపై



నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం త్రాగునీటి అవసరాలను తీర్చడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. త్రాగునీటి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు, అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం త్రాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్య లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు వైస్ ఎంపీపీ ఈరన్న భరోసా.. రూ.50 వేల చేయూత

**విద్యా వాలంటీర్ కోసం ఆర్థిక సాయం**



గద్వాల ప్రతినిధి ఆగస్టు 17 ప్రజా కలం:

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మద్దెలబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి మాజీ వైస్ ఎంపీపీ పెద్ద ఈరన్న రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను ప్రధానోపాధ్యాయుడు గోవిందు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పెద్ద ఈరన్న మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం మన సామాజిక బాధ్యత. పేద పిల్లల చదువుకు చేసే ప్రతి సహాయం వారి భవిష్యత్తుకు బలమైన పునాది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పెద్ద ఈరన్న అందించిన సహాయంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆడబిడ్డల సంక్షేమానికి తూట్లు పొడిస్తే ఊరుకోం

**కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి**

**మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి -కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా**

పెద్దపల్లి,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణలో పేద,మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగిస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థికభారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద మొదట రూ. 51,000 ఆర్థిక సహాయం అందించగా,అనంతరం దానిని రూ. 75,116కు,ఆ తర్వాత రూ. 1,00,116కు పెంచినట్లు తెలిపారు. ఈ పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అందించే సహాయం ఆలస్యం కావడం వల్ల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. పెండింగ్‌లో



ఉన్న కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని,అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వివాహం జరిగిన తర్వాత కూడా నెలల తరబడి పథకం డబ్బుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలనీ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి ఈ పథకాలను అమలు చేశామని,కాంగ్రెస్ ప్రభుత్వంకూడా రాజకీయాలకు అతీతంగా పేద ఆడబిడ్డల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు. జిల్లాలో కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ కింద పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. పేద ఆడబిడ్డల వివాహాలకు భరోసాగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేస్తే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమిల్ల రాకేష్ కుమార్,జిల్లా గ్రంథాలసంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

**మెరుగైన వైద్య సేవలు అందించేలా జిల్లాకలెక్టర్ కు ఆదేశం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

వెల్గటూర్, ఆగస్టు 17, ప్రజాకలం, ప్రతినిధి :

జగిత్యాల జిల్లా, కొండగట్టు వద్ద కరీంనగర్ - జగిత్యాల రహదారి పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో ఫోన్ లో మాట్లాడారు.

ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. రోడ్డు ప్రమాద సంఘటనపై విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా చూస్తానని మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు.

# దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసుల పెండింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు. అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలోని వివరాల మేరకు.. సిట్టింగ్ ఎంపీలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది. లోక్‌సభలోని 170 మంది సభ్యులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.

## హనుమకొండ డిపిఆర్ఓ గా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవి

హనుమకొండ ఆగస్టు 17 ప్రజా కలం ప్రతినిధి హనుమకొండ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా బండి పల్లవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ని డిపిఆర్ఓ గా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.నూతనంగా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవికి పలువురు అధికారులు,కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- గ్రీవెన్స్ డేలో 21 ఫిర్యాదులు.**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

రాజన్న సిరిసిల్ల ఆగస్టు 17 ( ప్రజా కలం ప్రతినిధి) :

బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు, సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 21 ఫిర్యాదులను స్వీకరించారు, ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు, ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి క్షేత్రస్థాయిలో విచారణ



చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

**పోలీస్ సేవలు మరింత చేరువగా...**

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి వినతులు, ఫిర్యాదులను స్వీకరించాలని ఆదేశించారు,అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు,దీంతో పోలీస్ శాఖపై ప్రజల్లో భరోసా, నమ్మకం పెరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ -- షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ నిరసన

కూకట్ పల్లి, ఆగస్టు 17, ప్రజా కలం ప్రతినిధి:

కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ -- షాదీ ముబారక్ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని, వెంటనే కళ్యాణ లక్ష్మీ -- షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేయాలనీ హైదర్ నగర్ మెయిన్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నక్క శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, సుబ్బరాజు, కలీం, సంజీవరెడ్డి, వెంకటేష్ యాదవ్, ఖదీర్ లతో కలసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. పేద కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో భరోసా ఇచ్చాయని, వివాహ సమయంలో ఆర్థికంగా అండగా నిలిచే ఈ పథకాలను రాజకీయ కక్షతో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మహిళలకు ఇచ్చే కెసిఆర్ కిట్టు,ఆడపిల్ల పుడితే 14000 రూపాయలు, మగ పిల్లవాడు పుడితే 13000 రూపాయలు ప్రభుత్వం తరపున అందించే ఆర్థిక సాయం వెంటనే అమలు చేయాలని అన్నారు. బతుకమ్మకి ఇచ్చే చీరలను మూడు సంవత్సరాల నుంచి ఇవ్వట్లేదని ఈసారైనా ప్రతి మహిళకి బతుకమ్మ చీరలు ఇవ్వాలని, ఒంటరి మహిళా పెన్షన్లు, ఆసరా పింఛన్లు కొత్తగా మంజూరు చేయకపోగా అమలు అవుతున్న పింఛన్లను చాలామందికి నిలిపివేశారని, అవి వెంటనే వారందరికీ అందజేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. పెళ్లి చేసుకునే పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన సమయంలో పథకాలను నిలిపివేయడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కళ్యాణ లక్ష్మీ -- షాదీ ముబారక్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న చెక్కులు, ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి జాప్యం లేకుండా పథక ప్రయోజనం అందించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని, అవసరమైతే మహిళలందరితో కలిసి ఎమ్మెల్యేలను, సీఎం ఆఫీస్, అసెంబ్లీ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.




## కళ్యాణలక్ష్మి పథకం కొనసాగించాలి

**- రూ.1,00,116 సాయం అమలు చేయాలి: బాసు హనుమంతు నాయుడు**




గద్వాల ప్రతినిధి ఆగస్టు 17 ప్రజా కలం:

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి పాత బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని తెలిపారు. రూ.51 వేలతో ప్రారంభమైన సాయాన్ని రూ.1,00,116కు పెంచారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.1,00,116 సాయంతో పాటు తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. పథకాలను పునరుద్ధరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిత్తరి మంజుల రాణి కిరణ్, కమ్మరి సునీత రాము, లత రామకృష్ణ, గువ్వల గోపాల్, చంటన్న, మోహన్ యాదవ్, నరసింహులు, కోటేష్, రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అల్లపాడు ప్రతాప్, గంజిపేట రాజు, వెంకటేష్ నాయుడు, బాసు గోపాల్, శ్రీకాంత్, రాజు నాయుడు, శేఖర్, తిరుమలేష్, లక్ష్మారెడ్డి, గోవిందు, రాముడు, తిరుమల, మాలిక్, అరవింద్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతోనే శాశ్వత ఆదాయం

**ఉద్యాన విస్తరణ అధికారి రాము – రైతు రిజిస్ట్రీ తప్పనిసరి: మండల వ్యవసాయాధికారి సంధ్య**

కాల్వ శ్రీరాంపూర్,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

సాంప్రదాయ సాగును వీడి మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల వైపు అడుగులు వేయాలని,ప్రభుత్వ రాయితీలు ఫలించాలంటే రైతు రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని శ్రీరాంపూర్ మండల వ్యవసాయ అధికారి సంధ్య,ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము పిలుపునిచ్చారు. మండలంలోని తారుపల్లి,మీర్జంపేట్,శ్రీరాంపూర్ శివార్లలో విస్తరించి ఉన్న పామాయిల్,కూరగాయలు, పసుపు,పూల తోటలను వారు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి,పత్తి,మొక్కజొన్న వంటి ఒకే రకమైన పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారానే రైతులకు శాశ్వత ఆదాయ మార్గాలు ఏర్పడతాయని వారు స్పష్టం చేశారు. బోర్ల కింద బిందు సేద్యం పద్ధతిని ఉపయోగించి పామాయిల్,పండ్లు,



కూరగాయలను పండించాలని, ముఖ్యంగా కూరగాయల సాగులో మల్చింగ్ పద్ధతిని ఆచరించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.పామాయిల్ తోటలు,డ్రిప్, స్ప్రింక్లర్లు మరియు ఇతర ఉద్యాన పథకాల రాయితీలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటే తమ భూముల్లోని పంటల వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఈశ్వర్ తో పాటు స్థానిక ఉద్యానవన రైతులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు అక్రమాల గుట్టు రట్టు

**- రూ.24.18 కోట్ల ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం**

**ఇద్దరు రైస్ మిల్లర్ల అరెస్ట్ -పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**



పెద్దపల్లి,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో రూ.24.18 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం అయిన వ్యవహారంలో లక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్ రేణికుంట మధు,పార్టనర్ రేణికుంట రవీందర్ రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు.సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ జి.కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కెఎంఎస్ 2023–24 సీజన్‌కు సంబంధించి సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు కస్టమ్ మిల్లింగ్ నిమిత్తం 10,015.636 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యాన్ని అప్పగించగా,దీనికి ప్రతిగా 6,662.880 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అందించాల్సి ఉండగా మిల్లర్లు కేవలం1,577.289 మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు మరో 64.872 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ కు సమానమైన నగదును మాత్రమే చెల్లించారని,ఇంకా 5,020.719 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉండగా దానికి సమానమైన 7,493.610 మెట్రిక్ టన్నుల ధాన్యం డిఫాల్ట్ అయినట్లు తేలిందని తెలిపారు.గడచిన ఆగస్టు 6న సివిల్ సప్లైస్ అధికారులు మిల్లులో భౌతిక తనిఖీలు నిర్వహించగా ఎలాంటి స్టాక్ అందుబాటులో లేకపోవడంతో,ధాన్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారని,జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా తాజాగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు.ప్రభుత్వ ధాన్యం,బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు,ఎస్సై ఇంద్ర కుమార్ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



పెద్దపల్లి,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణంలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి.స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీకి పెద్దఎత్తున ఎదురుదెబ్బ తగిలింది.పట్టణంలోని బందారికుంట ప్రాంతానికి చెందిన 19వ వార్డులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మహమ్మద్ షఫీ, అధికారికంగా బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి అలాగే ఆ పార్టీ పదవులకు తన రాజీనామాను సమర్పించారు.పార్టీ వీడిన ఆయన,ఒంటరిగా కాకుండా తనతో పాటు ఉన్న భారీ యూత్ సభ్యులు,అనుచరుల బలంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు.ఈ మేరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చేరికల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు కొలిపాక శ్రీనివాస్ నూతనంగా పార్టీలోకి అడుగుపెట్టిన మహమ్మద్ షఫీతో పాటు ఆయన అనుచరులందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.భవిష్యత్తులో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వ బలాన్ని బలోపేతం చేసే దిశగా ఆయన వెంటే నడుస్తామని, ఆయన అడుగుజాడల్లోనే ప్రజల కోసం పని చేస్తామని షఫీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ రాజకీయ పరిణామం ద్వారా బీఆర్ఎస్‌ను వీడి ఫార్వర్డ్ బ్లాక్ గూటికి చేరిన వారిలో నవాబ్, ఎండి గౌస్,ఇంతియాజ్‌ఖాన్,ఎండి అహ్మద్,ఎండి సోను,షకీల్, ఆఫీజు,చంద్‌పాషా,నవీద్,హజార్ తదితర యువనేతలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కుక్క కనకరాజు,కుక్క చరణ్,మాచర్ల సాగర్, పేర్క సాయి,నరేష్,శ్రావణ్,సృజిత్,గనీ,విజయ్,శ్రీనాథ్,తిరుమల్ రావు,తదితరులు హాజరై నూతన సభ్యులను అభినందించారు.

## అభివృద్ధిని విస్మరిస్తే ఊరుకోం

**– బీజేపీ నేత అమరగాని ప్రదీప్ కుమార్**

**– రోడ్లు,బ్రిడ్జిల నిర్మాణం వెంటనే చేపట్టాలి**

**– ప్రజావాణిలో అధికారులకు బీజేపీ వినతిపత్రం**



జూలపల్లి,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మండల కేంద్రంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న పోలీస్ స్టేషన్ చౌరస్తా,అంబేద్కర్ చౌరస్తా మెయిన్ రోడ్డు నిర్మాణాలు,చిన్న వర్షానికే నీట మునిగే వాగుపై నూతన బ్రిడ్జి పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తొలిరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత 12 సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద రోడ్డు గుంతలతో, కంకర తేలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పు కోసం ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్ల నిర్మాణాలను వదులుకుంటే అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా వాగుపై బ్రిడ్జి పనులు చేపట్టకపోవడంతో వినూత్న రీతిలో శిలాఫలకానికి పుట్టినరోజు జరిపి నిరసన తెలపాల్సి వచ్చిందని తెలిపారు.అలాగే మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు వెంట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్,నాయకులు మల్లెత్తుల అంజి యాదవ్,పొన్నం వెంకటేష్,సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి,బోడిగె లక్ష్మణ్,కంచి శ్రీనివాస్, గుంటి అశోక్,ముక్కెర వెంకటేష్,కత్తెర్ల రాజేశం,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లపై ఉక్కుపాదం

**38 మంది రైస్ మిల్లర్ల వద్ద రూ.238 కోట్ల మేర బకాయిలు - 7 క్రిమినల్ కేసులు నమోదు,ఒకరిపై పీడీ యాక్ట్ అమలు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి,ఆగస్టు17:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకుని,నిబంధనల ప్రకారం సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా బకాయిలు పెట్టిన రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్‌కు సంబంధించి 38 మంది రైస్ మిల్లర్ల వద్ద సుమారు రూ.238 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు తెలిపారు.ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం,తరలింపు, లెక్కల్లో చూపకపోవడం తదితర అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ,రికార్డులను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే ప్రభుత్వ ధాన్యం విషయంలో 7 క్రిమినల్ కేసులు నమోదు చేయగా,ఒకరిపై పీడీ యాక్ట్ కేసు కింద చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మరో 31 రైస్ మిల్లుల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వలు,సీఎంఆర్ డెలివరీ,సంబంధిత రికార్డులపై పంచనామా ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.ప్రభుత్వ ధాన్యం ప్రజాధనం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తి అని,కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని నిబంధనల మేరకు మిల్లింగ్ చేసి,నిర్ణీత సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ,టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అప్పగించిన ధాన్యాన్ని లెక్కల్లో చూపకుండా ఉంచడం,ఇతర అవసరాలకు మళ్లించడం లేదా సీఎంఆర్‌ను అందించకుండా బకాయి పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు.సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌పై ఆగస్టు 6న నిర్వహించిన తనిఖీలో ప్రభుత్వ ధాన్యం నిల్వలు భౌతికంగా అందుబాటులో లేనట్లు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 2023–24 ఖరీఫ్,రబీ సీజన్లకు సంబంధించి మొత్తం 7,493.610 మెట్రిక్ టన్నుల ధాన్యం డిఫాల్ట్‌గా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, 25 శాతం పెనాల్టీతో కలిపి రూ.24.18 కోట్ల మేర డిఫాల్ట్ మొత్తం ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో సంబంధిత మిల్లర్ ప్రభుత్వ ధాన్యాన్ని సక్రమంగా లెక్కించకపోవడం,సీఎంఆర్‌ను అందించకపోవడం వంటి అంశాలపై టీజీఎస్‌సీఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అసలు రికార్డులు,ధాన్యం అప్పగింత వివరాలు, సీఎంఆర్ డెలివరీ రికార్డులు,రవాణా వివరాలు,భౌతిక తనిఖీ నివేదికలను పరిశీలించి పూర్తి వివరాలను నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు.కొన్ని మిల్లుల వద్ద గత సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యం కూడా భౌతికంగా అందుబాటులో లేనట్లు గుర్తించిన నేపథ్యంలో,సంబంధిత రికార్డులను పరిశీలించి బాధ్యులపై



నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ ధాన్యం,సీఎంఆర్ బకాయిల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా తనిఖీలు,పంచనామాలు,రికార్డుల పరిశీలన నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్‌ను సకాలంలో అందించడంతో పాటు, బకాయిలను పూర్తిగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు,బకాయిల వసూలు,రెవెన్యూ రికవరీ తదితర చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో

# అధికారుల నిర్లక్ష్యం

**- బీజేపీ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన**




మల్కాజిగిరి,ఆగస్టు27,(ప్రజా కలం ప్రతినిధి):

ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మల్కాజిగిరి బీజేపీ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.జోనల్ కమిషనర్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం వద్ద నిరసన తెలిపిన నాయకులు,అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి పరిధిలో గుంతలమయమైన రహదారులతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైనేజీ పనుల్లో జాప్యం కారణంగా కాలనీల్లో దుర్వాసన వ్యాపిస్తోందని నాయకులు ఆరోపించారు.అనేక ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగకపోవడం, చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రత్యేకంగా సఫిల్‌గూడ,బండ చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోవడంతో దోమల బెడద తీవ్రంగా మారిందని మాజీ కార్పొరేటర్ లు ఆందోళన వ్యక్తం చేశారు.దోమల కారణంగా స్థానిక ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తక్షణమే తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజల నుంచి వివిధ పన్నులు, రుసుముల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతున్నప్పటికీ, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. గుంతల రహదారుల కారణంగా ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోకపోవడం, పారిశుద్ధ్య సమస్యలపై నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, శ్రవణ్, సునీత యాదవ్, వసంశెట్టి శ్రీనివాస్, బాలచందర్ గౌడ్, బక్క నాగరాజు, ప్రభు గుప్తా, సాయిబాబా, కిరణ్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### బీఎల్ఓలు, ఆశా కార్యకర్తల బకాయి

# గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలి

**-జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన..**



మల్కాజిగిరి,ఆగస్టు 17,(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, ఆశా కార్యకర్తలకు బకాయిగా ఉన్న వేతనాలు, పారితోషికాలను తక్షణమే చెల్లించాలని స్థానిక బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బకాయి వేతనాల కోసం పోరాడుతున్న కార్యకర్తలకు స్థానిక బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించడంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సర్వేలు, ఓటరు జాబితా సంబంధిత విధుల్లో బీఎల్ఓలు, ఆశా కార్యకర్తలు నిరంతరం సేవలందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన సమగ్ర సర్వేతో పాటు గత రెండు నెలలుగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ విధుల్లో మహిళా కార్యకర్తలు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ, వారికి సంబంధించిన పారితోషికాలు ఇప్పటివరకు చెల్లించలేదని తెలిపారు.

సమగ్ర సర్వేలో పాల్గొన్న 35 మంది ఆశా కార్యకర్తలకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని, జనగణన విధుల్లో పాల్గొన్న సుమారు 600 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే బీఎల్ఓలకు గత నాలుగేళ్లుగా గౌరవ వేతనం చెల్లించలేదని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ మొదటి దశ విధుల్లో పాల్గొన్న సుమారు 600 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

బకాయి చెల్లింపుల్లో జాప్యం కారణంగా కార్యకర్తలు,వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి మొత్తంలో కనీసం 50 శాతాన్ని మధ్యంతర ఉపశమనంగా వెంటనే చెల్లించాలని,మిగిలిన మొత్తాన్ని కూడా త్వరితగతిన విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న బీఎల్ఓలు, ఆశా కార్యకర్తల సేవలను గుర్తించి వారికి రావాల్సిన బకాయిలను ఆలస్యం చేయకుండా చెల్లించాలని, చిన్నాచితకా కుటుంబాలు రోజువారి కూలికి వెళ్ళిన మాకు డబ్బులు వచ్చేటివి ఇంటికి రాయిలు కట్టుకోలేక పిల్లలను చదివించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు వారి డబ్బులు వారికి ఇవ్వండి మిగతా కమిషనర్ పరిధిలలో డబ్బులు చెల్లించారు వీరిపై ఎందుకు వివక్ష అని స్థానిక బీజేపీ నాయకులు కోరారు.

రెండు రోజులలో వాళ్లకు అందాల్సిన కొంతమేర గౌరవ వేతనాన్ని అందేలా చూస్తాం అని జోనల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో రెండు రోజులలో గౌరవ వేతనాన్ని అందించకపోతే మళ్లీ నిర్వాహక సమ్మె చేస్తాం ఎస్ఆర్ఐ ప్రక్రియ లో నోటీసులు ప్రజలకు అందించే కార్యక్రమంలో పాల్గొన్న నిరసన తెలుపుతామని చెప్పిన బిఎల్ఓ లు.ఈ కార్యక్రమంలో బి ఎల్ వోలు హేమలత, ఎస్ రాణి, తులసి, వసంతా స్వాతి,నమ్రుత, టి హేమలత, శోభ,సంతోషి, చంద్రకాంత,సునీత, లీనా,మాజీ కార్పొరేటర్ లు రాజ్యలక్ష్మి,శ్రవణ్, సునీత యాదవ్, వసంశెట్టి శ్రీనివాస్, బాలచందర్ గౌడ్,బక్క నాగరాజు,ప్రభు గుప్తా, సాయిబాబా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాడు ఆటతో భక్తులకు టోకరా

**- ఇద్దరు నిందితులు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు.**

**- రూ.2 వేల నగదు, ఆట సామగ్రి స్వాధీనం.**

వేములవాడ, ఆగస్టు 17 ( ప్రజా కలం ప్రతినిధి) :

ఆలయానికి వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని 'తాడు ఆట' పేరుతో జూదం నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని వేములవాడ పోలీసులు అరెస్టు చేశారు, హనుమకొండ జిల్లా ఐనవోలుకు చెందిన రాయపురం సురేందర్ (42), ఆత్మకూరుకు చెందిన పల్లకొండ దేవేందర్ (33)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు,విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. తాడు ఆట నిర్వహిస్తున్న ప్రదేశంపై దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు,వారి నుంచి తాడు ఆటకు వినియోగించే సామగ్రి, అప్పర పెన్సిళ్లు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అక్రమ కార్యకలాపాలపై నిఘా..



భక్తులు అధికంగా వచ్చే ప్రాంతాల్లో అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడటం, జూదం నిర్వహించడం వంటి అక్రమ కార్యకలాపాలను సహించబోమని సీఐ స్పష్టం చేశారు,ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# నిర్మాణ పనులతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

మల్కాజిగిరి ఆగస్టు 17(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్ వద్ద జరుగుతున్న



రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, ఉత్తమ్ నగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను మల్కాజ్‌గిరి ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి పరిశీలించారు. సోమవారం మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. నరసింహ, రైల్వే అధికారులు, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ దివ్య జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంతో కలిసి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలను డీసీపీ సందర్శించారు.నిర్మాణ పనుల నేపథ్యంలో చేపట్టాల్సిన ట్రాఫిక్ మళ్లింపు,ట్రాఫిక్ నియంత్రణ,నిర్వహణ చర్యలపై అధికారులతో చర్చించారు.పనులు కొనసాగుతున్న సమయంలో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం లేకుండా సమర్థవంతమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను డీసీపీ ఆదేశించారు.రోడ్డు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ముఠా గోపాల్‌కు డాక్టరేట్.. అభినందించిన బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్,ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి) ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు క్రిస్ హోలీ స్పిరిట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉద్యమకారులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రేషం మల్లేష్,కల్వ గోపి, సిరిగిరి శ్యామ్,బల్లెకారి రాములు, బల్లెకారి రమేష్, బోచు వెంకటేష్, మధు తదితరులు ముఠా గోపాల్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. డాక్టరేట్ అందుకోవడం ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ శ్రేణులకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. భవిష్యత్తులోనూ ప్రజాసేవలో మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రణాళికతో చదివితే లక్ష్య సాధన

**- కేజీబీవీలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ**

వేములవాడ, ఆగస్టు 17 ( ప్రజా కలం ప్రతినిధి) : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

సోమవారం వేములవాడ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు,ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు,అనంతరం కిచెన్‌ను తనిఖీ చేసి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, పప్పులు, బియ్యం తదితర సరుకుల నాణ్యతను పరిశీలించారు,వాటి గడువు తేదీలను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్న తీరును పరిశీలించారు.విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వారితో కలెక్టర్ ముచ్చటించారు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా? ఆహారం ఎలా ఉంటోంది? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రశ్నాపత్రాల సాధన చేయాలి..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి నుంచే అన్ని పాఠ్యాంశాలను శ్రద్ధగా చదవాలని, ప్రశ్నాపత్రాలను సాధన చేయాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యాభ్యాసం కొనసాగించాలని తెలిపారు,తాము కోరుకున్న ఉద్యోగాలు సాధించడంతో పాటు స్వయం ఉపాధిలో స్థిరపడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.



ఆరోగ్యమే ముఖ్యం..

విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు,విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యాలయంలో అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# భీమేశ్వరుడి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి

**- శ్రావణ తొలి సోమవారం...**

**నాగుల పంచమి సందర్భంగా భక్తుల రద్దీ.**

**- ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు.**

వేములవాడ ఆగస్టు 17 ( ప్రజా కలం ప్రతినిధి) :

శ్రావణమాసం తొలి సోమవారం, నాగుల పంచమి పర్వదినం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, శభక్తులు తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. చండీ హోమం, నిత్యకల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, అభిషేకం, అన్నపూజ, ఆకుల పూజ, మహాలింగార్చన, కుంకుమ పూజ, గండదీపం తదితర ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం, ప్రసాదాల పంపిణీ, తలనీలాల సమర్పణ, తాగునీరు, పారిశుద్ధ్యానికి అవసరమైన



సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో రమాదేవి స్వయంగా పర్యవేక్షించారు, ఆలయ అధికారులు, ఉద్యోగులు, వేద పండితులు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ భక్తులకు సహకరించారు. ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణంలో భక్తిభావం వెల్లివిరిసింది.

# అక్రమ కట్టడాల జోరు!

## నోటీసులకే అధికారుల హోరు!..

-అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేదా?
- నోటీసులతోనే టౌన్‌ప్లానింగ్ హడావుడి!
- పర్యవేక్షణ కరువు.. నిర్మాణాలు జోరు..
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం..





పటాన్‌చెరు, ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి

పటాన్‌చెరు, ఇస్నాపూర్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా వాటిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అడ్డుకోవాల్సిన మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతులు ఉన్నాయా? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా? అనేది ముందుగానే పరిశీలించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాల్సిన అధికారులు.. నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టించుకోకుండా, ఆ తర్వాత నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ నిర్మాణదారులకు అధికారుల నోటీసులు భయం కలిగించకుండా, ఒక సాధారణ ప్రక్రియగా మారిపోయాయనే విమర్శలు స్థానికుల నుంచి వస్తున్నాయి..

**పర్యవేక్షణ ఎక్కడ?..**

మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ నిర్మాణాలు పెరుగుతున్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగం నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

**నోటీసులతోనే సరిపెట్టడంపై ఆగ్రహం..**

అక్రమ నిర్మాణాలను గుర్తించిన తర్వాత కేవలం నోటీసులు ఇచ్చి వదిలేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం ఎలా లభిస్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అవసరమైతే నిర్మాణాలను నిలిపివేయడం లేదా తొలగించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు..

**అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు..**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తూ, మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు తమ బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యం కొనసాగితే భవిష్యత్‌లో మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళిక పూర్తిగా గాడితప్పే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు? నోటీసులతోనే కాలం వెళ్లదీస్తారా? లేక కఠిన చర్యలు చేపడతారా? అంటూ ఇస్నాపూర్ ప్రజలు మున్సిపల్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు..

# ఉత్తమ్ నగర్ టీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

మల్కాజిగిరి ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి ఉత్తమ్ నగర్ టీ జంక్షన్--ఏఓసీ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆగస్టు 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తాత్కాలిక ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. నిర్మాణ పనుల కారణంగా పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆనంద్‌బాగ్ ఎక్స్‌రోడ్, గౌతమ్ నగర్, మల్కాజిగిరి వైపు నుంచి ఏఓసీ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను ఉత్తమ్ నగర్ టీ జంక్షన్ వద్ద అనుమతించరు. వాహనదారులు గౌతమ్ నగర్ రోడ్డు, తుకారామ్‌గేట్ మెయిన్ రోడ్డు,ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్డు మీదుగా ఏఓసీ జంక్షన్‌కు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏఓసీ జంక్షన్ నుంచి ఉత్తమ్ నగర్ టీ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్డు వైపు మళ్లించనున్నారు. అక్కడి నుంచి తుకారామ్‌గేట్ మెయిన్ రోడ్డు,గౌతమ్ నగర్ రోడ్డు మీదుగా ఉత్తమ్ నగర్ టీ జంక్షన్‌కు చేరుకునేలా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని,ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ అధికారులు విజ్ఞప్తి చేశారు




# హనుమాన్ నగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు

మల్కాజిగిరి ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి)

హనుమాన్ నగర్‌లో 186వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతుల వినోద్



యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద బోనాల పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల వేడుకల్లో కాలనీవాసులు, మహిళలు,యువత, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



# అదృష్టం ఎవరిని వరించేనో...?

## 3,893 దరఖాస్తులు.. 480 ఇళ్లు!

### అంబర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీ స్పందన

అంబర్‌పేట, ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అంబర్‌పేట నియోజకవర్గంలో భారీ స్పందన లభించింది. నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇళ్ల కోసం ఏకంగా 3,893 దరఖాస్తులు అందాయి. దీంతో లాటరీలో అదృష్టం ఎవరిని వరిస్తుందన్న ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిని హాల్, బెడ్‌రూమ్, కిచెన్ తదితర సౌకర్యాలతో కలిపి 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. తొలి దశలో రాష్ట్రంలోని 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శనివారం సాయంత్రం వరకు మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి 480 ఇళ్లకు 3,893 దరఖాస్తులు వచ్చాయని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పీ. గౌతమ్ తెలిపారు.

**పరిశీలన అనంతరం లాటరీ**

అందిన దరఖాస్తులను అధికారులు పరిశీలించిన అనంతరం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం త్వరలోనే లాటరీ నిర్వహించనున్నట్లు గౌతమ్ వెల్లడించారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని సెంట్రల్ పోలీస్ లైన్స్‌లో 10 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించారు. ఈ స్థలంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు.



480 ఇళ్లకు 3,893 మంది దరఖాస్తు చేసుకోవడంతో ఒక్కో ఇంటికి సగటున 8 మందికిపైగా పోటీ నెలకొంది. అర్హతల పరిశీలన పూర్తయిన తర్వాత లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇంతమంది దరఖాస్తుదారుల్లో ఆ 480 మంది అదృష్టవంతులు ఎవరన్నది లాటరీ తర్వాతే తేలనుంది. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు సంబంధించి సందేహాలుంటే 040-24603572 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# దళితులకు ఆమడ దూరంలో ఆలయ చైర్మన్ గిరి

### ఈసారైనా దళితులకు వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ పదవి దక్కేనా..?

### హాట్ టాపిక్ గా మారిన వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ పదవి...



మేడిపల్లి ఆగస్టు 17(ప్రజాకలం న్యూస్)

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి లో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ పదవి ఈసారైనా దళితులకు దక్కేనా...?అని మేడిపల్లిలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వచ్చిన తర్వాత బిసి,ఓసి లే ఆలయ చైర్మన్ పదవికి ఎన్నికయ్యారు. ఈసారి చైర్మన్ పదవికి దళితుల మధ్యనే పోటీ ఉందని ఊహాగానాలు వెలువడుతున్నాయి.సందట్లో సడే మీయాల మూడో వ్యక్తిని అధ్యక్ష పీఠానికి ఎంపిక చేస్తారా లేదా దళితులలో ఎవరో ఒకరికి వరిస్తుందా.. మరో రెండు రోజులలో తేలుతుంది.ఏం జరుగుతుందో వేచి చూడాలి.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com




# ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించొద్దు

**- స్కిల్ యూనివర్సిటీకి పాలిటెక్నిక్ కళాశాలలను అనుసంధానించొద్దు.**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్.**

రాజన్న సిరిసిల్ల/అగ్రహారం ఆగస్టు 17 ( ప్రజా కలం ప్రతినిధి) : యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పేరుతో ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ డిమాండ్ చేశారు,జీవో నంబర్ 97ను వ్యతిరేకిస్తూ సోమవారం సిరిసిల్ల అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల గేటు ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు,ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అప్పగించవద్దన్నారు,ఐటీఐ, ఏటీసీలతో కలిసి డిప్లొమా కోర్సులను అనుసంధానం చేసేలా తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని కోరారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర..

స్కిల్ యూనివర్సిటీ పేరుతో కొత్త విధానం తీసుకువచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయడం సరికాదన్నారు, ఈ విధానం అమల్లోకి వస్తే అధ్యాపకుల నియామకాల నుంచి విద్యార్థుల అడ్మిషన్ల వరకు సాంకేతిక విద్య ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు,జీవో నంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు,పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి ఉద్యోగులను ఇతర శాఖల్లో విలీనం చేయొద్దన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేయవద్దని స్పష్టం చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెన్కల శ్రీహరిక, జిల్లా నాయకులు భూక్య సందీప్, పూర్ణచంద్, ప్రణయ్‌కుమార్, శివతేజతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# రాయపోలులో ప్రజావాణికి 8 దరఖాస్తులు

**ప్రజావాణి కార్యక్రమాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.**

**రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్.**

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 17.

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 8 దరఖాస్తులు స్వీకరించినట్లు రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకటి, ఆర్టీసీకి సంబంధించి ఒకటి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించి రెండు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నాలుగు మొత్తం 8 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణమోహన్, ఏవో నరేష్, విద్యుత్ ఏఈఈ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈఈ విద్యాసాగర్, మిషన్ భగీరథ ఏఈఈ అభినయ్, ఆర్ అండ్ బి ఏఈఈ రాజేశ్వరి, ఇరిగేషన్ ఏఈఈ జ్యోతిర్మయి, వైద్యాధికారి డా. మహారాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి గీతాంజలి, ఏపీఎం యాదగిరి, వెటర్నరీ డాక్టర్ సయ్యద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ షబానా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జహంగీర్, ఏపీవో జనార్ధన్, సిఆర్పి యాదగిరి, జిపిఓ కరుణాకర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు పొందిన ఫోటో గ్రాఫర్ల కు సన్మానం

కూకట్ పల్లి, ఆగస్టు17, ప్రజా కలం ప్రతినిధి:

తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్-2026 లో ప్రతిభ చూపిన కూకట్ పల్లి దక్కన్ క్రానికల్ ఫోటో జర్నలిస్ట్ దుర్గారావు, నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరావుకి రాష్ట్ర స్థాయి అవార్డులు వరించిన సందర్భంగా సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ కాలనీలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్ పల్లి అధ్యక్షుడు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్ పాతుల మీద విధి వ్యాపారుల బ్రతుకులనూ ఎత్తిచూపుతూ తీసిన ఫొటోలకు ఈ గుర్తింపు లభించిందని, ప్రజా సమస్యలను బ్రతుకు చిత్రాలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి సీనియర్ జర్నలిస్ట్ రామారావు, సూర్య దినపత్రిక ఫోటో జర్నలిస్ట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలి

**- టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్**



దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 17.

తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ రాయపోల్ మండల శాఖ ఆధ్వర్యంలో రాయపోల్ మండలం లోని పాఠశాలల్లో సమస్యల సేకరణ – సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ మాట్లాడుతూ పి ఆర్ సి గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటినప్పటికీ ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని, పీ ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఆరు డీఏ లను మరియు ఉపాధ్యాయుల వివిధ రకాల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

టీచర్ల ప్రమోషన్ లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు.నూతన ఆరోగ్య పథకం కోసం గత మూడు నెలలుగా ఉపాధ్యాయుల వేతనం నుండి ఒకటిన్నర శాతాన్ని జమ చేస్తున్నప్పటికీ నేటికీ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే ఆరోగ్య పథకం మార్గదర్శకాలను విడుదల చేసి, జాప్యం లేకుండా వైద్యాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటును చేసే జీవో 25 ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల మూసివేత ఆలోచనలను విరమించుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించి, వారి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, కనకయ్య, సీనియర్ నాయకులు రాములు గౌడ్, నర్సింలు గౌడ్, కర్ణాకర్, మండల నాయకులు వెంట్రురాం, వరప్రసాద్, హరీష్, నాగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

**- మూడు రోజుల పాటు వైభవంగా కార్యక్రమాలు**

**- అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రజలు తరలి రావాలి**

**- మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ పిలుపు**



మహేశ్వరం,ఆగస్టు 17, ప్రజా కలం:

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, నిర్వహించనున్నారు.

తొలిరోజు ప్రత్యేక పూజలు

ఈ నెల 17న ఉదయం 9 గంటలకు వేద ఆశీర్వచనం, గోపూజ, గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్యము, యాగశాల ప్రవేశం, దీక్షా ఋత్విక్ వరణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, సర్వతోభద్ర మండల ఆరాధన నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఊరేగింపు చేపట్టనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, జలాధివాసం, మంగళహారతి, స్వస్తి కార్యక్రమాలు జరుగనున్నాయి.

18న హోమాలు

18వ తేదీన ప్రాతఃకాల పూజల అనంతరం ఆవాహిత మండప దేవత హోమాలు నిర్వహిస్తారు.అనంతరం గణపతి, రుద్ర, నవగ్రహ, అమ్మవారి మూలమంత్ర హోమాలు కొనసాగనున్నాయి.

19న ప్రాణప్రతిష్ఠ

19వ తేదీన ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలతో పాటు యంత్ర ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.ఉదయం 8.29 గంటలకు అమ్మవారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుంది.అనంతరం బింబ కళాన్యాసం, గర్త పూజలు, కళాన్యాసం, దిష్టికుంభం, బలి ప్రధానం, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామంలోని వివిధ సంఘాల నుంచి పెద్ద ఎత్తున నిధులు సమకూరాయని సర్పంచ్ మునగపాటి నవీన్ తెలిపారు. వచ్చిన నిధులను ఒక్క రూపాయి కూడా తేడా లేకుండా కార్యక్రమానికి వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోరల రమేష్, శివగంగ దేవాలయ చైర్మన్ అల్లే కుమార్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్ కూన యాదయ్య, స్వర్ణగంటి ఆనందం, కాకి ఈశ్వర్, శివమూర్తి, పోతర్ల అంబయ్య యాదవ్, నిమ్మగూడెం సుధీర్ గౌడ్, వీరిబాబు, పరమేష్, శ్రీశైలం, గోవర్ధన్ రెడ్డి, గుర్రం యాదయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# గీతం విద్యార్థుల ఘన విజయం

**- సైబర్ అవగాహనలో గీతం విద్యార్థుల సత్తా..**



పటాన్‌చెరు, ఆగస్టు 17 (ప్రజా కలం) ప్రతినిధి

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రాష్ట్రస్థాయి లఘుచిత్రం, చిట్టిచిత్రాల పోటీలో హైదరాబాద్ గీతం విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో సురక్షా కా తిరంగా కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్‌లోని సమగ్ర కమాండ్ నియంత్రణ కేంద్రంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, తెలంగాణ పోలీసు డీజీపీ సి.వి. ఆనంద్, సైబర్ భద్రతా విభాగం డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా గీతం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మోసాల నుంచి స్వేచ్ఛ ఇతివృత్తంతో జరిగిన పోటీలో సురక్షిత అంతర్జాల వినియోగం, సైబర్ మోసాల నివారణపై గీతం విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనకు ప్రథమ స్థానం దక్కింది. విద్యార్థుల భాగస్వామ్యానికి సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాలరెడ్డి సహకరించగా, గీతం కంప్యూటర్ శాస్త్రం, వ్యవస్థల ఇంజినీరింగ్ విభాగంలోని కృత్రిమ మేధస్సు, దత్తాంశ శాస్త్ర విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ టి. శశివర్ధన్ సమన్వయం చేశారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల గీతం నాయకత్వం అభినందనలు తెలిపింది..

# అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు ఉద్యమిస్తాం

**- కుల వివక్ష, అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం**

**-ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్ రాగల్ల ఉపేందర్ మాదిగ**



మహేశ్వరం,ఆగస్టు 17, ప్రజా కలం:

పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదల కోసం కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్ రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలోని జేమ్లా నాయక్ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ సమావేశం ఎర్ర గణేష్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ.. దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు వెనుకబడ్డాయని అన్నారు. కుల వివక్ష, దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షీరామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, మాదిగలతో పాటు పేదరికంలో ఉన్న అన్ని వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ఉద్యమించాలని కోరారు. వివిధ సామాజిక శక్తులను కలుపుకొని ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఇతర అనుబంధ విభాగాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రావుగళ్ల బాబు మాదిగ, డా. జంగన్న మాదిగ, ఆదిరాల భరత్ మాదిగ, శేఖర్ మాదిగ, స్వామి మాదిగ, కుమార్ మాదిగ, కిన్నెర రాజు, ఏలేటి వెంకటేష్, గోల్లూరి మల్లేష్, నరేష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జేకే ఫెన్నార్ కార్మికుల జై సీఐటీయూ

**-జేకే ఫెన్నార్ కార్మికులు సీఐటీయూలోకి.!..**

పటాన్‌చెరు, ఆగస్టు 17 (ప్రజా కలం) ప్రతినిధి

జేకే ఫెన్నార్ పరిశ్రమకు చెందిన పలువురు కార్మికులు వివిధ కార్మిక




సంఘాలను వీడి సీఐటీయూలో చేరారు.శ్రామిక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య,పి. పాండురంగరెడ్డి కొత్తగా చేరిన కార్మికులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, వేతనాలు, సౌకర్యాల సాధనలో సీఐటీయూ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. ఐక్యత.. పోరాటం నినాదంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకత్వం సీఐటీయూదేనని, హక్కుల కోసం త్యాగాలకు సిద్ధంగా ఉండే సంఘంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. సీఐటీయూలో సాంబయ్య, ప్రవీణ్‌రెడ్డి, జయరాజు, సిద్ధార్థ, స్వయన, నాయక్, వీరేశం, హరిహరన్ చేరారు. కార్యక్రమంలో సదాశివరెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు..

# ముత్తంగి అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

**-ముత్తంగి సమస్యలపై కమిషనర్ సమీక్ష..**

పటాన్‌చెరు, ఆగస్టు 17(ప్రజా కలం) ప్రతినిధి

ముత్తంగి డివిజన్‌లో రహదారులు,వీధి దీపాలు, పారిశుధ్యం,తాగునీరు,పెండింగ్ అభివృద్ధి పనులపై స్థానిక నాయకులు మున్సిపల్ కమిషనర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు.పటాన్‌చెరు సర్కిల్ ముత్తంగి వార్డు కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో కమిషనర్ సృజన సమీక్ష నిర్వహించారు.మాజీ సర్పంచ్ ఉపేందర్ కొత్త రహదారులు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేసి,ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.మాజీ ఎంపీటీసీ గడిల కుమార్‌గౌడ్ నల్లా బిల్లుల ప్రతిపాదన రద్దు చేయాలని, పారిశ్రామిక కాలుష్య గ్రామాలకు ఉచిత తాగునీరు అందించాలని కోరారు.విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు స్పందించిన కమిషనర్ సృజన అన్ని డివిజన్‌లకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు ముత్తంగిలో సర్వే నిర్వహించి ప్రాధాన్యత పనులను తక్షణమే ప్రారంభిస్తామని చెప్పారు తాగునీటి సమస్యపై జలమండలి అధికారులతో సమావేశమై కాలుష్య ప్రభావిత గ్రామాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ జ్యోతి రెడ్డి, బాబురాజ్‌గౌడ్, బాబుల్ రెడ్డి, దేవి ప్రసాద్ పాల్గొన్నారు..



# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్

# పథకాలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు

- కోటి మంది మహిళలను కోటీశ్వరుని చేస్తామన్నారు చేశారా... - కేసీఆర్ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు
- కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా పథకాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం - మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, ఆగస్టు 17, ప్రజా కలం:** కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు అమలు చేసే వరకు పోరాటం ఆగదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పేదలు, రైతులు, ఆడబిడ్డలకు అండగా నిలిచిన గత ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనల భాగంగా నేడు మహేశ్వరం మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాది ముబారక్ రద్దు చేయకుండా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కొనసాగించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఆడపిల్లల పెళ్లి ఆర్థిక భారం పేద కుటుంబాలపై పడకుండా కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. తొలుత రూ.51 వేలుగా ఉన్న సాయాన్ని రూ.75 వేలకు, అనంతరం రూ.లక్షకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. లబ్ధిదారులకు నేరుగా సాయం అందేలా పథకాన్ని అమలు చేశామని తెలిపారు.

**తులం బంగారం హామీ ఏమైంది?**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన సమయంలో ఉన్న పథకాలను కూడా నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోందని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించి విద్యార్థులకు అండగా నిలిచిందని, ఇప్పుడు ఆ పథకం విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

**రైతు రుణమాఫీపై ప్రశ్నలు**

రైతు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ఇంకా చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆడబిడ్డల పెళ్లికి ఇచ్చిన తులం బంగారం హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు "వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన", "రేవంత్ వద్దు.. కేసీఆర్ ముద్దు", "కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి'' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్, పి ఏ సి ఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు అంబయ్య కర్రోళ్ల చంద్రయ్య, సర్పంచ్ నవీన్, బండారి లింగం, పోల్కం బాలయ్య,కడమోని ప్రభాకర్, కృష్ణ, వీర నాయక్,కటికల మహేందర్, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మహేశ్వరంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి

# ప్రజావాణిలో సమస్యల వెల్లువ!

## 7 అర్జీలు.. పరిష్కారానికి అధికారుల భరోసా..

పటాన్‌చెరు, ఆగస్టు 17 (ప్రజా కులం) ప్రతినిధి

ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే ప్రజావాణి లక్ష్యమని నోడల్ అధికారి, ఎంపీడీవో యాదగిరి తెలిపారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా




ఉంటూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను ఓపికగా స్వీకరించి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణి కేంద్రంలో శాఖల వారీగా సహాయ కేంద్రాలు, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజావాణికి తహసిల్దార్‌తో పాటు వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్యం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, విద్యుత్, మత్స్య, గృహనిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమ శాఖల అధికారులు, అటవీ అధికారులు, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, స్థానిక ఎస్సైలు హాజరుకావాలని ప్రభుత్వం ఆదేశించినట్లు వివరించారు. ప్రతి వినతిని నమోదు చేసి నమోదు సంఖ్య అందిస్తున్నామని, దాని ద్వారా ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. సోమవారం 7 అర్జీలు అందాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ షఫీ, పురపాలక కమిషనర్లు అజయ్ రెడ్డి, వెంకట కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

# మాలల మహా ధర్నా విజయవంతం చేయాలి.

## హలో మాల.. ఛలో దుబ్బాక...

## రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 17.

మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ 'హలో మాల ఛలో దుబ్బాక' మాలల మహా ధర్నా విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు పొలిట్ బ్యూరో ఛైర్మెన్ ర్యాకం శ్రీరాములు, మాల కో ఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు పి. శంకర్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో హలో మాల ఛలో దుబ్బాక మహా ధర్నా కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం మాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించకుండా ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం వల్ల మాలలకు



అన్యాయం జరుగుతోందని, దీనిని వెంటనే సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు."హలో మాల.. ఛలో దుబ్బాక" నినాదంతో నిర్వహించనున్న ఈ మాలల మహా ధర్నాకు దుబ్బాక నియోజకవర్గ మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దుబ్బాకలో తెలంగాణ తల్లి విగ్రహ చౌరస్తా వద్ద ఈ నెల 23 వ తేదీ ఆదివారం 10:00 గంటలకు మహా ధర్నా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్ట రాజు, నియోజకవర్గ ఇంచార్జ్ కాల్వ నరేష్, నాయకులు కాల్వ లింగం, సొక్కం స్వామి, లింగం, బాలకృష్ణ, భానుప్రసాద్, చాణక్య,అనసూయ, యశోద, ఆస బక్కులు, బావాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల చిన్నారిపై కామాంధుడి కన్ను

## -అమీన్‌పూర్‌లో చిన్నారిపై అఘాయిత్య యత్నం!..

పటాన్‌చెరు, ఆగస్టు 17 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని ఓ వ్యక్తి మాయమాటలతో తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో దారుణానికి యత్నించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది.




అదే సమయంలో అటుగా వెళ్తున్న యువకుడు చిన్నారి కేకలు విని అక్కడికి చేరుకుని ఆమెను రక్షించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నగర్ జిల్లా ఘటంపూర్ మండలం ధనానా బుజుర్గ్‌కు చెందిన రఘునాథ్ (48) ప్రస్తుతం దీపక్ బ్రిక్స్ బ్లాక్ కంపెనీ గదుల్లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 8.15 గంటల సమయంలో గండిగూడెం చౌరస్తా సమీపంలో ఇంటి ముందు ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారిని తీసుకుని ఇలాపూర్ తండా శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ చిన్నారిపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిన్నారి కేకలు విన్న శశికుమార్ (27) అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించాడు. వెంటనే చిన్నారిని రక్షించి నిందితుడిని ప్రశ్నించాడు. అనంతరం తన స్నేహితుడు నవీన్‌కు సమాచారం అందించడంతో ఇద్దరూ కలిసి చిన్నారిని సురక్షితంగా అక్కడి నుంచి తీసుకొచ్చారు.

బొల్లారం గ్రామంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో శశికుమార్ ఈ ఘటనను గమనించినట్లు సమాచారం. ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. చిన్నారిని రక్షించిన శశికుమార్, నవీన్‌ల చర్యపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు..

# శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో వైభవంగా నాగుల చవితి వేడుకలు

గజ్వేల్:17 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో గల శ్రీ నాగులమ్మ ఆలయంలో సోమవారం నాగుల చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ నలుమూలల నుంచి మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. నాగదేవతకు పాలు,పుట్టమన్ను,పూలు, పండ్లు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో,ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు. అయ్యప్ప ఆలయంలో కొలువైన నాగులమ్మ మానసదేవి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోందన్నారు. నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్,అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్,ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ,కార్యదర్శి గోపి, కోశాధికారి నారాయణరెడ్డి, ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి, ఉప్పల మెట్టయ్య గురుస్వామి, గందే యాదగిరి,కైలాస ప్రశాంత్, సిద్ధి రామచంద్రం,విక్రాంత్, అంజయ్య,చెప్యాల శేఖర్, మల్లారెడ్డి,గందే సంతోష్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు,మహిళలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# వీర గౌడ్ మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటు

## మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ నియోజకవర్గం:
17 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బొడుగే వీర గౌడ్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతితో గుంటుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

వీర గౌడ్ మృతి విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గుంటుపల్లి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణ రెడ్డితో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ వీర గౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి, గుంటుపల్లి గ్రామానికి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, వీర గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గుంటుపల్లి గ్రామ సర్పంచ్ స్వామి,సీనియర్ నాయకులు వేలూరు కృష్ణారెడ్డి, పడిగే రాజు,రమేష్ గౌడ్, నాగరాజు, స్వామి గౌడ్,బొమ్మ సత్యం తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆదేశం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:
17 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ప్రజావాణి ద్వారా ప్రజలు సమర్పించే దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతగా భావించి,త్వరితగతిన పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని, వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి మొత్తం 135 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని,సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో కూడా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ప్రొహిబిటరీ డిప్యూటీ కలెక్టర్ భవ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 26 మండల కేంద్రాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవోలను నోడల్ అధికారులుగా నియమించగా, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు,ఇతర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యల పరిష్కారానికి సంబంధించిన అర్జీలను స్వీకరించారు.



# మహేశ్వరం మండల ప్రజావాణిలో 8 దరఖాస్తులు

## ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి మహేశ్వరం ఎంపీడీవో ఎన్. శారదమ్మ

మహేశ్వరం, ఆగస్టు 17,(ప్రజా కలం)

ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని




మహేశ్వరం ఎంపీడీవో ఎన్. శారదమ్మ అన్నారు.మహేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు కొనసాగింది.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఎన్. శారదమ్మ సంబంధిత అధికారులు సకాలంలో హాజరై, ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, వినతులను స్వీకరించడం జరిగింది. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు హెల్ప్ డెస్క్ కౌంటర్ మరియు వైద్య సహాయక డెస్క్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న అన్ని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో కార్యక్రమంలో 8 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు.

# మహేశ్వరం మండల క్రిస్టియన్ కోఆర్డినేటర్గా బుసనగారి స్వామి నియామకం

మహేశ్వరం, ఆగస్టు 17,(ప్రజా కలం)

మహేశ్వరం క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు గత 15 ఏళ్లుగా నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న బి. స్వామిని మహేశ్వరం మండల క్రిస్టియన్ కోఆర్డినేటర్గా నియమించారు. తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ఈ మేరకు స్వామికి నియామక ఉత్తర్వులు అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ సమాజాన్ని సమన్వయం చేయడంతో పాటు, క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను బుసన్న స్వామికి అప్పగించారు. ప్రధాన చర్చిలు, స్వతంత్ర చర్చిలు, పాస్టర్లు, మతపెద్దలు, క్రిస్టియన్ సమాజంతో సమన్వయం చేసుకుంటూ సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా బుసనగారి స్వామి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా క్రిస్టియన్ సమాజం సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, వారి హక్కులు, అభివృద్ధి కోసం పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కి,తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్కు, మహేశ్వరం



నియోజకవర్గ కోఆర్డినేటర్ అరుణజ్యోతి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మహేశ్వరం మండలంలోని క్రిస్టియన్ సమాజం సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బుసన్న స్వామి పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మైనారిటీ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అవగాహన కల్పిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్లు డైరెక్టర్లు బొద్ద పాండురంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి కే రంజిత్ చైర్మన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ కే యాదయ్య, కోటగల్లా రాజ్ కుమార్, సమంత మహిళా అధ్యక్షురాలు నారాయణ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శివ ఐన్ టిసి, అదక్షులు,బి.బాట్ట రాజు ఎస్సి సెల్ వైస్ ప్రెసిడెంట్, జంగయ్య, ఎస్సి సెల్ కార్యదర్శి గట్టుపల్లీ యాదయ్య కప్పల రాజు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ చురుకైన కార్యకర్తను కోల్పోయింది

గజ్వేల్ నియోజకవర్గం:17 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ చురుకైన కార్యకర్తను కోల్పోయిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి,ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు.వర్గల్ మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన



బొడిగె వీర గౌడ్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు.వీర గౌడ్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి,వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి వీర గౌడ్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.మండలంలోనూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని,ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.వీర గౌడ్‌ను పరామర్శించిన వారిలో గుంటుపల్లి సర్పంచ్ బొమ్మ స్వామి,పడిగే రాజు,మాజీ సర్పంచ్ జానీ,నాయకులు కృష్ణ తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నేతల నిరసన

**- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను అవమానించిన బీజేపీ నేతల వైఖరి కి వ్యతిరేకంగా నిరసన**

**- కాంగ్రెస్ ఎస్సీ సెల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

**-పాల్గొన్న ఏఐసీ సి అబ్జర్వర్ దీపక్ రాథోర్, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, నేరెళ్ల శారద,రియాజ్, దుద్దిళ్ల శ్రీనివాస్**

సంగారెడ్డి ప్రతినిధి

ఆగస్టు 17( ప్రజా కలం):

ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను మరుసటి రోజు 'శుద్ధీకరణ' పేరుతో గంగాజలంతో శుభ్రం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కుల, మత విద్వేషాలతో దేశాన్ని విభజించే ప్రయత్నాలను తిప్పికొడతామని నాయకులు స్పష్టం చేశారు. సంగారెడ్డిలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల చర్యలకు నిరసనగా చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్ తో సహా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నేరెళ్ల శారద, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్ , దుద్దిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఐబీ నుండి మొదలుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు, అనంతరం క్యాంప్ ఆఫీస్ పక్కన ఉన్న పూలే,




జగజ్జీవన్ రామ్ విగ్రహాల పూల మాలలు వేసి నివాళులు అర్పించారు . దేశ ఐక్యత, సమగ్రత, సౌహార్దం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి అబ్జర్వర్ దీపక్ రాథోర్ మాట్లాడుతూ చంద్ర మండలంకు ప్రయాణిస్తున్న ఈ కాలం లో కూడా బీజేపీ నేతలు దళితుల పట్ల వివక్ష ను చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. మల్లిఖార్జున ఖర్గే దళితుడు కావడం వల్లే శుద్ధీకరణ చేశారని, కులం మతం పేరుతో బీజేపీ నాయకులు దేశాన్ని విభజిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు విద్యార్థులు, యువత, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు, పరిష్కారాల కోసం కృషి చేస్తున్నార న్నారు .సమాజంలో ఐక్యత, పరస్పర సౌహార్దం, సామరస్యం కొనసాగాలని ఆయన నిరంతరం కృషి చేస్తున్నారన్నారు .జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది

కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని ఏఐసీసీ పరిశీలకుడు దీపక్ రాథోర్ తెలిపారు. మరో 5--7 రోజుల పాటు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రలను అడ్డుకుంటాం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్.




సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 17( ప్రజా కలం):

తెలంగాణలో పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసి రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ...

హైకోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. "కేసీఆర్ ఒక మేనమామలా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచారు. దాదాపు 3 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు సుమారు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలో కూడా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అండగా నిలిచింది" అని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వల్ల పేద కుటుంబాల్లో పెళ్లి భారం తగ్గిందని, అనేకమంది ఆడబిడ్డలు తమ విద్యను కొనసాగించేందుకు కూడా అవకాశం ఏర్పడిందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలిచిందన్నారు. ఈ పథకానికి జాతీయస్థాయిలో కూడా ప్రశంసలు లభించాయని పేర్కొన్నారు. "ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకపోగా, ఇప్పటికే అమల్లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేసింది" అని చింత ప్రభాకర్ మండిపడ్డారు. "కళ్యాణ లక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తుదారులకు ఆర్థిక సహాయం ఎప్పుడు అందిస్తారు? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అనేకమంది లబ్ధిదారులు తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సాయం కోసం ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ... "కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ఉండకూడదు, ప్రజలకు మేలు జరగకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసేందుకు కుట్ర చేస్తోంది" అని ఆరోపించారు. ప్రభుత్వం కావాలనే కేసు విషయంలో సరైన విధంగా స్పందించకుండా ఇప్పుడు హైకోర్టు తీర్పును సాకుగా చూపిస్తోందని విమర్శించారు. "కళ్యాణ లక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణం. పలుమార్లు గడువు లభించినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు? పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన ఇంత కీలకమైన పథకం విషయంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేదు?" అని ప్రశ్నించారు.

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ...

"ముఖ్యమంత్రి, మంత్రులు లేదా ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో ప్రైవేట్ న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం, పేద ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి విషయంలో మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి.. పేదింటి ఆడబిడ్డల హక్కులను కాపాడాలి.. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలి అని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

## రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి



గజ్వేల్:17 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఉచిత హెల్త్ కార్డులు మంజూరు చేసి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర టీడబ్ల్యూజేహెచ్-143 ( టిఈఎంజెయు) అధ్యక్షులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గజ్వేల్ నియోజకవర్గ టీడబ్ల్యూజేహెచ్-143 అధ్యక్షుడు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఉచిత హెల్త్ కార్డులు అందించి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.జర్నలిస్టుల హక్కులు,సంక్షేమం కోసం అవసరమైతే ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గజ్వేల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై సభ్యత్వం పొందారని పేర్కొన్నారు.త్వరలో సిద్దిపేట జిల్లా మహాసభలు నిర్వహించి టీడబ్ల్యూజేహెచ్-143, టిఈఎంజెయు అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, టిఈఎంజెయు ప్రధాన కార్యదర్శి సాయిబాబా,సభ్యులు వెంకటేశం,జహంగీర్,రాజు, మంకీడి కర్నాకర్,ఇప్ప నర్సింలు, ఆబోద్దీన్,శ్రీనివాస్,సత్యం, మురళి,ఖాదర్ పాషా,మల్లేశం, స్వామి,కర్నాకర్,శంకర్,రంజిత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పథకం కింద కొత్త పెన్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 17( ప్రజా కలం ): సంగారెడ్డి జిల్లాలో చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, డయాలసిస్ మరియు ఫైలేరియా బాధితులు కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, కుటుంబ వివరాలు, అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లబ్ధిదారుల దరఖాస్తులను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు/మున్సిపల్ కార్యాలయాల ద్వారా చేయూత పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందనీ



,దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత అర్హత ప్రమాణాల ప్రకారం అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయబడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అవసరమైన పత్రాలతో తమకు సంబంధించిన మండల/మున్సిపల్ కార్యాలయాలలో సంప్రదించి కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## స్కిల్ యూనివర్సిటీ వద్దు..

# పాలిటెక్నిక్‌నే ముద్దు..

### శక్తిపాలసిని వెనక్కి తీసుకోవాలి

### - ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్..

గజ్వేల్:17 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు



ప్రవీణ్, పాలిటెక్నిక్ విద్యార్థులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్,ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం సరికాదన్నారు.విద్యార్థులు ఎంతో కష్టపడి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చదువుతున్నారని,ఐటీఐతో సమానంగా తమ కోర్సులను పరిగణించడం వల్ల డిప్లొమా విద్యకు ఉన్న విలువ తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయకుండా ప్రత్యేకంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం శక్తి పాలసీని వెంటనే వెనక్కి తీసుకుని,పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# మద్యం తాగి వాహనాలు నడపొద్దు

### - ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

వలిగొండ ఆగస్టు 17 ప్రజాకలం:

వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు



తీసుకుంటామని,ఎస్సై శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.ఆదివారం వలిగొండ పట్టణ శివారులోని భువనగిరి చిట్యాల ప్రధాన రహదారిపై మూసి బ్రిడ్జి వద్ద తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు.డ్రైవింగ్ లైసెన్స్,ఆర్సీ,ఇన్సూరెన్స్ లేని వాహనాలకు జరిమానాలతో పాటు చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి,టూవీలర్ వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.ప్రతి ఒక్క వాహనదారుడు మద్యం తాగి వాహనాలు నడిపి నట్లయితే పదివేల రూపాయల జరిమానతో పాటు జైలు శిక్ష అనుభవిస్తారని,మద్యం తాగి వాహనాలు నడపొద్దని,ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని వాహనదారులకు సూచించారు.

# స్వాతంత్ర్య దినోత్సవం రోజు

# మున్సిపల్ కార్మికులకు సెలవు లేదా..?

### బోడుప్పల్లో 391వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల

### అసైన్డ్ భూముల యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ధర్నా కరపత్రం విడుదల

### తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 31న ఇందిరా పార్క్ వద్ద ధర్నా

మేడిపల్లి ఆగస్టు 17(ప్రజాకలం న్యూస్)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 391వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ భూ రక్షణ సమితి



రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ఆగస్టు 31 సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజు మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధికారులు వారితో పని చేయిస్తున్నారని, అందరితో సమానంగా ఆగస్టు 15 జనవరి 26న స్వచ్ఛ సెలవు దినంగా ప్రకటించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ హయాంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు భూములు కేటాయించిందని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, రఘురూపుల మల్లేష్,రాజేష్ , పవన్, వి.రామకృష్ణ,చిల్ల అంజయ్య,జె శ్రీనివాస్,బొట్టు శ్రీనివాస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్లో సందడి చేసిన సినీనటి శ్రీలీల

### పి హెచ్ టి షాపింగ్ మాల్ ను ప్రారంభించిన శ్రీలీల



ఉప్పల్ ఆగస్టు 17(ప్రజాకలం న్యూస్)

ఉప్పల్ లో సినీనటి శ్రీలీల సందడి చేశారు. ఈ మేరకు ఉప్పల్ లో పద్మశాలి హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ అండ్ జ్యువెలరీ షాపింగ్ మాల్ ను సినీనటి శ్రీలీల చేతుల మీదుగా ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మేనేజింగ్ పార్ట్నర్స్ గడ్డం వెంకటేష్, చిరునదాస్ ధనుంజయ,వనం నరసింహ,గోశిక కృష్ణ,గుజ్జ సత్యం లు మాట్లాడుతూ అన్ని వర్గాల కోసం ఉప్పల్ లో అత్యాధునికంగా నిర్మాణం చేసిన పద్మశాలి హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ అండ్ జ్యువెలరీ షాపింగ్ మాల్ ఇంతపెద్ద వస్త్ర ప్రపంచం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటు ధరలలో మహిళలకు, చిన్నపిల్లలకు, పెద్దలకు ప్రతి ఒక్కరికి సరసమైన ధరలలో లభిస్తాయని వారు పేర్కొన్నారు. సినీస్టార్ శ్రీలీల ఉప్పల్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వస్తున్నారని సమాచారం తెలియడంతో జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. జనం పెద్ద ఎత్తున తరలిరావ డంతో వరంగల్ ప్రధాన రహదారి కిక్కిరిసి పోయింది. ఈ కార్యక్రమంలో పొట్టబత్తిని యాదగిరి,వనం యాదగిరి,వనం రాము,కొంగర్ ప్రకాష్,సిరికొండ బాలరాజు,వనం భానుమతి,వనం అంజయ్య,వీడెం సుదర్శన్,చిక్క విష్ణు,దొంత లక్ష్మణ్ గుర్రం రామకృష్ణ, రామసాయం రజిత,పుట్టబత్తిని పురుషోత్తం,వైట్ల ఉదయ్ శ్రీనివాస్, వనం అనిత, చక్రాల నరసింహ, కటకం వెంకటేష్, గర్దాస్ భాస్కర్, భోగ రాజేంద్రప్రసాద్, గడ్డం షణ్ముఖ్, వనం పాండు, గంజి మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై మండలాల స్థాయిలో “ప్రజావాణి”

- ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో అర్జీల స్వీకరణ
- ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- సమస్యల పరిష్కారంపై ప్రజల ఆశలు



వలిగొండ ఆగస్టు 17 ప్రజాకలం:

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ‘ప్రజావాణి’కార్యక్రమాన్ని ఇక నుంచి మండల స్థాయిలోనూ నిర్వహించనున్నారు.’ప్రజావాణి’కార్యక్రమాన్ని నిర్వహించాలని,రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.దీనికి మండల అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.ప్రజావాణికి తహసీల్దార్ (ఎమ్మార్వో), ఎంపీవో,మండల స్థాయిలోని వ్యవసాయ,ఉద్యానవన, విద్యా,వైద్య,శిశు సంక్షేమ, రోడ్లు,భవనాలు ఇతర సంబంధిత అధికారులు హాజరుకావాల్సి ఉంటుంది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు.మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదులు,విజ్ఞప్తుల పరిష్కార యంత్రాంగాన్ని సంస్థాగతంగా వికేంద్రీకరించడం,ఏకీకరణ చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ చర్యను చేపట్టింది.ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో,ఆ తర్వాత జిల్లా, రెవెన్యూ డివిజనల్ స్థాయిలలో దీనిని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.ఇప్పుడు మరింత వికేంద్రీకరణలో భాగంగా మండల స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు.ఇప్పటికే ప్రజావాణి పోర్టల్ ను రూపొందించి,దాని ద్వారా రిజిస్ట్రేషన్,ప్రాసెసింగ్, మానిటరింగ్,రాష్ట్ర,జిల్లా, ఆర్డీవో,స్థాయిల్లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల సమీక్ష వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నారు.

“పోర్టల్లో రిజిస్ట్రేషన్”

ఇకపై మండల స్థాయిలో అందే ప్రతి ఫిర్యాదు,వినతులను ప్రజావాణి పోర్టల్లో రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది.

పిటిషనర్ సమర్పించిన అన్ని డాక్యుమెంట్లను అప్లోడ్ చేసి,రశీదు కూడా ఇవ్వాల్సి ఉంటుంది.దీని కోసమే పనిచేసేలా ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్,స్కానర్, ఇంటర్నెట్,కనెక్టివిటీతో ఓ ‘డెడికేటెడ్ గ్రీవెన్స్ రిజిస్ట్రేషన్’కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని,సీఎస్ సూచించారు.ప్రజావాణి వేదిక వద్ద సీటింగ్,తాగునీరు, హెల్త్ డెస్క్,వాష్ రూమ్,వీల్ చెయిర్లు వంటి సదుపాయాలను నోడల్ అధికారులు కల్పించాల్సి ఉంటుంది.దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, గర్భవతులు,మహిళలు, చిన్నపిల్లల నుంచి ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను స్వీకరించాలని సీఎస్ సూచించారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

### -ఎంపీడీవో జలంధర్ రెడ్డి



వలిగొండ ఆగస్టు 17 ప్రజాకలం:ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటికి పరిష్కారం చూపించే లక్ష్యంతో మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమైంది.తొలిరోజు ఎంపీడీవో జలంధర్ రెడ్డి, తహసీల్దార్ దశరథ, ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు.వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరించారు. మొత్తం 21 శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు,మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు,భూ సంబంధిత సమస్యలు ,పారిశుధ్యం,తాగునీరు, రహదారులు, విద్యుత్,గ్రామీణాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజలు తమ సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు నేరుగా వివరించే అవకాశం కల్పించడంతో ప్రజావాణికి మంచి స్పందన లభించింది.వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిశీలించి,నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని,ఎంపీడీవో జలంధర్ రెడ్డి,ప్రజలకు హామీ ఇచ్చారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. మొత్తం 16 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌ఓడీ ఉద్యోగులకు 12.5% కోటా ఇవ్వాలి

### - టి.ఎన్.జి.ఓ.ల కేంద్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజా కలం ప్రతినిధి

సచివాలయంలోని హెచ్ఓడీ శాఖల్లో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు 12.5 శాతం కోటా అమలు చేయాలని తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టి.ఎన్.జి.ఓ.) కేంద్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు.

రాష్ట్ర అధ్యక్షుడు ఎం. జగదీశ్వర్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సైనీ (ముజీబ్) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు.

ఏఎస్ఓ నియామకాలు చేపట్టాలి

2025--26 ప్యానల్ సంవత్సరానికి సంబంధించి ఏఎస్ఓ క్యాడర్‌లో 12.5 శాతం కోటా కింద అర్హులైన హెచ్ఓడీ ఉద్యోగులకు అవకాశాలు కల్పించాలని సంఘం డిమాండ్ చేసింది. ఏఎస్ఓ నియామకాలను తక్షణమే చేపట్టడంతో పాటు ఎస్ఓ క్యాడర్‌కు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు, డీఏ బకాయిలు, పీఆర్‌సీకి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేంద్ర కార్యవర్గం కోరింది.

సాధించే వరకు పోరాటం



హెచ్ఓడీ ఉద్యోగులకు 12.5 శాతం కోటా అమలు చేయాలని టి.ఎన్.జి.ఓ. యూనియన్ ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు, వినతిపత్రాలు సమర్పించిందని నాయకులు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సాధించే వరకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

కేంద్ర కార్యవర్గ సమావేశంలో 12.5 శాతం కోటా అమలుపై తీర్మానం చేయడం హెచ్ఓడీ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనలో మరో ముఖ్యమైన ముందడుగు అని హైదరాబాద్ సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు కటుకూరి శ్రీకాంత్ పేర్కొన్నారు.

## 50 సంవత్సరాలు దాటిన గొర్ల కాపరులకు పెన్షన్ ఇవ్వాలి-

### - గొర్రెల,మేకల పెంపకార్ల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహా

బొమ్మలరామారం,ఆగస్టు 17 (ప్రజా కలం)

50సంవత్సరాలు దాటిన గొర్ల కాపరులకు ప్రభుత్వం వృద్ధాప్య,పెన్షన్ ఇవ్వాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం రోజున



బొమ్మలరామారంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ రాష్ట్ర మహాసభ ఆగస్టు 22, 23, 24 తేదీలలో చెంగిచెర్లలో జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు.గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తయిందని ఈ సందర్భంగా నిర్వహించే 4వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు నెలలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగచెర్ల లో నిర్వహిస్తున్నామని అన్నారు.1995 సంవత్సరంలో సంఘం ఏర్పడిందని, వాటి నుంచి నేటి వరకు అనేక పోరాటాలు చేసి, ముఖ్యంగా తుమ్మ చెట్లపై గొర్ల కాపరులకు హక్కు కల్పించే 1016 జీవో మేతకు ప్రభుత్వ భూములు కేటాయించాలని 559 జీవో సాధించినట్లు తెలిపారు.గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేసేందుకు కృషి చేసిందన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో గొల్ల,కురుమ యువతకు గొర్ల ఫామ్ షెడ్,గొర్రెల కొనుగోలు కోసం నేషనల్ లైవ్ స్టాక్ లో ప్రత్యేకంగా రాయితీ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుడుమ శ్రీశైలం, పిఏసిఎస్ చైర్మన్ గుదే బాల నరసింహ,జిఎంపిఎస్ ఉపాధ్యక్షులు మోటి రమేష్,జిల్లా మల్లేష్, బొమ్మలరామారం సొసైటీ అధ్యక్షులు రాసాల ప్రవీణ్,దండ బోయిన కొండలు,మోటే కుమార్,అంజయ్య, యాదగిరి,చీర్ల కనకయ్య, బండ సంతోష్,బుడుమ మల్లేష్,చీర్ల బాల్ రాజ్,గొర్ల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మలరామారం మండలంలో ప్రజావాణి కార్యక్రమం

### మండల ప్రజలనుండి 10 ఫిర్యాదులు

బొమ్మలరామారం ఆగస్టు 17 (ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండలంలోని నిర్వహించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలనుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్యామల,ఇన్చార్జ్ తాహసిల్దార్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రజల నుండి 10 అర్జీలు రాగా ఇందులో పంచాయతీరాజ్ మరియు గ్రామ




అభివృద్ధి శాఖ 05, రెవెన్యూ శాఖ 04,గ్రామీణ నీటి సరఫరా శాఖ 01 కు సంబంధించిన అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.దుర్గేశ్వరి,సహాయ ఇంజనీర్,గ్రామీణ నీటి సరఫరా అధికారి ఎస్.అశోక్,గృహ నిర్మాణ శాఖ సహాయం ఇంజనీర్ పి.రోహిత్,తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సహాయం ఇంజనీర్ ఎస్.సాయిదీప్,నీటిపారుదల శాఖ సహాయ ఇంజనీర్ అధికారి సాయి రామ్,మండల విద్యాశాఖ అధికారి డి.రోజా రాణి,వైద్యాధికారి సుమలత, మండల పంచాయతీ అధికారి టి.శశికళ,పశువైద్య సహాయ శస్త్రచికిత్స అధికారి ఎన్.సునీత,అంగన్వాడీ పర్యవేక్షకురాలు కె.లలిత, అటవీ బీట్ అధికారి మోహన్ బాబు,అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి,వీబీజీ ఆర్ఏఎంజీ ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## మాల కోఆర్డనేషన్ ఫోరం సమావేశాన్ని విజయవంతం చేయండి: జిల్లా నాయకులు

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 17

మాల కోఆర్డనేషన్ ఫోరం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆర్మూర్‌లో ఫోరం నాయకులు విడుదల చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సిద్ధుల గుట్ట వెనుక భాగంలో ఉన్న మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం (ఆగస్టు 23) ఈ సమావేశం జరగనుంది.ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ.. మాలల ఐక్యత, హక్కుల సాధనే ధ్యేయంగా నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా డాక్టర్ గోపినాథ్, శకుంతల మేడం, డాక్టర్ తిరుపతయ్య, పి. శంకర్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా నలుమూలల నుంచి విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు మరియు ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు డి.ఎల్. మాలజి (లింగన్న), అడ్వకేట్ గోలి నరేష్, తలారి చందు, జె. సుధీప్ కుమార్, గంట గోపి, మట్ట పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్-2026లో బీఎల్ఏలు, సీనియర్ నాయకులకు ఘన సన్మానం



కుత్బుల్లాపూర్, ఆగస్టు 18 (ప్రజా కలం): ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలను హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దమ్మని శ్రవణ్‌కుమార్, బేకు శ్రీనివాస్, డీసీసీ కమిటీ సభ్యులు జాకీర్, లక్ష్మీచౌదరి, గౌరిగే బాలప్ప, మహిళా నాయకులు సుజాతయాదవ్, సుజాత, పల్లవి, అశ్విని, రేవతి తదితరులు హాజర య్యారు.

**బూత్ స్థాయిలో సేవలకు ప్రశంస**

పేట్‌బషీరాబాద్, పద్మనగర్, గణేష్‌నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్‌గౌడ్, ఇరుగు రాధాకృష్ణ, గడ్డం రాజేందర్‌రెడ్డి, పిట్ల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో చురుగ్గా, అంకితభావంతో పనిచేసిన బీఎల్ఏలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులను శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు.

ఓటర్ల వివరాల పరిశీలన, అర్హులైన ఓటర్లకు సంబంధించిన ప్రక్రియలో బూత్ స్థాయిలో బీఎల్ఏలు, నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించారని నాయకులు పేర్కొన్నారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి అభినంద నీయమన్నారు.

**కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి**

రానున్న రోజుల్లోనూ ఇదే నిబద్ధత, సమన్వయం, అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అర్హత ఉన్న కొత్త ఓటర్లను గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యల అర్ధ రహితం

### తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు-

### ప్రజల్లో ఉన్న నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు.. తుంగతుర్తి రవి



మేడిపల్లి ఆగస్టు 17(ప్రజాకలం న్యూస్)

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ పై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు పీర్జాదిగూడ లోని బండి కన్వెన్షన్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జలేందర్ రెడ్డి, పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు,దర్గా దయాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ ఒకసారి ఉప సర్పంచ్‌గా, ఒకసారి సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేసిన వ్యక్తి, మేడ్చల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఓడిపోయినా, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు వజ్రేష్ యాదవ్ అని తెలిపారు.ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచిన వారు తమ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులేనని, ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుల గురించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా బయట నుంచి వచ్చి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ఆరోపణలు నిజమైతే ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడే నాయకుడి గురించి తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం కాదు.. ముందుగా వాస్తవాలు తెలుసుకోవాలి. ఆధారాలు ఉంటే చూపించాలి, లేకపోతే నిరాధార ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి అని తుంగతుర్తి రవి హితవు పలికారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్ కుమార్ రెడ్డి,ముదిగొండ రమేష్,బలరాం, యాసారం నాగేష్, మోహన్ కుమార్, సుదర్శన్ రెడ్డి, మహ్మద్ మజర్, బర్ల నాగరాజు, మణిరం నాయక్, జయందర్,రాజ రాజు,మహేష్ గౌడ్, సోమయ్య,శ్రీను నాయక్, సాయిరాం గౌడ్, బొల్లిగిరి నాగరాజు, శరత్ గౌడ్, కపిల్, దుర్గ, తండా పరమేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 31 అర్జీల స్వీకరణ: సీపీ సాయి చైతన్య



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 17:

నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య (ఐపీఎస్) స్వయంగా బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను సీపీకి విన్నవించుకోగా, మొత్తం 31 ఫిర్యాదులు నమోదయ్యాయి. బాధితుల సమస్యలను ఓపికగా విన్న సీపీ.. వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వేదిక నుంచే ఆయా పోలీస్ స్టేషన్ల సి.ఐలు, ఎస్.ఐలతో ఫోన్లలో మాట్లాడారు. కేసుల తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుంటూ, సమస్యల తక్షణ పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. దళారులు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేకూర్చేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు.



## ఘనంగా "కింగ్స్ గార్డెన్స్" ప్రారంభోత్సవం

### ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్యఅతిథులుగా హాజరైన టీటీడీ చైర్మన్ బిఆర్.నాయుడు, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

131 - కుత్బుల్లాపూర్ డివిజన్ మున్సిపల్ గ్రౌండ్స్ వద్ద ఎండి.జహీర్ ఉ సన్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన కింగ్స్ గార్డెన్స్ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, కుత్బుల్లాపూర్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ లు హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... శుభాకార్యాలు, సమావేశాలు వంటి వాటికి సమీప ప్రాంత వాసులకు కింగ్స్ గార్డెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, రషీదా మహమ్మద్ రఫీ, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్,డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, మధుకర్, కోల శ్రీకాంత్, ఖలీల్, జయం చారి, డీజే రమేష్, ఇస్మాయిల్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ డే కరాటే ఛాంపియన్

### షిప్‌లో హన్మకొండ విద్యార్థుల హవా....

హన్మకొండ ఆగస్టు 17(ప్రజాకలం న్యూస్) న్యూఢిల్లీలోని తల్కతోర ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 7,8,9 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ కరాటే ఛాంపియన్ షిప్--2026లో హన్మకొండకు చెందిన కరాటే విద్యార్థులు



ప్రతిభ కనబరిచి పలు విజయాలు సాధించారు. గోపాల్పూర్‌లోని చిల్లీ థ్రిల్ అకాడమీ విద్యార్థులు, సీకోకై షోతో ర్యా కరాటే ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ అకాడమీలో ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ల్ఈసి సీనియర్ మేనేజర్ హనుమంతు, స్పోర్ట్స్ కరాటే డూ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని సదానందం హాజరై విజేతలైన కరాటే క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో హన్మకొండ విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే అభిమానులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందిస్తూ వారి విజయానికి కృషి చేసిన కరాటే కోచ్ పాలకుర్తి పాపయ్యను ఘనంగా సన్మానించారు.

## కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి బాల్కొండలో 5 వేల మంది

### ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాలి: వేముల

నిజామాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం న్యూస్): కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మహిళలతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ హయాంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.13 వేల కోట్ల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు కళ్యాణలక్ష్మి సాయం రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో సుమారు 5 వేల మంది అర్హులైన ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాల్సి ఉందన్నారు. కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం స్పష్టమైన అఫిడవిట్ దాఖలు చేయాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్, ఆసరా పింఛన్ రూ.4 వేలు, రైతు భరోసా, రుణమాఫీ తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు వంటి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. పేదల సంక్షేమంపై ప్రభుత్వం వెనక్కి తగ్గితే ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



## నిజామాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా బోగ ఆనంద్ నియామకం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 17:

నిజామాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మోర్తాడ్ సర్పంచ్



బోగ ఆనంద్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ (జీూజ 2026) రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్.. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బోగ ఆనంద్ గారికి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచుల హక్కుల సాధనకు, గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాల సర్పంచులు, జేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐస్‌మేక్ రిఫ్రిజరేషన్ ఆదాయం 60 శాతం వృద్ధి

## మార్జిన్ మెరుగుదల, సామర్థ్య విస్తరణపై దృష్టి

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాకలం) : ఐస్‌మేక్ రిఫ్రిజరేషన్ లిమిటెడ్ 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నిర్వహణ ఆదాయం 60.4 శాతం పెరిగి రూ.178.88 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.111.50 కోట్లుగా ఉంది.

కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.668.20 కోట్ల రికార్డు వార్షిక ఆదాయాన్ని నమోదు చేసింది.

వాణిజ్య శీతలీకరణ, శీతల సరఫరా గొలుసు, ఇతర రంగాల్లో డిమాండ్ బలంగా కొనసాగుతోందని కంపెనీ తెలిపింది. అయితే త్రైమాసికంలో లాభదాయకతపై ఒత్తిడి కొనసాగింది. పన్నుకు ముందు నష్టం రూ.2.23 కోట్లు, పన్ను అనంతర నష్టం రూ.1.65 కోట్లుగా నమోదైంది.

లాభదాయకతపై ప్రత్యేక దృష్టి

బలమైన ఆదాయ వృద్ధి ఉన్నప్పటికీ రానున్న త్రైమాసికాల్లో లాభదాయకతను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమని కంపెనీ తెలిపింది. సామర్థ్య వినియోగం పెంపు, నిర్వహణ సామర్థ్యం, మెరుగైన ఉత్పత్తుల కలయిక, వ్యయ నియంత్రణపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంది.

ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పి. పటేల్ మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 60 శాతానికి పైగా ఆదాయ వృద్ధి నమోదైందని తెలిపారు. తయారీ సామర్థ్యాలు, ఉత్పత్తులు, డిజిటలైజేషన్, నైపుణ్యం కలిగిన సిబ్బందిపై చేసిన పెట్టుబడులు భవిష్యత్తులో మెరుగైన నిర్వహణ సామర్థ్యంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

జపాన్ సంస్థతో రూ.180 కోట్ల పెట్టుబడి

జపాన్‌కు చెందిన గలిలీ హోల్డింగ్స్‌తో ప్రతిపాదిత వ్యూహాత్మక భాగస్వామ్యం కంపెనీ వృద్ధి ప్రణాళికల్లో కీలకంగా మారనుంది. ఈ ఒప్పందంలో భాగంగా గలిలీ హోల్డింగ్స్ ఐస్‌మేక్‌లో రూ.180 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఇతర పెట్టుబడిదారుల నుంచి మరో రూ.10 కోట్లు సమీకరించనున్నారు.

ఇరువురు భాగస్వాములు 60:40 నిష్పత్తిలో సంయుక్త సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వాణిజ్య శీతలీకరణ పరికరాల తయారీ, మార్కెటింగ్, పంపిణీపై ఈ సంస్థ ప్రధానంగా దృష్టి పెట్టనుంది.

కొత్త ఉత్పత్తులకు ఆదరణ

చెస్ట్ ఫ్రీజర్లు, నిరంతర ప్యానెళ్ల వంటి కొత్త వ్యాపార విభాగాలకు తొలి త్రైమాసికంలో మంచి మార్కెట్ ఆదరణ




లభించిందని కంపెనీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అయితే భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ముడి పదార్థాల ధరలు అధికంగా ఉండటం లాభదాయకతపై ప్రభావం చూపిందన్నారు.

ముందు రోజుల్లో వాణిజ్య శీతలీకరణ, శీతల సరఫరా గొలుసు, ఆహార ప్రాసెసింగ్, ఆతిథ్య, ఔషధ, రిటైల్, పారిశ్రామిక రంగాల్లో విస్తరణకు కంపెనీ ప్రాధాన్యం ఇవ్వనుంది. గలిలీ భాగస్వామ్యం, కొత్త పెట్టుబడులతో తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోనున్నట్లు సంస్థ వెల్లడించింది.

## ముంబై సామాజిక సేవకుడు జిల్లా బుచ్చయ్య కు సెల్యూట్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 17:

ముంబైలోని దాదర్ ప్రభాదేవిలో పద్మశాలి, మాదిగ, మాల సామాజిక వర్గ ప్రజలు బలంగా ఉండే ప్రాంతం. ఇక్కడ తమ ప్రియతమా సామాజిక నాయకులు దివంగత జిల్లా బుచ్చయ్య నర్సయ్య బుధవారం అనారోగ్యంతో



తుదిశ్వాస విడిచిన విషయం విధితవే. ఆదివారం వారి ఫ్యామిలీ జ్ఞాపకార్థం "దినాలు" పాటించారు. అయితే వారి సామాజిక సేవలు అంతఇంత కావు. ఈ ఏరియాలో "దసరా సమ్మేళనాలు" తెలుగు ఏక్తా సభలు" లాంటివి ఏర్పాటు చేసి అన్ని వర్గాలను ఏకం చేసిన ఘనత ఆయనకు ఉంది. బుచ్చయ్య గారు రాజకీయంగా చివరిగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే, సామాజికంగా "మహారాష్ట్ర ప్రదేశ్ తెలుగు కమిటి" పేరున శ్రామిక ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండే క్రియాశీల నాయకులు. వీరు మెదక్ జిల్లా, మండలం గద్వాల్, మర్కుక్ గ్రామ వాస్తవ్యులు. ఆయనకు పెద్ద కుమారుడు ధనంజయ్ జిల్లా, మరో ఇద్దరు కుమారులతో ఆదర్శ ఫ్యామిలీ ఉంది. ముంబై మహానగరంలో పశ్చిమ దాదర్లోని సుందర్ నగర్లో నివాసమై ఉండిరి. వీరు పద్మశాలి జాతి ముద్దు బిడ్డ. ఆయన అస్తం ఆయన కుటుంబానికి, అభిమానులకు, హితచింతకులకు, సకల బహుజన సమాజానికి తీరని లోటు, ఆయన సేవలకు సెల్యూట్. ఆయన ఫ్యామిలీకి స్థానిక బిఎస్పి, ఎంటిబిఎఫ్ టీంలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# జనసంద్రమైన నాగోబా

**- భారీగా తరలివచ్చిన భక్తులు.. - జొన్న పేలాలు.. ఇప్పపువ్వు..**

**- జొన్న గడక సాంబారు నాగోబాకు నైవేద్యం..**



ఉట్నూర్, ఆగస్టు 17 : అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ లోని ఆదివాసుల ఆరాధ్య దేవుడు నాగోబా జనసంద్రమైంది. శ్రావణమాసంలో మొదటి పండగగా జరుపుకునే నాగుల పంచమి పండగ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భక్తులతో పాటు మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుండి భక్తులు హాజరై నాగోబాను దర్శించుకున్నారు. నాగోబాను భక్తులు దర్శకరించుకున్నందుకు దాదాపుగా మూడు గంటల పైన వరుసలో ఉండవలసిన వచ్చింది. నాగోబా పూజలకు హాజరైన భక్తులు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివాసీ గిరిజనులు నాగోబాకు నైవేద్యంగా జొన్న పేలాలతోపాటు ఇప్పపువ్వును, జొన్న గడక, సాంబార్ ను నైవేద్యంగా టేకు ఆకులతో పాటు మోదుగు ఆకులలో సమర్పించారు. నాగోబా దర్శనానికి వచ్చిన భక్తులకు మెస్రం వంశస్థులు నాగోబకు సమర్పించిన జొన్న గడక, సాంబార్ ను భక్తులకు వడ్డించారు. నాగోబా పూజలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలవకుండా ఉట్నూర్ ఏఎస్పీ రితిక్ సాయి కుట్టే, సీఐ మడవి ప్రసాద్, ఎస్సై సాయన్నలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కమ్మర్‌పల్లిలో ప్రజావాణి: సమస్యల పరిష్కారానికి పోటెత్తిన అర్జీలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 17:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో




విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

గ్రామాల్లోని సామూహిక సమస్యలతో పాటు, పలువురు తమ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులను అందజేశారు. దరఖాస్తులను స్వీకరించిన అధికారులు వాటిని తనిఖీ చేసి, త్వరితగతిన నిబంధనల మేరకు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా, ఒకే వేదికపై అధికారులకు నేరుగా విన్నవించుకునేందుకు ప్రజావాణి ఎంతగానో దోహదపడుతోందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సదాశివ్, తాసిల్దార్ ఎం. నరేష్, ఎంఈఓ నేర ఆంధ్రయ్య మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు : మంత్రి వాకిటి

హైదరాబాద్: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పై వస్తున్న వార్తలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన పథకాన్ని సదుద్దేశంతో కొనసాగించామని మంత్రి వాకిటి శ్రీహరి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం కల్యాణ లక్ష్మి చెక్కులను వివాహమైన రెండేళ్లకు ఇచ్చేదని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్ర 3 నెలల్లోపు కల్యాణ లక్ష్మి చెక్కులు ఇచ్చిందని సూచించారు. రైభరోసాను రూ. 12 వేలకు పెంచి కొనసాగించామని తెలిపారు. కోర్టు స్టే వల్ల చిన్న అవాంతరం వస్తే.. ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. కోర్టు వివరణ అడిగినంత మాత్రాన.. పథకాలు నిలిచిపోవని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పేర్కొన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ "మొసలి కన్నీరు" కారుస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం 'గ్రీన్ ఛానల్' ద్వారా పథకాలకు నిధులను విడుదల చేస్తోందని, పేద కుటుంబాలకు వాటి వల్ల ప్రయోజనం కొనసాగేలా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని పొన్నం హామీ ఇచ్చారు. ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ. 16,375.87 కోట్లు ఖర్చు చేయగా, 16,78,347 మంది లబ్ధి పొందారు. ఇవి సంక్షేమ పథకాలే తప్ప, ఏ చట్టాన్నైనా అమలు చేసే ఉద్దేశంతో చేపట్టినవి కావని మంత్రి పేర్కొన్నారు.

# అయోమయంలో.. మహేష్ గౌడ్...!

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై అయోమయంగా పీసీసీ చీఫ్ కామెంట్

## ఓసీ నేత కావడంతో మహేష్ గౌడ్ సన్నాయి నొక్కులు



హైదరాబాద్, ఆగస్టు 17 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధినేత పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారా.. అంటే అవునే రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పార్టీ లైన్ ను దాటి ప్రవర్తిస్తున్న నేతల వ్యాఖ్యలపై, ఆగ్రహంపై ఎటూ తేల్చని విధంగా ఆయన చేస్తున్న ప్రకటనలు ఆయన అయోమయంలో ఉన్నారని తేటతెల్లం చేయడంతో పాటు.. ప్రజలను, పార్టీ కార్యకర్తలను కూడా అదే అయోమయానికి గురిచేస్తున్నారని వారంటున్నారు.

కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీపై, పార్టీ నేతలపై, ప్రభుత్వం తీరుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. మహేష్ కుమార్ గౌడ్ పూర్తిగా అయోమయంలో ఉన్నారని వారంటున్నారు.

'ఎవర్రా మీరంతా.. కాంగ్రెస్ పార్టీతోనూ.. తెలంగాణతోనూ.. తెలంగాణ ఉద్యమంతోనూ సంబంధం లేని వారందరూ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారనే అర్థంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. అంతే స్థాయిలో పార్టీలోనూ కలకలం సృష్టించాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ అధ్యక్షుడు అయిన మహేష్ కుమార్ గౌడ్ దీనిపై స్పందించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ కూడా వ్యాఖ్యలు చేయవద్దని అన్నారు. పార్టీ లైన్ ను దాటవద్దని సూచించారు. రాజగోపాల్ రెడ్డికి గతంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చి ఉండవచ్చని చెప్పుకొచ్చారు. ఇక్కడ జరుగుతున్న సంగతులన్నీ హైకమాండ్ కు విన్నవిస్తానంటూ చెప్పుకొచ్చారు.

చర్యలేవీ...

అయితే పార్టీ లైన్ దాటి.. నేరుగా.. సూటిగా ప్రశ్నిస్తున్న రాజగోపాల్ రెడ్డి లాంటి నేతలపై పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అందరూ వేలెత్తి చూపుతున్నారు. అదే బీసీ, దళిత వర్గాలకు చెందిన నేతలైతే.. ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చి.. చర్యలు తీసుకునేవారని వారంటున్నారు. కేవలం అగ్రవర్ణం కావడంతోనే రాజగోపాల్ రెడ్డికి కనీసం షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చేందుకు పీసీసీ వెనుకాడుతున్నట్టు వారంటున్నారు.

రాజగోపాల్ రెడ్డి చేస్తున్న హాట్ హాట్ కామెంట్లకు పీసీసీ అధ్యక్షుడు కక్కామింగలేని పరిస్థితిలో ఉన్నట్టు చెబుతున్నారు. పైగా మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఆయనలోని అయోమయాన్ని తెలుపుతున్నాయని.. ఒకపక్క పార్టీ లైన్ దాటవద్దని చెబుతూనే.. పార్టీ గతంలో హామీ ఇచ్చి ఉండవచ్చని అంటున్నారంటే.. రెండు పడవలపై పీసీసీ ప్రయాణం చేస్తున్నట్టుగా పార్టీ కార్యకర్తల్లోనూ అయోమయం నెలకొంది. ఏదేమైనా.. కర్ర విరక్కుండా.. పాము చావకుండా అన్నట్టుగా సన్నాయి నొక్కులు నొక్కడంతో.. అందరిలోనూ అదే అయోమయం కనపడుతోంది..!



## 22ఏ భూములపై మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు

**- నిషేధిత భూములపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష**

**- 22ఏ అమలుపై అధికారులకు మంత్రి పొంగులేటి హెచ్చరికలు**

**- ప్రజలను ఇబ్బంది పెడితే సహించం**

**- ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు**

**- న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములు కాపాడాలని సూచన**

హైదరాబాద్: నిషేధిత భూముల అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారంనాడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, అడిషనల్ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లు హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులపై మంత్రి పొంగులేటి ఆరా తీశారు. 22 ఏ అమలుపై అధికారులను మంత్రి పొంగులేటి హెచ్చరించారు. 22ఏను భూతంగా చూపించి ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించిన మంత్రి జాప్యం చేయకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములు కాపాడాలని పిలుపునిచ్చారు. 22-ఏలో భూమి ఉందనే ఒక్క కారణంతో ప్రజలను తిరస్కరించొద్దని తెలిపారు. భూమి నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చిందో పరిశీలించాలన్నారు. సంబంధిత రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి సూచించారు.